RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com





# వుదయం




గుంటూరు 09-09-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 176 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

## శాసనసభ నియమావళి ఉల్లంఘనపై హైకోర్టులో విచారణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం) :** శాసనసభ ప్రాంగణం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనాన్ని ఆశ్రయించింది. ఎమ్మెల్యేలను లోపలికి వెళ్లకుండా నిరోధించవద్దని, అలాగే వారి పట్ల అనుచితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డి ధర్మాసనానికి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులు చేతబూని, వ్యతిరేక రాతలతో ఉన్న నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీ వద్ద బైఠాయించారని కోర్టుకు తెలిపారు. శాసనసభ వద్ద భయాందోళనకర వాతావరణం సృష్టించేందుకు యత్నించారని, నిబంధనలను ఉల్లంఘిస్తూ నిషేధాజ్ఞలు ధిక్కరించారని స్పష్టం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకే పోలీసులు కల్పించుకున్నారని, విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఇతర పోలీసులపై ఎమ్మెల్యేలు నెట్టివేతలకు, దూషణలకు పాల్పడ్డారని ఏజీ వివరించారు. శాసనసభ నియమావళి ప్రకారం స్పీకర్ జారీ చేసిన ఆదేశాల మేరకే సభ్యులను అడ్డుకున్నామని తెలిపారు. సభ్యులపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌దే కదా అని ధర్మాసనం ప్రశ్నించగా, ఈ చర్యలన్నీ స్పీకర్ సూచనల మేరకే జరిగాయని ఏజీ న్యాయస్థానానికి స్పష్టం చేశారు.

# అసెంబ్లీ ఘటన వెనుక ఫామ్‌హౌస్ కుట్ర



- స్పీకర్‌పై దాడి ప్రజాస్వామ్యానికే అవమానం
- సభాపతి స్థానాన్ని అవమానించడం తెలంగాణ ఆత్మగౌరవంపై దాడే
- సభ నియమావళిని అమలు చేయడమే స్పీకర్ చేసిన తప్పా?
- దామోదర రాజనర్సింహ తీర్మానానికి డిప్యూటీ సీఎం భట్టి సంపూర్ణ మద్దతు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం బ్యూరో) :**

శాసనసభలో సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభలో కీలక ప్రసంగం చేశారు. సభాపతి స్థానంలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, దాడికి దిగడం కేవలం వ్యక్తిగత అవమానం కాదని, ఇది యావత్ ప్రజాస్వామ్యానికి, శాసనసభకు జరిగిన తీరని అవమానమని ఆయన పేర్కొన్నారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్ పట్ల ప్రతిపక్ష సభ్యులు ప్రవర్తించిన తీరు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటన కాకతాళీయంగా జరిగింది కాదని, సమావేశాలకు ముందు రోజు ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలోనే దీనికి సంబంధించిన కుట్ర రూపుదిద్దుకుందని డిప్యూటీ సీఎం ఆరోపించారు. సభలో డిస్‌ప్లే బ్యాడ్జీలు, స్లోగన్స్‌తో ఉన్న నల్ల టీషర్టులను ధరించడం నియమావళికి విరుద్ధమని, స్పీకర్ నిబంధనలను అమలు చేయడానికే ప్రయత్నించారని ఆయన స్పష్టం చేశారు. సభాపతి స్థానాన్ని, ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెబుతూ, మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానానికి భట్టి విక్రమార్క సంపూర్ణ మద్దతు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి






- ఐ అండ్ పీఆర్ కార్యాలయంలో టీఈజీజేఏసీ నిరసన
- సెప్టెంబర్ 10 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి
- టీజీఓస్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపు
- పిఆర్సి, పెండింగ్ డిఏలపై సమరభేరి
- రాష్ట్రవ్యాప్తంగా భోజన విరామ సమయంలో ఉద్యోగుల ఆందోళన
- ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం) :**

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీఈజీజేఏసీ) ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీజీఓస్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, జేఏసీ నాయకులు గండూరి వెంకటేశ్వర్లు, నాగులపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీన తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల ఉద్యోగులతో సన్నాహక సమావేశాలు, నిరసనలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా నూతన పీఆర్సీ నివేదికను అమలు చేయడం, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయడం, పదోన్నతులు కల్పించడంతో పాటు హెచ్ఓడీ కార్యాలయాల్లో 12.5 శాతం కోటాను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎన్జీఓస్ హైదరాబాద్ సెంట్రల్ యూనియన్ ప్రతినిధి వెంకటేశ్, టీఈజీజేఏసీ సభ్యుడు ఐ అండ్ పీఆర్ ఫోరం అధ్యక్షుడు నాగులపల్లి వెంకటేశ్వరరావు, టీజీఓస్ ఫోరం జాయింట్ సెక్రటరీ వనజ, టీఎన్జీఓస్ ఐ అండ్ పీఆర్ ఫోరం అధ్యక్షుడు జితేందర్‌తో పాటు జేఏసీ నాయకులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంతే కదా...!




# ప్రధాని మోదీ సభ వద్ద భద్రతా ఉల్లంఘన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (ఎఎంస్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనాల్సిన ఓ కార్యక్రమంలో తీవ్ర భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. ముంబయిలోని బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ప్రారంభం కానున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026' వేదిక వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రోహన్ పరేఖ్ (24) అనే వ్యక్తితో పాటు అతడి గన్‌మెన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) పేరిట ఉన్న నకిలీ గుర్తింపు కార్డును, ఒక తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం కేసును ముంబయి క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. మరోవైపు, భారత్ అధ్యక్షతన దిల్లీలో జరగనున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ముందే, సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో సహకారం మరింత విస్తరిస్తోందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. ఈ భేటీలో వాణిజ్య, ఆర్థిక అంశాలతో పాటు ఉక్రెయిన్ సంక్షోభం, గల్ఫ్ ఉద్రిక్తతలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధ నివారణకు భారత్ మధ్యవర్తిత్వం వహించడాన్ని రష్యా స్వాగతిస్తుందని ఆయన పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమిని కేవలం ఒక వేదికగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలో శక్తివంతమైన కూటమిగా డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి విస్తరణకు రష్యా పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.

# జర్నలిస్టుల భావ స్వేచ్ఛను హరిస్తే సహించం



- ఢిల్లీలో మహిళా విలేకరులపై దాడి దారుణం: బషీర్‌బాగ్‌లో పాత్రికేయుల మహా ప్రదర్శన
- మీడియా హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం: దేవులపల్లి అమర్
- పాత్రికేయులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- హైదరాబాద్‌లో ప్రజాస్వామికవాదుల గళం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం)**

దేశంలో భావప్రకటన స్వేచ్ఛను, మీడియా హక్కులను కాలరాసేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికవాదుల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు. ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ అరెస్టులను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో భారీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని టీయూడబ్ల్యూజే కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ నిజాం కాలేజ్ మీదుగా బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వరకు సాగింది.

అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మైనార్టీ వర్గానికి చెందిన మహిళా విలేకరులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్‌లపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని సభలోని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు, దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయూడబ్ల్యూజే మహిళా విభాగం కన్వీనర్ రాజేశ్వరి, ప్రగతిశీల మహిళా సంఘం నేత సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న పత్రికల సంఘం నేతలు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఎన్. హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్‌లతో పాటు పెద్ద సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.


# హిట్లర్ కంటే ఘోరమైన గతి పడుతుంది



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రిమినల్ ప్రవృత్తితో వ్యవహరిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం తన పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే స్పీకర్ అంశాన్ని తెరపైకి తెచ్చి చిల్లర రాజకీయం చేస్తోందని ఆరోపించారు. శాసనసభ వద్ద తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై దాడికి పాల్పడి దారుణంగా వ్యవహరించారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలి సభ్యుడు స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలూ చేయకపోయినప్పటికీ, అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు విచారం వ్యక్తం చేస్తూ ఇప్పటికే లిఖితపూర్వక ప్రకటన విడుదల చేశారని గుర్తుచేశారు. అయినా ఈ అంశాన్ని రాజకీయం చేస్తూ కాంగ్రెస్ శ్రేణులను, ప్రజాప్రతినిధులను ఉసిగొల్పి గజ్వేల్‌లోని కేసీఆర్ నివాసంపైకి వేలాది మందిని పోలీసు ఎస్కార్ట్‌తో పంపించారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తెలంగాణను సాధించిన నాయకుడిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం కోట్లాది మంది ప్రజల గుండెలను గాయపరచడమేనన్నారు.

## సభాపతిపై దాడి అనుచితం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం) :** శాసనసభ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రాంగణంలో చోటుచేసుకున్న దురదృష్టకర పరిణామాలపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మంగళవారం సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసారు. తొలిరోజు సమావేశాల సందర్భంగా కొందరు సభ్యులు సభాపతి పట్ల అసభ్యకర పదజాలంతో ప్రవర్తించడమే కాకుండా, విధుల్లో ఉన్న అధికారులపై దాడులకు తెగబడటం తెలంగాణ సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించడం, ఆ పరిణామాలతో ఆయన శాసనసభా వేదికగానే తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టడంపై మీడియాలో వచ్చిన కథనాలను చూసి సీఎం చలించిపోయారు. మంగళవారం అసెంబ్లీకి చేరుకున్న వెంటనే సీఎం నేరుగా స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు.



# విద్యార్థి హక్కుల సాధనకు ఐక్యత



* ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి

నారాయణఖేడ్: సెప్టెంబర్ 08(వుదయం)

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని కళాశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కుల కోసం 90 ఏళ్లుగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్న దేశంలోని మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, అధ్యాపకుల కొరత, హాస్టల్ సమస్యలు, స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుని సమస్యలపై ప్రశ్నించాలని, అన్యాయాన్ని ఎదురించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు."చదువు - పోరాడు" అనే నినాదంతో విద్యార్థులను చైతన్యపరుస్తూ, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని దత్తు రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి కళాశాలలో ఏఐఎస్ఎఫ్‌ను బలోపేతం చేసి, విద్యార్థుల సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అశోక్, వంశీ, అరవింద్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు వివరాలు వెల్లడించిన ప్రభుత్వం



* భద్రత కోసం గణేష్ మండపాల వివరాలు. నమోదు చేయాలి:ఎస్ఐ కోటేశ్వరరావు

వుదయం మనూర్ సెప్టెంబర్ 8

నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మానూర్ మండలం.నిబంధన: గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే,మండపాల నిర్వాహకులు,తప్పనిసరిగా తమ పూర్తి,వివరాలను పోలీసులకు.అందించాలి. ఆన్‌లైన్,నమోదు: చిన్న, పెద్ద అనే,తేడా లేకుండా ప్రతి మండపం, నిర్వాహకుడు పోలీసుపోర్టల్ .త్రపోలిస్ గవర్నమెంట్ .ఇంకా వెబ్‌సైట్‌లో విగ్రహం మరియు,మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి.పోలీస్ స్టేషన్‌లో సమర్పణ: ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల జిరాక్స్ ప్రతిని మానూర్ పోలీస్ స్టేషన్‌లో అందజేయాల్సి ఉంటుంది. లక్ష్యం: సరైన సమాచారాన్ని సమయానికి అందిస్తే, గణేష్ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయడానికి పోలీసులకు వీలవుతుంది.

# ఈనెల 11న మహా చండీ హోమం



తిమ్మాజిపేట, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):

మండలంలోని అప్పాజీపల్లి స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 11న మహా చండీ హోమం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు

అమావాస్య సందర్భంగా శుక్రవారం ఉదయం 9.45 గంటలకు స్వామివారి సన్నిధిలో వేద పండితులు జోషి వేదం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో హోమం జరుగుతుందని పేర్కొన్నారు.భక్తులు హోమంలో పాల్గొని తీర్థ, అన్న ప్రసాదాలు స్వీకరించాలని కోరింది. హోమంలో పాల్గొనే భక్తులు రూ.500 చెల్లించి గోత్ర నామాలను ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు

# ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్



* తాతా మధుసూదన్ దిష్టిబొమ్మ దహనం

వుదయం, నంగునూర్ ( సెప్టెంబర్ 8 )

అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతారహితమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్ . రాజ్ బహదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్,ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్,ప్రభాకర్,చేర్యాల కృష్ణా, ప్యాక్స్ డైరెక్టర్ కర్రెడ్డి వెంకట్ రెడ్డి, కాటం. కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి పదిరే శ్యామ్ రెడ్డి,పిల్లి మహేష్, బర్రె సంతోష్ రెడ్డి,బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి,నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్ జిన్నా సంపత్ రెడ్డి నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ గురువుకు అపూర్వ సన్మానం



కోహీర్ సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి )

సంగారెడ్డి జిల్లా పరిధిలో విద్యాబోధనలో విశేష సేవలు అందించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గౌరవనీయ ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్ సార్‌ను గురుపూజోత్సవం గురువందన కార్యక్రమంలో భాగంగా బుచ్చనెల్లి పాఠశాల ప్రాంగణంలో పై డిగుమల్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు మహేష్ నర్సింగ్ పవార్ శాలువా కప్పి,పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవ్ కుమార్ సార్ కృషిని ప్రత్యేకంగా కొనియాడారు.విద్యార్థులకు క్లిష్టమైన విషయాలను సైతం సులభమైన రీతిలో అర్థమయ్యేలా బోధిస్తూ, వారిలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడంలో సంజీవ్ కుమార్ సార్ ఎంతో కృషి చేశారు.పాఠశాల అభివృద్ధిలోనూ, విద్యార్థుల క్రమశిక్షణ, నైతిక విలువల పెంపొందించడంలోనూ ఆయన నిరంతరం ముందంజలో ఉంటారు. కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో, వారి లక్ష్య సాధనకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ వారి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్నారు.విద్యార్థులపై చూపించే ప్రేమాభిమానాలు, బోధనా పద్ధతుల వల్ల ఆయన విద్యార్థుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు.విద్యా రంగానికి ఆయన చేసిన నిరంతర సేవలకు గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం ఎంతో గర్వంగా ఉందని ఇది ఇతరులకు కూడా స్ఫూర్తిదాయకమని సహచరులు పేర్కొన్నారు.సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, ఇటువంటి నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మన అందరి బాధ్యత అని వారు తెలిపారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత సంజీవ్ కుమార్ సార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ పురస్కారానికి ఎంపిక చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులకు, తనకు నిరంతరం సహకరించిన తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండలం బుచ్చనెల్లి గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,గ్రామ ప్రముఖులు, సంజీవ్ కుమార్ సార్‌ను అభినందించారు

# ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన: పీడీ



తెలకపల్లి సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి)

మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి, పెద్దూరు, పెద్దపల్లి, గ్రామాల్లో నిర్మిస్తున్నటువంటి ఇంద్రమ్మ ఇండ్ల పురోగతిని మంగళవారం హౌసింగ్ పీ డి గోపాల్ నాయక్ పరిశీలించారు. మొదటి విడత మంజూరైనటువంటి ఇండ్లను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఫోటోలు దింపిన వెంటనే చివరి దశ డబ్బుల చెల్లింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇకముందు గుడిసెలు లేని గ్రామాలు దర్శనమిస్తాయన్నారు. గుడిసెలు ఉన్నవారి కోసం మంజూరైన ఇండ్ల పనులు వెంటనే మొదలు పెట్టాలని కోరారు. అదేవిధంగా గోడలు బలంగా ఉండి మట్టి కప్పు, రేకుల ఉన్నవారు కప్పు పునర్నిర్మాణానికినికి అర్హులని తెలిపారు. ఇందుకుగాను 2 లక్షలు మంజూరు చేయబడతాయని, అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశంను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఆయనతోపాటు డి ఈ హరినాయక్, ఎంపీ డీ వో వెంకటయ్య, తదితరులు ఉన్నారు

# ఫిజియోథెరపీ ప్రాముఖ్యతపై డాక్టర్ కృష్ణ



నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):

ఫిజియోథెరపీ ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ సూచించారు.ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది. డీఎంహెచ్ఓ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఫిజియోథెరపీ ప్రాధాన్యతపై నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి.ఎన్.సుమంత్, కార్యదర్శి డాక్టర్ ఎన్.సృజన, కోశాధికారి డాక్టర్ అంజలి, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

# రుణాల తలుపులు తెరవండి.. అర్హులకు అండగా నిలవండి!

* ఆర్ఎస్ఈటీఐ శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలి
* కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం

గద్వాల, సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)



జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ విరివిగా రుణాలు అందించి స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బ్యాంకర్లు - అధికారులు సమన్వయం తో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రుణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా డీసీసీ-డీఎల్ఆర్సీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన, సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, మత్స్యకారుల కిసాన్ క్రెడిట్ కార్డు, ముద్ర, గృహ, వ్యవసాయ రుణాల మంజూరును వేగవంతం చేయాలని ఆదేశించారు.క్రెడిట్ -డిపాజిట్ నిష్పత్తి మార్చి 31న 228.74 శాతం నుంచి జూన్ 30 నాటికి 227.60 శాతానికి తగ్గిందని, రుణాల మంజూరును పెంచి నిష్పత్తిని మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రాధాన్యత రంగం, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రంగాల్లో రుణాల లక్ష్య సాధనకు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సదుపాయాలను విస్తరించాలని, స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీని వేగవంతం చేసి అర్హత ఉన్న సంఘాలకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్ఎస్ఈటీఐలో శిక్షణ పొందిన నైపుణ్యవంతులకు రుణాలు అందించి, వారు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని అన్నారు. బ్యాంకర్లు, అధికారులు క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అనంతరం వార్షిక రుణ ప్రణాళిక 2026-27 పుస్తకాలను, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థపై అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం మోహన్ రెడ్డి, ఆర్బీఐ ప్రతినిధి శ్రీనివాసులు వెన్న, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశాల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లాలో ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు కాదు.. వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించకుండా, ప్రశ్నిస్తున్న కార్మికులను, కార్మిక నాయకులను పోలీస్ స్టేషన్లకు తరలించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వస్తే కార్మిక నాయకులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండున్నరేళ్లలో ఒక్కరోజు కూడా చర్చలు జరపలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేదని, ప్రజా పోరాటాల ద్వారానే పాలకులకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఈ క్రమంలో ఆశా వర్కర్లు శిరీష, పద్మ, జ్యోతి, శ్రీదేవిలను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.

# ఉద్యోగుల సమస్యలపై జేఏసీ నిరసన



ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో నిరసన వ్యక్తం చేసిన తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ.

మంగళవారం మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీఈజీజేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా TGOs అధ్యక్షులు కృష్ణాయాదవ్ మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘం నాయకులు గండూరి వెంకట్, నాగులపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అందుకోసం అన్ని శాఖల ఉద్యోగులతో సన్నాహాక సమావేశాలు, నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోజు మండల, డివిజన్, జిల్లా కేంద్ర కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ఈ నిరసనలు రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నట్లు టీఈజీజేఏసీ ప్రకటించింది. ప్రధానంగా పి.ఆర్.సి., పెండింగ్ డి.ఎ.లు, పదోన్నతులు, హెచ్.ఓ.డి. కార్యాలయాలలో 12.5 శాతం కోటా, మొదలగునవి వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో TNGOs Hyd సెంట్రల్ యూనియన్ నుండి వెంకట్, TEGJAC Member & I&PR ఫోరం అధ్యక్షులు నాగులపల్లి వెంకటేశ్వర రావు, TGOs ఫోరం జాయింట్ సెక్రటరీ వనజ, TNGOs I&PR ఫోరం అధ్యక్షులు జితేందర్, తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అక్క మహాదేవి మందిరంలో పూజలు



సదాశివపేట వుదయం :

తెలంగాణ రాష్ట్రంలో సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన చారిత్రాత్మక అక్క మహాదేవి మందిరంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను సదాశివపేట వీరశైవ లింగాయత్ మహిళా విభాగం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గంధిగా రాజు మాట్లాడుతూ వైరాగ్యానికి ప్రతీక అక్కమహాదేవి,వీరశైవ-లింగాయత సంప్రదాయంలో అక్క మహాదేవి ఒక మహోన్నత ఆధ్యాత్మిక సాధ్విగా, భక్తి-వైరాగ్యానికి ప్రతీకగా నిలిచారని పలువురు పేర్కొన్నారు .12వ శతాబ్దానికి చెందిన అక్కమహాదేవి చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తూ, పరమశివుడైన చెన్నమల్లికార్జునుడిని తన ఆరాధ్య దైవంగా భావించారు. భౌతిక బంధాలు, ప్రాపంచిక సుఖాలను త్యజించి, ఆత్మజ్ఞానం మరియు శివ భక్తి మార్గంలో నడిచారు అన్నారు. సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు అనిమిశెట్టి అన్నపూర్ణ మాట్లాడుతూ అక్కమహాదేవి తన వచనాల ద్వారా భక్తి, జ్ఞానం, వైరాగ్యం, స్త్రీ స్వాతంత్ర్యం, ఆత్మగౌరవం వంటి విలువలను సమాజానికి చాటి చెప్పారు. ఆమె జీవితం మహిళలకు ఆధ్యాత్మిక ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి, సమాజంలోని అనవసర బంధాలను అధిగమించే స్ఫూర్తికి ఆదర్శంగా నిలిచింది. అక్కమహాదేవి జీవితం నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని, భక్తి, త్యాగం, ధైర్యం, ఆత్మజ్ఞానం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు,ఈ సందర్భంగా అక్క మహాదేవి అమ్మవారి విగ్రహానికి పవిత్ర అభిషేకం నిర్వహించి, బిల్వ పత్రి, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అక్క మహాదేవి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

ఈ కార్యక్రమంలో కవిత, సంధ్య, మహేశ్వరి, సావిత్రి,రమ,స్వాతి,పల్లవి, అర్చన,నర్మదా,సవిత,మంజు,నాగమణి,లలిత, అరుణ, సమంత,అనురాధ,అన్నమ్మ,నాగరాణి, మల్లమ్మ,పద్మ,అనురాధ,సుధారాణి, ఇందిరా, స్వరూప, శ్రీదేవి, అనూష, సాధన, నిర్మల, విద్య తదితరులు పాల్గొన్నారు

# హామీల అమలుకు ఆశా నిరసన



నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 08, (వుదయం ప్రతినిధి):

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్వహించిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్లకు చెందిన ఆశా కార్యకర్తలు జ్యోతి, పద్మ, అనిత హైదరాబాద్‌కు బయలుదేరగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. తమ సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని, కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు


# పర్యావరణ హితంగా వినాయక చవితి



వనపర్తి సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి)

సెప్టెంబర్ 14వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన గోడ పోస్టర్‌ను, విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణహితమైనవని, నీటిలో త్వరగా కరిగిపోవడం వల్ల జల కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేందుకు ముందుకు రావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ద్వారా 2,000 మట్టి వినాయక విగ్రహాలను త్వరలో పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు.బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి బలవంతపు వివాహాల నిర్మూలనకు సంబంధించి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎన్‌జీఓ) మరియు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించి వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆవిష్కరించారు.బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని, బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బాలల హక్కులను కాపాడుతూ, బాలికలకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త, నోడల్ అధికారి అనిల్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, కార్మిక శాఖ అధికారి రవి, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మల ఐక్యతకు వేదిక.. 17న ఘనంగా విశ్వకర్మ యజ్ఞం



గద్వాల సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)


జోగులాంబ గద్వాల జిల్లా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న గద్వాల పట్టణంలోని విశ్వకర్మ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న విశ్వకర్మ యజ్ఞం కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మంగళవారం సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షులు సప్తగిరి బ్రహ్మయ్య, జిల్లా అధ్యక్షులు కే. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ విశ్వకర్మ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని యజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, జిల్లా కోశాధికారి విశ్వేశ్వరాచారి, పట్టణ అధ్యక్షులు గాంధీ, బాలయ్య (నరసింహాచారి), బసవరాజు, రామకృష్ణ, పట్టణ కోశాధికారి సురేష్, జాయింట్ సెక్రటరీ నాగరాజు ఆచారి, సర్వేశ్వర ఆచారి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విశ్వకర్మ యజ్ఞాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పిద్దాం

* కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 08:--వుదయం.



వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప వీరనారి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించాలని కలెక్టర్ కోరారు.

# ఆశ వర్కర్ల అరెస్ట్ చేయడం దుర్మార్గం




**దమ్మపేట సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి ):**

దమ్మపేట,–ఆశా వర్కర్ల న్యాయమైన సమస్య లు నెరవేర్చాలిఅని హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్న ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం అని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో సాధించింది అక్రమ అరెస్టులు చేయడమేనా అని సి.ఐ.టి.యు, జిల్లా ఉపాధ్యక్ష్యులు పిట్టల అర్జున్ అన్నారు. మంగళవారం ఆశ వర్కర్ల అక్రమ అరెస్టులను నిరసిస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక సందర్భంగా ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ 18,000/- ఇస్తామని హామీ ఇచ్చింది, ఇచ్చిన హామీ నెరవేర్చాలని అడగటం రేవంత్ రెడ్డి పాలనలో నేరమైందని అన్నారు. ఆశ వర్కర్ల ఆరు నెలల పిఆర్సి ఏరియాస్ పెండింగ్ లో ఉన్న లెప్రసీ సర్వే పల్స్ పోలియో ఎలక్షన్ డ్యూటీ తదితర బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఏఎంసీ పిఎంసి టార్గెట్స్ ను రద్దు చేయాలని, 50 లక్షల ఇన్సూరెన్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు సునీత, రజిని, సంధ్య,నాగమణి, వరదరాని, సుజాత, రాధ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పోరుబాట.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సండ్ర వెంకట వీరయ్య ఫైర్

**సత్తుపల్లి సెప్టెంబర్ 8 ( వుదయం ప్రతినిధి)**

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పై జరిగిన ప్రభుత్వ దాడిని ఖండిస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ వేంసూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో మర్లపాడు పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు వరకు నల్ల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చినట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ శాసనసభ, స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని, స్పీకర్‌ను లేదా శాసనసభను అవమానించడం తమ పార్టీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ఉందని సండ్ర అన్నారు. పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపిన సందర్భాలను ప్రస్తావిస్తూ.. తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు నల్ల దుస్తులతో నిరసన తెలిపితే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ నేతలు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్నది బీఆర్ఎస్ ఆరోపణ కాగా, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని సండ్ర డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని సండ్ర విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి –షాదీ ముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్లు వంటి హామీలను నెరవేర్చాలని కోరారు. రైతు భరోసా, రైతు బీమా, యూరియా సమస్యలపై కూడా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, దళితులు సహా అన్ని వర్గాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యలు, హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటం ఇక్కడితో ముగియదని.. మరింత ఉధృతం చేస్తామని




సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా నిరసనకు తరలివచ్చిన మహిళలు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలకు సంబంధించిన పలు వినతి పత్రాలను అధికారులకు సమర్పించారు.

# స్పీకర్, ఎమ్మెల్యేలను అవమానించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

**మండిపడిన చండూరు మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇరిగి శంకర్**

**చండూరు, సెప్టెంబర్ 8(వుదయం):**



శాసనసభలో దళిత ప్రజాప్రతినిధులపై బీఆర్ఎస్ నాయకులు అహంకారపూరితంగా వ్యవహరించడాన్ని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చండూరు మున్సిపల్ అధ్యక్షుడు ఇరిగి శంకర్ తీవ్రంగా ఖండించారు. దళిత సమాజానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తొలి దళిత సీఎం, మూడెకరాల భూమి హామీలతో మోసం చేయడమే కాకుండా, నాడు డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్యను అవమానించారని మండిపడ్డారు. నేడు కాంగ్రెస్ పాలనలో దళితులకు దక్కుతున్న గౌరవాన్ని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై పాడి కౌశిక్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తల్లిపై ఎమ్మెల్సీ తాతా మధు అవమానకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో దళిత సమాజం చేతిలో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# ఎంబీబీఎస్ చదువుకు రూ.1.20 లక్షల ఆర్థిక సహాయం



**భద్రాచలం, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):**

తల్లిదండ్రులు లేకపోయినా కష్టాలను అధిగమిస్తూ చదువులో ప్రతిభ కనబరిచి వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఓ కోయ ఆదివాసీ విద్యార్థికి భద్రాచలం సమాజం అండగా నిలిచింది. ములకలపల్లి మండలం సీతాయిగూడెం గ్రామానికి చెందిన కోయ ఆదివాసీ విద్యార్థి నక్క సంతోష్ తన స్వశక్తితో చదువుకుని నీట్ పరీక్షలో 424 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటును పొందడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆర్థిక, కుటుంబ పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ చదువును కొనసాగించిన సంతోష్‌కు వైద్య విద్యలో ప్రవేశం లభించడం ఆనందాన్ని కలిగించినప్పటికీ, అడ్మిషన్ ఫీజు చెల్లించడం కుటుంబానికి పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం అరుంధతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కేటాయించిన ఎంబీబీఎస్ సీటును కొనసాగించేందుకు సెప్టెంబర్ 08, 2026 మంగళవారం లోపు రూ.1,20,000 ఫీజు చెల్లించాల్సి ఉండటంతో ఈ విషయం పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల దృష్టికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ బి. రాహుల్ విద్యార్థి నక్క సంతోష్ పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించారు. ఆదివాసీ విద్యార్థి ఉన్నత చదువుకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఐటీడీఏ ద్వారా రూ.60,000 ఆర్థిక సహాయం అందించారు. పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకూడదనే సంకల్పంతో ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తీసుకున్న చొరవపై ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఐటీడీఏ ద్వారా రూ.60,000 అందిన తర్వాత మిగిలిన రూ.60,000ను సమీకరించేందుకు ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. నక్క సంతోష్ వైద్య విద్యా కలను సాకారం చేయాలనే ఒకే లక్ష్యంతో పలువురు తమ వంతు సహాయాన్ని అందించారు. ముఖ్యంగా కేవలం ఒక గంట వ్యవధిలోనే రూ.60,116 మొత్తాన్ని సమీకరించడం విశేషంగా నిలిచింది. సమాజంలో ఇంకా మానవత్వం, సేవాభావం సజీవంగా ఉన్నాయని ఈ సంఘటన మరోసారి నిరూపించిందని ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో ఐటీడీఏ పీఓ శ్రీ బి. రాహుల్ గారు రూ.60,000 అందించగా, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. మధుకర్ గారు రూ.11,116, కుంజా ధర్మా గారు (బీజేపీ) రూ.5,000, తెల్లం రమణయ్య, అనురాధ దంపతులు – బీసీఎం రూ.5,000, కుర్సం ఎర్రయ్య, ఎస్. వెంకటలక్ష్మి దంపతులు ఖమ్మం నుంచి రూ.5,000, డీడీ కార్యాలయానికి చెందిన ఎం. రామకృష్ణా రెడ్డి గారు రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. అలాగే కొండ్రు వీరస్వామి, కొండ్రు సుధారాణి దంపతులు రూ.2,000, డీడీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్. రమణమూర్తి గారు రూ.2,000, ఇర్పా నారాయణ గారు రూ.2,000, జూనియర్ అసిస్టెంట్ బొర్ర రంగయ్య గారు రూ.2,000 చొప్పున సహాయం అందించారు. ఈసం అశోక్ గారు రూ.1,000, డీడీ కార్యాలయానికి చెందిన గలిగ సురేష్ గారు రూ.1,000, ఎం. ప్రసాద్ గారు రూ.1,000, పీఈటీసీ ప్రిన్సిపల్ డా. ఎం. వీర నాయక్ గారు రూ.1,000, ఉపాధ్యాయుడు కోరస ఉమా మహేశ్వరరావు గారు రూ.1,000, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ గారు రూ.1,000, అడ్వకేట్ పాయం రవివర్మ గారు రూ.1,000 చొప్పున తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ భవాని గారు రూ.3,000 అందజేశారు. వీరితో పాటు ఆన్‌లైన్ ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు స్పందించి రూ.11,000 ఆర్థిక సహాయం అందించారు. ఒక ఆదివాసీ విద్యార్థి డాక్టర్ కావాలనే కలను నిజం చేయాలనే ఉద్దేశంతో అందరూ ఒక్కటై స్పందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సమాజం నుంచి సమీకరించాల్సిన రూ.60,000 లక్ష్యాన్ని కేవలం గంట వ్యవధిలోనే పూర్తి చేయడం ఆదివాసీ ఐక్యతకు, భద్రాచలం ప్రజల సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సందేశాన్ని ఈ ఘటన సమాజానికి అందించిందన్నారు. తల్లిదండ్రుల అండ లేకపోయినా చదువుపై ఉన్న పట్టుదలతో నీట్‌లో 424 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందిన నక్క సంతోష్ ఇప్పుడు వైద్య విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఆదివాసీ ప్రాంతాలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు నాయకులు తెలిపారు. అతని ఉన్నత లక్ష్యానికి భద్రాచలం ఐటీడీఏతో పాటు ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు, దాతలు, ప్రజలు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో వెంటనే స్పందించి ఐటీడీఏ ద్వారా రూ.60,000 ఆర్థిక సహాయం అందించిన ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ బి. రాహుల్ గారికి ఆదివాసీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆర్థిక సహాయం అందించిన ప్రతి దాతకు, ఉద్యోగులకు, నాయకులకు, ఆన్‌లైన్ ద్వారా స్పందించిన ప్రతి ఒక్కరికీ నక్క సంతోష్ కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం కోయ కుల సంఘం పటేల్ తెల్లం రమణయ్య, ఆదివాసీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, పూనెం వీరభద్రం, గుండు శరత్, పాయం రవివర్మ, పూనెం నాగేశ్వరరావు, కొండ్రు వీరస్వామి, కొండ్రు సుధారాణి, కణితి రాధ, మిడియం నాగమణి తదితరులు పాల్గొని విద్యార్థి నక్క సంతోష్‌కు అభినందనలు తెలియజేస్తూ, అతని వైద్య విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆదివాసీ ప్రాంతం నుంచి ఒక యువకుడు వైద్యుడిగా ఎదగాలనే ఆశయానికి భద్రాచలం ప్రజలు చూపిన ఈ సహకారం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# ఎమ్ఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు

**మునగాల, సెప్టెంబర్ 8 (వుదయం):**



మాదిగ ఉద్యోగ సమైక్య జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మునగాల మండలం విజయరామపురం గ్రామానికి చెందిన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లును నియమించినట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి దశ నుంచే మాదిగ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు 1995లో ఉమ్మడి నల్గొండ జిల్లా మాదిగ విద్యార్థి సంఘం జిల్లా సహ కన్వీనర్‌గా, 1996లో ఉస్మానియా విశ్వవిద్యాలయ మాదిగ విద్యార్థి సమాఖ్య కన్వీనర్‌గా పనిచేశారు. 1998లో ఉపాధ్యాయుడిగా నియమితులైన అనంతరం మాదిగ ఉద్యోగ సంఘంలో కోదాడ నియోజకవర్గ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉమ్మడి నల్గొండ జిల్లా మాదిగ ఉద్యోగ సంఘం సంయుక్త కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాదిగ ఉద్యోగ సంఘం సంయుక్త కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. 2021 నుంచి ఇటీవల వరకు మాదిగ ఉద్యోగ సమైక్య జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 33 స ంవ త ్సరాలుగా మాదిగ జాతి కోసం నిబద్ధతతో పనిచేస్తూ, వర్గీకరణ ఉద్యమంలో విద్యార్థిగా, ఉద్యోగిగా చేసిన కృషికి గుర్తింపుగా జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్ష పదవి లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత 33 సంవత్సరాలుగా మాదిగ జాతి సేవకు గుర్తింపుగా మందకృష్ణ మాదిగ అప్పగించిన ఈ బాధ్యతను గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారు ఆశించిన విధంగా బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

# అక్రమ అరెస్టులకు నిరసనగా కమల్ రాజు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

**మధిర, సెప్టెంబర్ 8, వుదయం ప్రతినిధి:**



కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై మధిరలో మహిళలు కన్నెర్ర చేశారు. ఎమ్మెల్సీ తాత మధు అక్రమ అరెస్ట్‌ను మరియు నిన్న అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యులపై జరిగిన పాశవిక దాడిని నిరసిస్తూ మాజీ జడ్పీ చైర్మన్, బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో మధిర పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.మధిర పురవీధుల్లో మహిళల కదంతొక్కిన ఈ ర్యాలీతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న ఆగ్రహం స్పష్టంగా కనిపించింది. ప్రశ్నిస్తే అరెస్టులు నిరసిస్తే దాడులు ఇదేనా ప్రజాపాలన అంటూ మహిళలు ప్రభుత్వ తీరుపైతీప్రస్థాయిలోమండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల తరపున ప్రశ్నించే హక్కును కాలరాస్తూ అరెస్టులు, దాడులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం అని కమల్ రాజు తీవ్రంగా విమర్శించారు.మహిళా శాసనసభ్యులపై దాడి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై చేయి చేసుకునే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటని, దీనికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పక్కన పెట్టి నయవంచన పాలన సాగిస్తోందని కమల్ రాజు ఆరోపించారు.ప్రజల గొంతుకలను అణచివేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టలేరని అన్నారు.తాత మధు అరెస్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, మహిళా శాసనసభ్యులపై దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని కమల్ రాజు హెచ్చరించారు.మధిరలో జరిగిన ఈ భారీ నిరసన ర్యాలీతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత మరోసారి బహిర్గతమైందని కమల్ రాజు పేర్కొన్నారు. ప్రజల గొంతును అణచాలని చూస్తే అదే ప్రజాగ్రహం ప్రభుత్వాన్ని ప్రశ్నించే మహా ఉద్యమంగా మారుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ వివిధ మండలాల మాజీ అధ్యక్షులు,మాజీ కార్యదర్శులు, సర్పంచులు మాజీ సర్పంచులు, మహిళా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ కమిటీ చైర్మన్ పదవికి దరఖాస్తు

**యాదాద్రి భువనగిరి, 08-09-2026**



ఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలొ పత్రిక సమావేశం లొ తెలంగాణ ప్రదేశ్ ఆదివాసి కాంగ్రెస్ యాదాద్రి జిల్లా అబ్జార్వర్ కావాడి మోహన్ కుమార్ గారు మాట్లాడుతూ గతం ఉన్న ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ జిల్లా చైర్మన్ మూడవత్ రాంజీ నాయక్ చౌహన్ ఉండగా వారి పదవి కాలం పూర్తి కావడం తో ఏఐసీసీ, టీ పి సి సి ,డి సీసీ ,తెలంగాణ ప్రదేశ్ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ శంకర్ నాయక్ గారి ఆదేశాల మేరకు నూతన కమిటీ దరఖాస్తు కి పిలుపు నివ్వడం జరిగింది ఉత్సాహం ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరైనా దరఖాస్తు చేసువాలని అన్నారు ఇట్టి దరఖాస్తు ఫారం రాంజీ నాయక్ గారి దగ్గర లేదా కాంగ్రెస్ పార్టీ గ్రూప్ లొ లభిస్తుంది అని అన్నారు ఈ కార్యక్రమం లొ ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున జిల్లా చైర్మన్ రాంజీ నాయక్ జిల్లా యస్ సి యస్ టి విజిలెన్స్ మని టరింగ్ కమిటీ సభ్యులు మోహన్ బాబు రవి నాయక్ నాయకుని తండా సర్పంచ్ రవీందర్ నాయక్ కుమార్ నాయక్ సురేష్ నాయక్ వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# తాతా మధు వ్యాఖ్యలను ఖండిస్తూ చర్లలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**చర్ల, సెప్టెంబర్ 8:(వుదయం ప్రతినిధి)**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయవచ్చని, అయితే వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు అనుమతులు కావాలి

**గంగారం ఎస్సై కోటేశ్వరరావు**

**గంగారం సెప్టెంబర్ 8 వుదయం:**


మహబూబాబా ద్ జిల్లా గంగారం మండల పరిధిలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, గణేష్ మండపాల ఏర్పాటుపై స్థానిక పోలీసులు మార్గదర్శకాలు జారీ చేశారు. మండలంలో ప్రతి గణేష్ మండపానికి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలని ఎస్సై స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు కమిటీ సభ్యులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాలలో విద్యుత్ భద్రత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా లౌడ్‌స్పీకర్ల వినియోగం ఉండకూడదని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అనుమతులు లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

**మునగాల, సెప్టెంబర్ 8 (వుదయం):**



మున గాల మ ం డ ల ంలోని వివిధ గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి హెచ్చరించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగానే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసి తర్వాత సమస్యలు సృష్టిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మండపాల నిర్వాహకులు https://policeportal.tspolice.gov.in/index.htm ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులో నిర్వాహకుడి పేరు, మొబైల్ నంబర్, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, విగ్రహ వివరాలు, ఊరేగింపు మార్గం, నిమజ్జనం వివరాలతో పాటు ఇతర అవసరమైన సమాచారాన్ని నమోదు చేసి, సంబంధిత పత్రాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తయిన అనంతరం వచ్చే అక్నాలెడ్జ్‌మెంట్‌ను ప్రింట్ తీసుకుని భద్రపరుచుకోవాలని తెలిపారు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించే పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదేనని ఎస్ఐ సంజీవరెడ్డి స్పష్టం చేశారు.



# డీజేలకు నో పర్మిషన్

**మర్రిగూడ, సెప్టెంబర్ 8(వుదయం):**

రాబోయే వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని నాంపల్లి సీఐ D. రాజు, స్థానిక ఎస్ఐ B. రాంబాబు కోరారు. ఉత్సవాల నిర్వహణపై మండప నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండపాల్లో సౌండ్ పొల్యూషన్‌ను అరికట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే (DJ) లకు అనుమతి లేదని తేల్చి చెప్పారు. నియమావళిని అతిక్రమించి డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారిక పోర్టల్ ద్వారా ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో నిర్వాహకులు పహారా కాయాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ఉత్సవాల సజావు నిర్వహణకు మండప నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ రాజు విజ్ఞప్తి చేశారు.

# జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో మౌలిక వసతులు కల్పించాలి

- ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌లను తక్షణమే నియమించాలి
- విద్యార్థినుల ఆటస్థలాన్ని శుభ్రం చేసి కోతుల బెడదను నివారించాలి
- ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్

**భద్రాచలం, సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి)**



జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలో ఖాళీగా ఉన్న ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఫోర్త్ క్లాస్ సిబ్బంది లేకపోవడంతో పరిశుభ్రత, నిర్వహణ వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. విద్యార్థినులు ప్రతిరోజూ విద్యాభ్యాసం కోసం వచ్చే పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. పాఠశాలలో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌లు లేకపోవడం వల్ల పాఠశాల పరిశుభ్రతతో పాటు ఇతర నిర్వహణ పనులు సక్రమంగా జరగడం లేదని కొప్పుల రవీందర్ తెలిపారు. విద్యార్థినులు చదువుకునే తరగతి గదులు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యంగా బాలికల పాఠశాలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, కానీ తగినంత సిబ్బంది లేకపోవడంతో విద్యార్థినులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌లను నియమించడం ద్వారా పాఠశాల నిర్వహణను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థినులు వినియోగించే ఆటస్థలం ప్రస్తుతం సరైన పరిస్థితిలో లేదని తెలిపారు. ఆటస్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించి పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల శారీరక, మానసిక వికాసానికి ఆటలు ఎంతో అవసరమని, అందుకు అనుగుణంగా ఆటస్థలాన్ని అభివృద్ధి చేసి విద్యార్థినులు నిర్భయంగా ఆటలు ఆడుకునే వాతావరణాన్ని కల్పించాలని కోరారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద కూడా తీవ్రంగా ఉందని, దీంతో విద్యార్థినులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థినుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి, శ్రీహరికా, రాజేశ్వరి, నిహారిక, మౌనిక, సోనియా, నందిని, లిఖిత, గీతిక, భార్గవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

**కో-కన్వీనర్ ఐనవోలు పవన్**

**చర్ల, సెప్టెంబర్ 8:(వుదయం ప్రతినిధి)**



ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధును అక్రమంగా అరెస్టు చేయడాన్ని చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాలు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులతో అడ్డుకోవడం, కొట్టడం, కిందపడేసి తొక్కడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.మహిళా ఎమ్మెల్యేలను సైతం పోలీసులు మెడ పట్టుకుని తోసివేయడం, చీరలు లాగి అవమానించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు తెలంగాణ చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. ఈ ఘటనపై తాతా మధు ఆవేశపూరితంగా చేసిన వ్యాఖ్యలను పట్టుకుని ఆయనను అరెస్టు చేయడం ద్వారా అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్పీకర్‌కు తన వ్యాఖ్యల వల్ల బాధ కలిగితే, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని తాతా మధు ఇప్పటికే పత్రికాముఖంగా వెల్లడించారని తెలిపారు. అయినప్పటికీ ఆయనను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రజాప్రతినిధులైన మహిళా ఎమ్మెల్యేలకే లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానం తెలంగాణ మహిళలందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని, ఈ ఘటనపై అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును సస్పెండ్ చేయాలి



**మధిర, సెప్టెంబర్ 8, వుదయం, ప్రతినిధి:**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.సభా గౌరవాన్ని,రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించేలా మాట్లాడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ రావుపై నోటి దురుసుతో మాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు.దళితుల ఆత్మగౌరవాన్ని గౌరవించకుండా అవమానకరంగా మాట్లాడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.తాతా మధూ దళిత నాయకుడి పై నోరు పారేసుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు.బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయినా అహంకారం మాత్రం ఇంకా పోలేదని,పదవి పోయిన బాధతో రాజ్యాంగబద్ధమైన పదవులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పే వరకు తాతా మధును వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాతా మధు పై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.స్పీకర్ గౌరవం అంటే రాజ్యాంగ గౌరవం.. దళితుల ఆత్మగౌరవం అంటే తెలంగాణ ఆత్మగౌరవం.దానిని అవమానించే తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాల్సిందే అని కాంగ్రెస్ నాయకులు నినదించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు,మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్,మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్ రెడ్డి, కౌన్సిలర్లు బాణావత్ వెంకటరమణ నాయక్, బెజ్జం రాజు,దార నాగార్జున కాంగ్రెస్ పార్టీ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు,దేవి శెట్టి రంగారావు, ముప్వ వెంకయ్య బాబు,పత్తిపరపు సంగయ్య,సామినేని రామనాథం, బిట్రా ఉద్దండయ్యా,ఆదూరి శీను,మోదుగు బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు సాలిక సురేష్,గద్దల రాజా,గౌసుద్దీన్ మరియు వివిధ హోదాలలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.




మేం తిరిగి చంద్రుడిపైకి వెళ్తున్నాం...

"ఆర్టెమిస్ ఒప్పందాలపై భారత్ గర్వంగా సంతకం చేసింది. 'మూన్ బేస్ ప్రోగ్రామ్'లో మాతో చేరాలని నాసా అధికారికంగా ఇస్రోను ఆహ్వానించింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మేము (అమెరికా) చంద్రుడిపైకి తిరిగి వెళ్తున్నాం. చంద్రుడి ఉపరితలంపై మా పక్కన భారత్ ఉండాలని మేము కోరుకుంటున్నాం.నిసార్‌ను చూసినప్పుడు నాసా, ఇస్రోలు ప్రాణాలను కాపాడే ఒక సాధనాన్ని నిర్మించాయని మనకు అర్థమవుతుంది."

**- సెర్గియో గోర్, యూఎస్ రాయబారి**

## వేమన' పద్యం

**ఆత్మశుద్ధి లేని యాచారమది యేల**
**భాండశుద్ధి లేని పాకమేల?**
**చిత్తశుద్ధిలేని శివపూజలేలరా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**



# సంపాదకీయం

## కార్మికుల వైపు నిలబడటమే నేరమా..?

మోడీ, యోగి సర్కార్లు రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ఎంత నగ్నంగా బేఖాతరు చేస్తున్నాయో చెప్పడానికి మరో ఉదాహరణ ఆకృతి చౌదరిపై మోపిన 'నాసా' కేసు. ఆకృతి చౌదరి అనే పాతికేళ్ల యువతిని జాతీయ భద్రతా చట్టం (నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ ఎన్.ఎస్.ఎ) కింద ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జైల్లో పెట్టడాన్ని అలహాబాదు హైకోర్టు తప్పు పట్టింది. ఆమెను వెంటనే విడుదల చేయాలని ఆదేశించడమే కాదు, ఆమెపై తప్పుడు ఆరోపణలతో ఎన్.ఎస్.ఎ కేసు మోపి అరెస్టుకు ఆదేశించిన నోయిడా జిల్లా కలెక్టర్ ఆమెకు రూ. ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని సెప్టెంబర్ 2వ తేదీన హైకోర్టు అరుదైన తీర్పు చెప్పింది. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతున్న ఆకృతి చేసిన పాపమంతా వేతనాలు పెంచాలని, హర్యానాతో సమానంగా జీతాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న నోయిడా కార్మికుల వైపు నిలబడటమే.

ఏప్రిల్ 10 నుండి 18వ తేదీల మధ్య నోయిడాలో కార్మికులు నిరసన ప్రదర్శనలు చేశారు. ఆ ప్రదర్శనలను ఎగదోస్తున్నారంటూ ఆకృతితో పాటు మరికొందరిపై ప్రభుత్వం కేసులు బనాయించింది. ఆకృతిపై ఏకంగా ఎన్.ఎస్.ఎ కింద కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ ప్రదర్శనల సందర్భంగా ఏప్రిల్ 13న కాస్త ఉద్రిక్తత ఏర్పడింది. కార్మికులు రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌ను అడ్డుకొన్నారు. ఆ ఘటన జరిగిన రెండు నెలల తర్వాత ఆకృతిని పోలీసులు అరెస్టు చేశారు. దాంతో ఆకృతిపై మోపిన చార్జీలు ఒక కట్టుకథ అంటూ న్యాయస్థానం ప్రభుత్వ వాదనను కొట్టేసింది.

దేశ భద్రతకు తీవ్ర ప్రమాదం తెచ్చిపెట్టే వారిపై ప్రయోగించాల్సిన ఎన్.ఎస్.ఎ చట్టాన్ని జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ప్రభుత్వాన్ని ఎండగడుతున్న వారిపై ప్రయోగిస్తున్నారు. అత్యంత కఠిన పరీక్షలను దాటుకొన్న తర్వాత నెలల తరబడి శిక్షణ పొందే ఐఎఎస్, ఐపిఎస్ వంటి విద్యావంతులు ఇలా ప్రభుత్వం పెద్దల అడుగులకు మడుగులొత్తుతూ పౌర హక్కులకు తిలోదకాలు వదుల్తున్నారు. ఇలాంటి కేసులు ఉత్తరప్రదేశ్‌లో చాలా ఎక్కువ. ఎన్.ఎస్.ఎ కేసుల్లోనే కాదు 'ఉపా' కేసుల్లోనూ దానిదే అగ్రస్థానం. ఇవన్నీ గమనించే కావచ్చు. న్యాయస్థానం ఆకృతికి ఐదు లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని నోయిడా జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ అరుదైన తీర్పు చెప్పింది. బహుశా ఇతర కలెక్టర్లకు, ఉన్నతాధికారులకు అదో హెచ్చరిక కావాలని న్యాయస్థానం భావించిందేమో?

ఎన్.ఎస్.ఎ చట్టం కింద అరెస్టయిన వ్యక్తి కనీసం మూడు నెలల పాటు జైల్లో ఉండాలి. ఆకృతి కేసులో జిల్లా కలెక్టర్ చేసిన తప్పుడు ఆరోపణలను సలహా బోర్డు ఎలా ఆమోదించింది అన్నది ఒక ప్రశ్న? దేశవ్యాపితంగా ఎన్.ఎస్.ఎ కింద నమోదయ్యే కేసుల సంఖ్యను జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) కూడా వెల్లడించడం లేదు. 'ఉపా' కింద ఎన్ని అరెస్టులు జరిగాయి? న్యాయస్థానాల్లో ఎంతమంది నిందితులపై ఆరోపణలు రుజువై శిక్షలు పడుతున్నాయి? తదితర వివరాలు ఎన్‌సిఆర్‌బి ద్వారా లభిస్తున్నాయి. 'ఉపా' కేసుల్లో నిందితులపై కూడా న్యాయస్థానాల్లో నేర నిర్ధారణ జరిగి శిక్షలు పడిన కేసులు అత్యల్పం. అయితే నేర నిర్ధారణకు ముందే నెలలు, ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్న వారి సంఖ్య చాలా ఎక్కువగానే ఉంది.

ఎవరినైనా అరెస్టు చేసే, విచారణ పేర వారిని జైల్లో వేసే అవకాశం తమకు ఉందనే భావన పోలీసుల్లో ఇప్పటికీ బలంగా ఉంది. అరెస్టు అంటే ఒక వ్యక్తి స్వేచ్ఛను అడ్డుకోవడమే. కానీ పోలీసు వ్యవస్థలో ఆ స్పృహ ఉందా? అన్నది అనుమానమే. ఇలాంటి స్థితిలో ప్రభుత్వాలు కూడాతోడయితేమానవహక్కులహననంనిరాటంకంగాజరిగిపోతుంది.

గతంలో యోగి ప్రభుత్వం డాక్టర్ కఫీల్ ఖాన్ అనే పిల్లల వైద్యుడిపై ఎన్.ఎస్.ఎ కేసును మోపినప్పుడు కూడా పరాభవం పాలైంది. ముందు డాక్టర్ ఖాన్ ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధంగా ఉంచని కారణంగా గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో చాలామంది పసిపిల్లలు చనిపోయారని ఆరోపిస్తూ సస్పెండ్ చేసింది. కేసు బనాయించి జైల్లోకి తోసేసింది. శాఖా పరమైన విచారణలో డాక్టర్ ఖాన్ ఏ తప్పు చేయలేదని నిర్ధారణ కావడంతో ఆయన్ని విడుదల చేయక తప్పలేదు. కొన్ని రోజుల తర్వాత అలీగఢ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను రెచ్చగొట్టాడంటూ మళ్లీ జైల్లోకి తోసింది. దానికి ముందు తిండి, నీరు ఇవ్వకుండా కొన్ని రోజుల కడుపు మాడ్చారు. బట్టలు విప్పించి రోజుల తరబడి లాఠీలతో బాదారు. ప్రభుత్వం పెట్టిన ఎన్.ఎస్.ఎ కేసు కూడా న్యాయస్థానంలో నిలబడలేదు. హైకోర్టు ఆదేశంపై ఆయన్ని విడుదల చేయక తప్పలేదు. అయినా ప్రభుత్వం తన కక్ష సాధింపు ధోరణిని మార్చుకోలేదు. ఎన్.ఎస్.ఎ కేసు వీగిపోయిన తర్వాత కూడా తిరిగి ఉద్యోగంలోకి తీసుకోలేదు. ఈ పూర్వ రంగాన్ని, జెన్ జీ ఉద్యమం వల్ల తాను ఇటీవల ఎదుర్కొన్న పరాభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఆకృతిని యు.పి ప్రభుత్వం ఇంతటితో వదలిపెడ్తుందా? అన్నది అనుమానమే. ఇప్పుడామె 'దిమాగీ నక్సల్' కేటగిరీలోకి వస్తారేమో! ఏదేమైనా ఈ కేసులో బాధితురాలికి జిల్లా కలెక్టర్ నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశించడం ఒక హైలెట్.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# తెలంగాణ విప్లవ తేజం కాళోజీ"

ఏ భాష నీది ఏమి వేషమురా,
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా,
తెలుగు వాడివై తెలుగు రాదనుచు,
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు, సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా,"!...పర భాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి 'తెలంగాణ భాషా దినోత్సవం' అయింది.ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి 'నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు' అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది.

"నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే."

అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 నవంబరు 13, 2002) "కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న" గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలన శీలి కాళోజీ. ఆజన్మాంతం



తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజీ. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది.

'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడ పడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయిత గా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండ లోని కాలేజియేట్ ఉన్నత పాఠశాల లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదులో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయ రానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింప జేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వ విద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన "ఆంధ్ర సారస్వత పరిషత్" వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యకునిగా, 195761 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు, కానీ ఓడి పోయాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణా నంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు.1992లో పద్మ విభూషణ్ భారత రెండవ అత్యున్నత పురస్కారం;

**1972 లో తామ్రపత్ర పురస్కారం;**

1968లో "జీవన గీత" రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారం; బూర్గుల రామకృష్ణా రావు మెమోరియల్ మొదటి పురస్కారం;ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చే 1981లో సత్కారం; "ప్రజాకవి" బిరుదు; ఆంధ్ర ప్రదేశ్ లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలు; రామినేని ఫౌండేషన్ అవార్డు; గాడిచర్ల ఫౌండేషన్ అవార్డు; కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్; 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డు; 1996లో కళసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని "కాళోజీ కథలు" పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది. ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు.అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించుకోవడం అవసరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం. తెలుగు పదాలనే మర్చిపోతోంది. ఈ పరిస్థితి పోవాలి. మన తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకు బడితో ప్రజల మాట, వ్యధలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శ ప్రాయం. కాళోజీ జయంతి సెప్టెంబర్ 9 ని "తెలుగు మాండలిక భాషా దినోత్సవం" గా జరుపుకోవడం సమంజసం.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 నవంబరు 13, 2002) "కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న" గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## ప్రకృతి భాష

తొలకరి చినుకులు
పుడమి ఎదపై
వాలగా...

మట్టి గుండెల్లోంచి
ఎగసింది

పరిమళపు ఊట.

సుగంధాన్ని
పులుముకున్న

పిల్లగాలులు పైరు
వీణను మీటితే...

పలికే స్వరాలే నేలమ్మకు
లాలిపాట.

ఆ జోలపాట
తన్మయత్వంలో

గగన వీధిలో నర్తించే
పక్షుల

రెక్కలు కుంచెలై...

నీలి నింగిపై సజీవ
చిత్రాలు గీస్తుంటే,

హరివిల్లుకే వన్నె
తెచ్చినట్టుంది.

సప్తవర్ణపు కాంతులు
ప్రతిబింబాలై జారి,

చిగురు కొమ్మలపై
పూలై విరిసి...

అవనికి ఆభరణాలైతే...

ఉషఃకాలపు తొలి
కిరణం

ధరణి నుదుటన
తిలకమై మెరిసింది.

ఇదంతా...

కాలం చెరపలేని,

మనసు మరువలేని

ప్రకృతి భాష.




డా. ఆవుల రేణుక
9398268976

# విఫలమైన నూతన్య విద్యావిధానం

ప్రపంచంలో అతిపెద్ద విద్యావ్యవస్థ మనది. దాదాపుగా 25 కోట్ల మంది విద్యార్థులు 14.71 లక్షల విద్యాలయాలలో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలన్నీ కలిపి 10,92,671 ఉన్నట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. కానీ 65 శాతం మంది విద్యార్థులు ఇంకా ప్రైవేటు విద్యా వ్యవస్థనే నమ్ముకున్నారు. ఇదంతా పార్లమెంటరీ కమిటీ నివేదికలో పేర్కొన్న వాస్తవాలు. 73 శాతం విద్యార్థులు ఉన్నత విద్యా స్థాయికి చేరుకోకముందే డ్రాపౌట్లుగా మిగిలిపోతున్నారు. శారీరక వైకల్యం కల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు మృగ్యం. అంటే కేటాయింపులన్నీ కాగితాలకే పరిమితం కానీ క్షేత్రస్థాయిలో వినియోగం జరగడం లేదు. పర్యవసానంగా కోట్లాదిమంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కనీస ఆర్థిక స్థోమత గలవారు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారంటే వారికి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతున్నదనే భావించాలి. భవనాలు, టాయిలెట్స్, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో లేవనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయింది. సెకండరీ విద్య అందించే వాటిలో ప్రైవేటు స్కూళ్ల భాగం 44 శాతానికి పైగా ఉంది. దేశంలో లక్షకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

ఇక ఈ మే మాసంలో నిటి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక మరింత విస్తుపోయే అంశాలను పేర్కొన్నది. ఒకపక్క దేశంలో ఉపాధి కల్పనను పెంపొందించామని, నూతన విద్యా విధానం ద్వారా విద్యార్థులను స్వయం ఉపాధి దిశగా తయారు చేస్తున్నామని కేంద్రం చేసుకున్న ప్రచారం అంతా డొల్ల అని సదరు నివేదిక నిరూపిస్తున్నది. 15 నుంచి 29 ఏండ్ల మధ్యనున్న యువకులలో 8.7 కోట్ల మంది అటు విద్యకు, ఉపాధికి, శిక్షణకు అందకుండా ఉన్నారని చెప్పడం బాధాకరం. వీరు కాక మరో రెండు కోట్ల మంది యువత కూడా ఏ ఉద్యోగం చేయడం లేదని నివేదిక తెలుపుతున్నది. వారిని నీట్ (నాట్ ఇన్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్) కేటగిరీలో చేర్చారు.దేశంలో కేవలం 8.25 శాతం మంది పట్టభద్రులు మాత్రమే తమ డిగ్రీలకు తగిన ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పడం కూడా శోచనీయం. అంటే తొంభై శాతం మంది పైగా తాము చదివిన చదువుకు, చేస్తున్న పనికి సంబంధం లేకుండా ఉద్యోగాలు చేస్తున్నారు. 2024 నవంబర్ నుంచి 2025 జూలై మధ్య కేవలం 55 వేల ఉద్యోగాల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం ఈ దుస్థితికి అద్దం పడుతున్నది. కానీ, వారికి వృత్తిపరంగా నైపుణ్యం నేర్పేవి కావు పర్యవసానంగా విద్యార్థి నైపుణ్యాలు నేర్చుకోకుండా కేవలం పుస్తక పరిజ్ఞానంతోనే చదువు పూర్తి చేస్తున్నాడు. తన స్వశక్తితో ఉపాధి కల్పించుకోలేని పరిస్థితిలో సమాజానికి భారం అవుతున్నాడు. ఈ రకంగా కొన్ని కోట్ల మంది వృత్తిపరమైన నైపుణ్యాలు నేర్చుకోకుండానే చదువు పూర్తి చేస్తున్నారు. కళాశాల పై స్థాయిలో ఈ కోర్సులు దాదాపుగా అందుబాటులో లేవనే చెప్పవచ్చు.




ప్రస్తుత కోర్సుల స్థానంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రత్యేక కోర్సులను తీసుకురావాలని నిటి ఆయోగ్ సూచించింది. బీఏ హాస్పిటాలిటీ, బీకాం ఎనలిటిక్స్, బీఎస్సీ అప్లైడ్ టెక్నాలజీ వంటి కోర్సులను తేవాలని పేర్కొంది. చదువుతో పాటు పని అనుభవం వచ్చేలా అప్రెంటిస్‌షిప్ ఆధారిత డిగ్రీలను పెంచాలని తెలిపింది. మహిళల్లో నైపుణ్యాలు పెంచడానికి సాయంత్రం, వారాంతం, పార్ట్‌టైం, హైబ్రిడ్, మాడ్యులర్ కోర్సులను విస్తరించాలని సూచించింది.

అసలు విద్య ప్రైవేటీకరణ కాకుండా తీసుకోవలసిన చర్యల గురించి నీతి ఆయోగ్ ఏమి పేర్కొనలేదు. బడుగు బలహీన వర్గాల వారు విద్యకు దూరం కావడం గురించి ఈ నివేదిక చర్చించకపోవడం దారుణం. ఇక బాలికల విషయంలో అది మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలను బాగుపరిచి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయవలసిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నాయి. ప్రైవేటీకరణ మూలంగా విద్య ఖరీదు అయిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంస్థలను మూసివేయడం లేదా సమీప పాఠశాలలో విలీనం చేయడం ద్వారా పేద వర్గాలకు విద్య మరింత దూరమైంది. మన ప్రభుత్వాలు క్రమంగా ప్రభుత్వ విద్యను సామాన్యుడికి అందకుండా చేస్తున్నాయి. పార్లమెంటు కమిటీలు, అసర్, నిటి ఆయోగ్ నివేదికలు సిఫార్సులు చేస్తూనే ఉన్నాయి. కానీ, అవి సంపూర్ణంగా అమలుకు నోచుకోవడం లేదు.

ఆరవ తరగతి నుంచే నైపుణ్యాలు నేర్పాలని, వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టాలని, చదవడం, రాయడం,

గణితంపై దృష్టిసారించాలని, ఉపాధ్యాయులను శిక్షణ ద్వారా బలోపేతం చేయాలని, డ్రాపౌట్లు తగ్గించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని నివేదికలు సూచిస్తున్నాయి. 2015 జనవరి 1 నుంచి ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పరచబడిన నిటి ఆయోగ్‌కు నిధులు కేటాయించే అధికారం లేదు. ఇది కేవలం సలహాలు ఇచ్చే సంస్థ. అందుకే ఉపాధి, విద్యా విషయాలలో నిటి ఆయోగ్ ఒక విఫల సంస్థగా పేర్కొనవచ్చు. మొత్తంగా ఘనంగా ప్రకటించుకున్న నూతన విద్యా విధానం2020 (ఎన్‌ఈపి) కూడా ప్రభుత్వ విద్యను మెరుగుపరచకపోగా మరింత నీరు కార్చిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కమిషన్ల సిఫార్సులు, కమిటీల నివేదికలు సంపూర్ణంగా అమలుకు నోచుకోలేదు. పాలకులు మారినప్పుడల్లా విధానాలు మారటం మన వ్యవస్థకు ఉన్న దుర్గుణం. విధానాలు కాదు ముఖ్యం. విద్య సార్వజనీనం కావాలి, గుణాత్మకం కావాలి. అది ఉపాధి కల్పించే దిశగా విద్యార్థిని తయారు చేయాలి. అప్పుడే విద్య పరిపూర్ణమైనట్లు, దేశం పరిపుష్టమైనట్లు భావించాలి.

# ధరలు బాబోయ్.. ధరలు...

"ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. నాగులో నాగన్న.. ధరలెట్లా పెరగబట్టే నాగులో నాగన్న" అన్న పాటే నేడు ప్రతి సామాన్యుడి నోట వినిపించాల్సిన పరిస్థితి. మార్కెట్‌కు వెళ్తే సంచి నిండా సరుకులు రావడం లేదు.. కానీ జేబులోని డబ్బు మాత్రం ఖాళీ అవుతోంది. ఒకవెపు ఆదాయం పెరగడం లేదు.. మరోవైపు నిత్యావసరాల ధరలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఉల్లి, చక్కెర, నూనె, పప్పులు, కూరగాయలు, పాలు, బియ్యం.. ఇలా ఒక్కో సరుకు ధర పైపైకి ఎగబాకుతోంది. మొన్నటివరకు రూ.వందకు ఆరేడు కిలోలు వచ్చిన ఉల్లి.. ఇప్పుడు కిలో రూ.60కి చేరి కన్నీళ్లు పెట్టిస్తోంది. రూ.40 ఉన్న చక్కెర రూ.70కు ఎగబాకి నోరు మరింత చేదెక్కిస్తోంది.వంటనూనె ధర పొయ్యి వెలిగించకముందే ఇంట్లో మంట రాజేస్తోంది. ఏం కొందామన్నా ధరే అడ్డుగా.. ఏం వండుకుందా మన్నా ఖర్చే భారమవ్వడం పాలనా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ధరల నియంత్రణపై చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది.

ధరలు పెరగడానికి వాతావరణ పరిస్థి తులు, వర్షాభావం లేదా అధిక వర్షాలు, పంటల దిగుబడుల్లో హెచ్చుతగ్గులు, సరఫరా లోపాలు, రవాణా వ్యయం వంటి కారణాలు న్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులు, దిగుమతులపై ఆధారపడటం వంటివి వంట నూనెల ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఇవన్నీ కొంతవరకు అర్థం చేసుకోదగినవే. కానీ ప్రతిసారీ ప్రకృతినో.. మార్కెట్‌నో సాకుగా చూపించి ప్రభుత్వాలు తమ బాధ్యత నుంచి తప్పించుకోలేవు. తగినంత నిల్వ సదుపాయాలు లేకపోవడం, సరఫరా వ్యవస్థలో లోపాలు, దళారుల జోక్యం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత వంటి వాటిని అరికట్టడంలో ప్రభుత్వాల వైఫల్యం కూడా ధరల పెరుగుదలకు కారణమే. బఫర్ నిల్వలు, ధరల నియంత్రణ వ్యవస్థలు ఉన్నప్పటికీ అవసరమైన సమయంలో మార్కెట్‌ను అదుపు చేయలేకపోతే అది పాలనావైఫల్యమే తప్ప వేరేకాదు.




ధరలు పెరగడానికి వాతావరణ పరిస్థి తులు, వర్షాభావం లేదా అధిక వర్షాలు, పంటల దిగుబడుల్లో హెచ్చుతగ్గులు, సరఫరా లోపాలు, రవాణా వ్యయం వంటి కారణాలు న్నాయి. అంతర్జాతీయ

మార్కెట్‌లో మార్పులు, దిగుమతులపై ఆధారపడటం వంటివి వంట నూనెల ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఇవన్నీ కొంతవరకు అర్థం చేసుకోదగినవే. కానీ ప్రతిసారీ ప్రకృతినో.. మార్కెట్‌నో సాకుగా

ఇందులో ఇంధన ధరల ప్రభావాన్ని కూడా విస్మరించలేం. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన కొద్దీ రవాణా వ్యయం పెరిగి ఆ భారం కూరగాయలు, పప్పులు, ధాన్యాలు, నూనెల రూపంలో వినియోగదారుడిపైనే పడుతోంది. ఇంధన ధరలను అదుపు చేయకుండా నిత్యావసరాల ధరలను శాశ్వతంగా నియంత్రించడం కష్టం. ప్రజలపై భారాన్ని తగ్గించాల్సిన ప్రభుత్వాలు ఇంధనంపై పన్నుల ద్వారా ఆదాయం పెంచుకోవడానికే ప్రాధాన్యం ఇస్తే సామాన్యుడి కష్టం మరింత పెరుగుతుంది.

అలాగే ధరలు పెరిగితే రైతు లాభపడుతున్నాడన్నదీ వాస్తవం కాదు. రైతు పండించిన ఉల్లికి గిట్టుబాటు ధర దక్కని సమయంలో అదే ఉల్లి పట్టణ మార్కెట్‌లో కిలో రూ.6070కు అమ్ముడవుతోంది. రైతు తక్కువకు అమ్ముతున్నాడు.. వినియోగదారుడు ఎక్కువకు కొంటున్నాడు. మరి ఈ మధ్యలో పెరుగుతున్న ధరలో అసలు లాభం ఎవరికి? పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ చేసి, కొరత ఏర్పడినప్పుడు అధిక ధరకు అమ్మే మధ్యవర్తుల వ్యవస్థ బలపడుతోంది.

ఫలితంగా రైతుకూ నష్టం.. వినియోగదారుడికీ నష్టం.. దళారులు, నిల్వదారులకే లాభం. ఈ వ్యవస్థను అరికట్టాల్సిన ప్రభుత్వాలు చేష్టలూడిగి చూడటమే ప్రజలపై ఈ ప్రభావం.

వంటనూనెల విషయంలోనూ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. రైతులకు ప్రోత్సాహక ధర కల్పించాల్సి ఉన్నా దృష్టి సారించడం లేదు. నిల్వ, ప్రాసెసింగ్, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయకపోవడం సమస్యను మరింత జటిలం చేస్తోంది. నూనె, గ్యాస్ ధర పెరిగితే దాని ప్రభావం ఇంటి వంటకే పరిమితం కాదు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిరుతిళ్ల ధరల రూపంలోనూ ప్రజలపై పడుతుంది. దీన్ని ఎలా పరిష్కరించాలన్న ఆలోచన ప్రభుత్వాల దగ్గర ఉందా?లేదా? ఉంటే ఎందుకు అమలు చేయడం లేదు. ఒక్కో సరుకుపై ఇరవై నుంచి ముప్పై శాతం ధరల ప్రభావం పడితే అది చిన్న సమస్యనా? దాన్ని పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ధరల నియంత్రణకు తక్షణ చర్యలే కాదు, దీర్ఘకాలిక విధానాలు అమలు చేయాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక ధరలను అరికట్టాలి. బఫర్ నిల్వలను అవసరమైనప్పుడు మార్కెట్‌లోకి విడుదల చేయాలి. రైతు బజార్లు, ప్రభుత్వ విక్రయ కేంద్రాలను బలోపేతం చేసి రైతు నుంచి వినియోగదారుడికి నేరుగా సరుకు చేరేలా చూడాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి. ఉల్లి, చెరకు, నూనెగింజల వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించాలి. ఇవేవీ చేయకుండా ధరలను నియంత్రిస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఎందుకంటే అభివృద్ధి గణాంకాలు ఎన్ని చెప్పినా.. సామాన్యుడి పళ్లెంలో పదార్థాలు తగ్గి, జేబులో ఖర్చులు పెరుగుతున్నంతకాలం ఆ అభివృద్ధికి అర్థం లేదు. వంటింటి మంట తగ్గించి.. రైతుకు గిట్టుబాటు, వినియోగదారుడికి ఉపశమనం కల్పించడమే ప్రభుత్వాలకు అసలైన పరీక్ష. ఆ పరీక్షలో పాలకులు ఎప్పుడు నెగ్గుతారన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.



# జాతీయం-అంతర్జాతీయం



## వెంకటాచలం పిటిషన్‌ను కొట్టేసిన మద్రాస్ హైకోర్టు

- పెరుందురై అసెంబ్లీ ఎన్నికపై కేసు
- చట్టపరంగా కారణాలు లేవంటూ వ్యాఖ్య



**చెన్నై, సెప్టెంబరు 08 (ఎ.ఎం.ఎస్) :** తమిళనాడులోని పెరుందురై అసెంబ్లీ నియోజకవర్గంలో అన్నాడిఎంకె అభ్యర్థి ఎస్. జయకుమార్ ఎన్నికను సవాలు చేస్తూ డిఎంకె అభ్యర్థి తొప్పు ఎన్.డి. వెంకటాచలం దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఎన్నికను సవాలు చేసేందుకు చట్టపరంగా అనుమతించదగిన కారణాలు పిటిషన్‌లో లేవని పేర్కొంటూ.. ఆయన ఎన్నికను సవాలు చేస్తూ ఆయనపై పోటీ చేసిన డిఎంకె అభ్యర్థి తొప్పు వెంకటాచలం హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరారు. . ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ డి. భరత చక్రవర్తి.. వెంకటాచలం ఎన్నికల పిటిషన్‌లో చట్టప్రకారం అనుమతించదగిన కారణాలు లేవని నిర్ధారించారు. దీంతో జయకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను అంగీకరించి, వెంకటాచలం ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జయకుమార్ పెరుందురై ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టివికెలో చేరారు. దీంతో పెరుందురై అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో పెరుందురైతో పాటు తిరుచ్చి (తూర్పు), అంబాసముద్రం, విరాలిమలై, కరూర్ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయకుండా ఎన్నికల సంఘాన్ని మద్రాస్ హైకోర్టు గతంలో అడ్డుకుంది. ఈ నియోజకవర్గాల్లో ఎన్నికైన సభ్యుల విజయాలను సవాలు చేస్తూ ఎన్నికల పిటిషన్లు పెండింగ్‌లో ఉండటంతో ఈ మధ్యంతర ఆదేశాలు జారీ అయ్యాయి. ఆగస్టు 24న జరిగిన విచారణలోనూ ఈ ఐదు నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ఎన్నికల పిటిషన్లు పరిష్కారమయ్యే వరకు ఉప ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం తమకు లేదని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది.

## ఇండోనేసియాలో ప్రకృతి విపత్తు

- బద్దలైన అగ్నిపర్వతం
- అగ్నిపర్వతం నుంచి వెలువడిన దట్టమైన పొగ, బూడిద
- 50వేల అడుగుల ఎత్తుకు ఎగసిపడిన బూడిద!
- అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సేవలు రద్దు

**జకార్త, సెప్టెంబరు 08 :** ఇండోనేసియాను మరోసారి ప్రకృతి విపత్తు భయాందోళనకు గురిచేస్తోంది. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న సుండా జలసంధిలోని అనక్ క్రాకటౌ అగ్నిపర్వతం ఆదివారం తెల్లవారుజామున భారీగా విస్ఫోటనం చెందింది. అగ్ని పర్వతం నుంచి వెలువడిన దట్టమైన పొగ, బూడిద ఆకాశాన్ని కమ్మేశాయి. బూడిద మేఘాలు ఏకంగా 50 వేల అడుగుల ఎత్తుకు ఎగసిపడటంతో జకార్తా సహా పలు ప్రాంతాలపై ప్రభావం పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమాన రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఇండోనేసియా జియో లాజికల్ ఏజెన్సీ ప్రకారం, అనక్ క్రాకటౌ అగ్ని పర్వతం శుక్రవారం నుంచే క్రియాశీలత సంకేతా లను చూపించింది. ఆదివారం తెల్లవారు జామున 3.53 గంటలకు సుమారు 30 సెకన్ల పాటు విస్ఫో టనం సంభవించింది. అగ్నిపర్వతం వద్ద లావా జ్వాలలు ఎగసిపడుతున్న దృశ్యాలను అక్కడ ఏర్పా టు చేసిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు రికార్డు చేశాయి. విస్ఫోటనం తీవ్రంగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ప్రజల ను పెద్దఎత్తున తరలిం చాల్సిన పరిస్థితి కూడా ఏర్ప డలేదు. అగ్నిపర్వ తానికి సమీపంలోని జనావా



సాలు 16 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటం తో తక్షణ ముప్పు తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అనక్ క్రాకటౌ క్రియాశీల బిలం నుంచి కనీసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉండాలని అధికా రులు స్థానికులు, పర్యాటకులను హెచ్చరించారు. అగ్నిపర్వత కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జకార్తాతో పాటు సుమత్రా ద్వీపంలోని లాంపుంగ్ ప్రావిన్స్ లోని కొన్ని ప్రాంతాలకు బూడిద వ్యాపించింది. బాంటెన్, పశ్చిమ జావా ప్రాంతాలపై కూడా బూడిద మేఘాల ప్రభావం కనిపించింది. గాలుల దిశకు అనుగుణం గా బూడిద మేఘాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉండటంతో అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

అగ్నిపర్వత బూడిద విమాన ప్రయాణాలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో జకార్తాలోని సోకార్నో హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయం ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచి 9.30 గంటల వరకు కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రయాణి కులకు సమాచారం ఇచ్చింది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో విమానాల రద్దులు, ఆలస్యాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొన్నారు. కొందరు ప్రయా ణికులు టికెట్ డబ్బులు తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించగా, మరికొందరు చెక్ చేసిన సామాను కోసం వేచి చూడాల్సి వచ్చింది.

సుకార్నో హట్టా విమానాశ్రయంలో రాత్రిపూట నిలిపి ఉంచిన సుమారు 170 విమా నాలు ఆప్రాన్‌లపైనే ఉన్నట్లు ఇండోనేషియా పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ తెలిపింది. విమానా శ్రయ కార్యకలాపాల నిలిపివేత కారణంగా ఆదివారం సుమారు 209 విమాన రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. దాదాపు 22,800 మంది ప్రయాణికులపై దీని ప్రభావం పడింది. మకాసర్‌కు వెళ్లే రద్దీ దేశీయ మార్గంతో పాటు లాంపుంగ్, బాలి, సురబయ ప్రాంతాలకు వెళ్లే కొన్ని విమానాలు రద్దయ్యాయి, మరికొన్నింటి దారిని మళ్లించారు. అంతర్జాతీయంగా సింగపూర్ వెళ్లే విమానాలపై ఎక్కువ ప్రభావం కనిపించింది. హాంగ్‌కాంగ్, సిడ్నీ, ఆమ్‌స్టర్‌డామ్, సియోల్, దోహా, కౌలాలంపూర్ మార్గాల్లోనూ రద్దులు, ఆలస్యాలు నమోదయ్యాయి.

విమాన ప్రయాణాలపై విస్ఫోటనం ప్రభావాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని ఇండోనేషియా పౌర విమానయాన అధికారులు తెలిపారు. విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహకులు, విమాన సేవల విభాగాలు, వాతావరణ సంస్థలతో సమన్వ యం చేస్తున్నట్లు వెల్లడించారు. "ప్రతి కార్యాచరణ నిర్ణయంలోనూ భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత" అని రవాణా మంత్రిత్వ శాఖ పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ లుక్మాన్ ఎఫ్. లైసా తెలిపారు. విమాన యాన సంస్థలు కార్యకలాపాలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, షెడ్యూళ్లలో వరుస మార్పులు, ఆలస్యాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. తాజా విమాన సమాచారం కోసం సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదిం చాలని ప్రయాణికులకు సూచించారు. అత్యవసర పరిస్థితి లేకపోతే కొంత కాలం విమానాశ్రయానికి రావొద్దని కూడా అధికారులు కోరారు.

"క్రాటకౌ బిడ్డ" అని అర్థం వచ్చే అనక్ క్రాకటౌ, ప్రసిద్ధ క్రాకటౌ అగ్నిపర్వతం నుంచి ఏర్పడిన కొత్త అగ్నిపర్వత ద్వీపం. 1883లో క్రాకటౌలో సంభవిం చిన భారీ విస్ఫోటనం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపింది. ఆ విస్ఫోటనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ప్రపంచ వ్యాప్తంగా శీతలీకరణ ప్రభావం కనిపించింది. 2018లో అనక్ క్రాకటౌ కార్యకలాపాల కారణంగా సంభవించిన సునామీలో సుమత్రా, జావాల్లో కనీసం 430 మంది ప్రాణాలు కోల్పోయారు. అగ్నిపర్వత కార్యకలాపాల కారణంగా నీటి అడుగున కొండచరి యలు విరిగిపడి, అనక్ క్రాకటౌ నైరుతి వాలులోని భారీ భాగం సముద్రంలోకి కూలిపోవడంతో పెద్ద మొత్తంలో నీరు స్థానభ్రంశం చెంది సునామీ ఏర్పడిందని పరిశోధకులు భావించారు.

ఇండోనేసియా అగ్నిపర్వత శాస్త్ర సంస్థతో పాటు ఆస్ట్రేలియాలోని డార్విన్ అగ్నిపర్వత బూడిద సలహా కేంద్రం ఉపగ్రహ చిత్రాలను పరిశీలించి రెండు ప్రధాన బూడిద మేఘాలను గుర్తించాయి. ఒకటి ఈశాన్య దిశగా కదులుతూ సుమారు 20 వేల అడుగుల ఎత్తుకు చేరింది. దీని ప్రభావం జకార్తా,

## మోడీ సర్కారును నిలదీస్తున్న కొత్తతరం

- సమస్యలపై వీధుల్లోకి చిన్నారులు
- స్కూళ్లు బాగుచేయండి..టీచర్లు, గదులు, బెంచీలు లేవు
- తాగునీరు, కరెంట్ ఎక్కడ?
- ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కోసం దేశవ్యాప్త ఆందోళనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 08 (ఎ.ఎం.ఎస్) :** 'ప్రశ్న'ను భవిష్యత్‌తరం బలోపేతం చేస్తుంది. ఇన్నేండ్లు ఏ ప్రశ్నను అయితే తొక్కిపెట్టి, నిరంకుశ పాలన కొనసాగిందో, ఇప్పుడు అదే ప్రశ్నను చిన్నారులు తమ భుజస్కందాలపై వేసుకుంటున్నారు. పెద్దలు అడగాల్సిన ప్రశ్నలను ఇప్పుడు చిన్నారులే నిలదీస్తున్నారు. పాఠశాల భవనం కూలిపోతుందనే భయంతో యూపీలో ఆరేండ్ల నుంచి పదేండ్లలోపు పిల్లలు తరగతులను బహిష్కరించి నిరసనకు దిగారు. ఒక చోట తాగునీరు లేదు.. మరోచోట విద్యుత్ లేదు.. ఇంకోచోట టీచర్లు లేరు.. మరొకచోట మధ్యాహ్న భోజనం నాసిరకం. దేశంలో 'జెన్ జీ' విద్యా సంస్కరణల కోసం గళమెత్తిన తర్వాత.. ఇప్పుడు 'జెన్ ఆల్ఫా' కూడా ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ ముందుకొస్తోంది. ఇప్పుడిది మోడీ సర్కారు మెడకు చుట్టుకుంటున్నది.

దేశంలో విద్యా వ్యవస్థపై కొత్త తరం అసంతృప్తి బహిరంగ నిరసనలుగా మారుతోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కోసం చిన్నారులే తరగతులు బహిష్కరించి ఆందోళనలకు దిగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. యూపీలోని ఓ గ్రామంలో 122 మంది విద్యార్థులు పాఠశాల కొత్త భవనం నిర్మించే వరకు తరగతుల్లోకి వెళ్లబోమని నిరసనకు దిగడం ఈ పరిస్థితికి నిదర్శనం. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో



ఇలాంటి విద్యార్థుల నిరసనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యూపీలోని సముహీ భట్పుర్వా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గతనెల 22న సాధారణంగా తరగతులు ప్రారంభం కావాల్సిన సమయానికి 122 మంది విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లలేదు. చదువుకోవాల్సిన చిన్నారులే ఆ రోజు అధికారులకు 'పాఠం' చెప్పారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. 2023లో పాఠశాల గోడ కూలి ఓ బాలిక తీవ్రంగా గాయపడినప్పటికీ భవనం మరమ్మతులు జరగలేదు. అప్పటి నుంచి కొత్త భవనం కోసం పిల్లలు కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని విద్యార్థులు తెలిపారు. విద్యా హక్కుల కార్యకర్త నాగసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు అడుగుతున్నవి పెద్ద పెద్ద సౌకర్యాలు కాదని అన్నారు. టీచర్లు, బెంచీలు, పాఠశాల భవనాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలే కావాలని కోరుతున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే చదువుతున్నారని ఆయన గుర్తుచేశారు. పేద పిల్లలు చదువుతున్నందుకే సర్కారు స్కూళ్లలో ఈ దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీజేపీ పాలిత రాష్ట్రం యూపీలోని సర్వోదయ ఇంటర్ కాలేజీలో జులై 28న విద్యార్థులు మరో నిరసన చేపట్టారు. 12వ తరగతి వరకు బోధించే ఈ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, బెంచీలు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని విద్యా ర్థులు ఆరోపించారు. వేసవిలో విద్యుత్ లేక ఫ్యాన్లు పనిచేయవని, తాగడానికి నీరు లేదని, బెంచీలు సరిపోక చాలామంది నేలపై కూర్చోవాల్సి వస్తోం దని 12వ తరగతి విద్యార్థి మనోజ్ తెలిపాడు.మహారాష్ట్రలోని పార్లీ ప్రాంతంలోని వైద్యనాథ్ విద్యాలయంలో జులై 31న విద్యార్థులు ఉపాధ్యాయుల కొరతకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. 1941లో స్థాపించిన ఈ పాఠశాలలో సిబ్బంది కొరత తీవ్ర సమస్యగా ఉంది.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత కూడా విద్యార్థుల నిరసనలకు కారణమవుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న మరో రాష్ట్రం బీహార్‌లోని సిముయారా గ్రామంలో జులై 28న సుమారు 50 మంది విద్యార్థులు నాలుగు కిలోమీటర్లు నడిచి ఓ ఉన్నతాధికారిని కలిశారు. పాఠశాలలో పైపుల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో వంటకు ఉపయోగించే ముడి పదార్థాలను కూడా సరిగా శుభ్రం చేయలేకపోతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. బియ్యం, పప్పులు, కూరగాయలు నాసిరకంగా ఉంటున్నాయని.. కొన్ని సందర్భాల్లో కూరగాయలు దాదాపు కుళ్లిపోయిన స్థితిలో ఉంటున్నాయని వారు ఆరోపించారు.

దేశ జనాభాలో 30 శాతానికి పైగా 18 ఏండ్లలోపు వారే ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో తమ హక్కుల కోసం గళమెత్తుతున్న పిల్లల్లో చాలామంది 2029 నాటికి ఓటు హక్కు పొందే వయసుకు చేరుకుంటారు. "ఈ పిల్లలే రేపటి ఓటర్లు. వారికి మంచి విద్య అందకపోతే దేశ అభివృద్ధి దెబ్బతింటుంది" అని పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యా హక్కుల కార్యకర్త ఆకాశ్ సర్కార్ అన్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో పేరుకుపోయిన అసంతృప్తి ఒక్కసారిగా బయటకు రాలేదని బెంగళూరు విశ్వవిద్యాలయంలో చదువుతున్న సుజాత గౌడ అభిప్రాయపడ్డారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను సమూలంగా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. చిన్నారుల ప్రశ్నలు, ప్రభుత్వాలకు పరీక్షలే అని తేల్చిచెప్పారు.భారత్‌లో 1,00,843 పాఠశాలల్లో అన్ని తరగతులకూ కలిపి ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తున్నది. ఈ పాఠశాలల్లో సుమారు 29 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. అలాగే, దేశంలో 5,663 'ఘోస్ట్ స్కూళ్లు' (అంటే విద్యార్థులే లేని పాఠశాలలు) కూడా ఉన్నాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి.

ఎనిమిదేండ్ల ప్రియ తన పాఠశాల భవనం పరిస్థితిపై భయపడుతున్నామని తెలిపింది. భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న ఆందోళన చదువుపై దృష్టి పెట్టనివ్వడం లేదని చెప్పింది. అందుకే తామంతా నిరసనకు దిగామని వివరించింది. ఇది ఈ ఒక్క పాఠశాల సమస్య కాదు. మహారాష్ట్ర, బీహార్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా జులై నుంచి విద్యార్థుల నిరసనలు జరుగుతూనే ఉన్నాయి.

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పాఠశాల వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దేశంలో సుమారు 15 లక్షల పాఠశాలల్లో 24.7 కోట్ల మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. వీటిలో దాదాపు 70 శాతం పాఠశాలలు కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల ఆధీనంలో ఉన్నాయి. 202526 ప్రభుత్వ ఆడిట్ ప్రకారం విద్యకు యాక్సెస్ పెరిగిందనీ, ఉపాధ్యాయవిద్యార్థి నిష్పత్తి మెరుగుపడి ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. పాఠశాల మానేసే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతోందని అధికారిక సమాచారం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందని విద్యా హక్కుల కార్యకర్తలు చెప్తున్నారు. కొన్ని పాఠశాలలు పశువులను పెంచే ప్రదేశాలుగా కూడా ఉపయోగిస్తున్న పరిస్థితి ఉందని ఉదాహరణలు చూపిస్తున్నారు.



## జెలెన్ స్కీ సహాయకులతో ట్రంప్ దూతల చర్చలు

కీవ్, సెప్టెంబరు 08 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహాయకులతో చర్చలు జరిపారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య చర్చల పునరుద్ధరణ కోసం ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఆయన ప్రతినిధులు మాస్కోలో పుతిన్‌తో శనివారం మూడు గంటల పాటు సమావేశమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారు ఉక్రెయిన్ చేరుకొని కీలక చర్చలు జరిపారు. విట్‌కాఫ్, కుష్నర్‌లు ఉక్రెయిన్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు పక్షాలతో గతంలో అనేక పర్యాయాలు సంప్రదింపులు జరిపినా, రష్యాలో పలు దఫాలు పర్యటించినా వీరిద్దరూ తొలిసారి కీవ్‌కు వచ్చారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ దేశ నేతలు ఉక్రెయిన్‌లో ఉన్నత స్థాయి పర్యటన జరపడం కూడా ఇదే మొదటిసారి.

## ఎయిర్ పోర్టులోనే 2.70 లక్షల ప్రయాణీకులు

- నిలిచిపోయిన రెండు వేలకు పైగా విమానాలు
- అగ్నిపర్వతం బద్ధలు కావటమే కారణం

**జకార్తా, సెప్టెంబరు 08 :** ఇండొనేషియాలో అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా 2,70,000 మంది ప్రయాణికులు విమానాశ్రయాలలో చిక్కుబడిపోయారు. రెండు వేలకు పైగా విమానాలు నిలిచిపోవడం, విమానాశ్రయాలు వరుసగా రెండో రోజు కూడా కార్యకలాపాలను నిలిపి వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రాజధాని జకార్తాకు 150 కిలోమీటర్ల దూరంలోని అనక్ క్రాకటౌ అగ్నిపర్వతం శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత బద్దలైన విషయం తెలిసిందే. పెద్ద ఎత్తున లావా ఎగసిపడుతూ రాజధానిని, లాంపుంగ్ రాష్ట్రాన్ని బూడడిదతో ముంచెత్తింది. గగనతలంలో అగ్నిపర్వతం బూడిదను గమనించిన జకార్తాలోని సుకర్నోహట్టా అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు మరో మూడు ఎయిర్‌పోర్టులు తమ కార్యకలాపాలను సోమవారం సాయంత్రం వరకూ నిలిపివేశాయి. పాఠశాలలు తమ విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి. కొన్ని షిప్పింగ్ కార్యకలాపాలకు కూడా అంతరాయం ఏర్పడింది. సుకర్నోహట్టా విమానాశ్రయంలో చిక్కుకుపోయిన ప్రయాణికుల్లో కొందరు తమ టిక్కెట్ ఛార్జీని వాపసు చేయాలని కోరగా మరికొందరు తమ ప్రయాణాలు ఎప్పుడో తెలుసుకునేందుకు ప్రయత్నించడంతో పొడవైన క్యూలు ఏర్పడ్డాయి. కొన్ని విమానాల షెడ్యూల్‌ను పదే పదే మార్చడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు.

## వృద్ధాశ్రమాలపై వివరాలివ్వండి

- వృద్ధాశ్రమాల్లపై వివరాలివ్వండి
- నాలుగు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్‌లు పంపండి
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 08 (ఎ.ఎం.ఎస్) :** దేశవ్యాప్తంగా గల వృద్ధాశ్రమాల సంఖ్య, వాటి వివరాలు, అలాగే సీనియర్ సిటిజన్‌లకు అందుబాటులో వున్న సదుపాయాల గురించి తాజా స్టేటస్ రిపోర్ట్‌లను దాఖలు చేయాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తాజా సమాచారాన్ని అందచేయాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అడ్వకేట్స్ జనరల్‌కు, స్టాండింగ్ కౌన్సిళ్ళకు ఈ ఆదేశాల గురించి తెలియచేయాలని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని కోరింది.



కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది అశ్విని కుమార్ వృద్ధుల సంక్షేమం గురించి ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తూ, సరైన వసతి, ఆహారం, వైద్య సంరక్షణ లేని వారి గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ 2016లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను బెంచ్ విచారించింది. వృద్ధులు గౌరవంగా జీవించడానికి వీలుగా తగినన్ని వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని ఆ పిటిషన్ కోరుతోంది.

దేశంలో వృద్ధాశ్రమాలు ఎన్ని వున్నాయి, వారికి వచ్చే పెన్షన్, వారికి అందుబాటులో వున్న వైద్య సంరక్షణ వంటి అంశాలకు సంబంధించి పూర్తి వివరాలను అందచేయాల్సిందిగా గతంలో కేంద్ర ప్రభుత్వం కోరిందని, కానీ ఇంకా రాలేదని విచారణ సందర్భంగా కుమార్ పేర్కొన్నారు. త్వరితగతిన విచారణ జరపాలని పలుసార్లు అభ్యర్ధించినప్పటికీ 2022 నుండి ఈ అంశం విచారణకు రాలేదని ఆయన పేర్కొన్నారు.

దీనిపై కేంద్రం తరపు న్యాయవాది మాట్లాడుతూ, పర్యవేక్షణ నిమిత్తం ఈ ప్రొసీడింగ్స్‌ను ఆయా రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ చేయాలని సూచించారు. ఆ సూచనను కుమార్ వ్యతిరేకించారు. సుప్రీం కోర్టే ఈ ప్రొసీడింగ్స్‌ను పర్యవేక్షణను కొనసాగించాలని వాదించారు. దేశవ్యాప్తంగా అమలయ్యేలా తీసుకోవాల్సిన నిర్ణయం ఇదని, హైకోర్టులకు వదిలిపెట్టరాదని అన్నారు.

సుప్రీం కోర్టు విస్తృత మార్గదర్శకాలను రూపొందించినా వాటి అమలును అంతిమంగా హైకోర్టులే పర్యవేక్షించాల్సి వుంటుందని చీఫ్‌జస్టిస్ పేర్కొన్నారు. ఈ ప్రొసీడింగ్స్‌ను ఎవరు పర్యవేక్షించాలనేది నిర్ణయించడానికి ముందుగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి ఆధునీకరించిన సమాచారం అందాలని బెంచ్ పేర్కొంది.

## మహిళలను కించపరిస్తే వదిలిపెట్టేది లేదు

- చట్ట ప్రకారం చర్యలు తప్పవు
- తమిళనాడు సీఎం విజయ్ హెచ్చరిక

**చెన్నై, సెప్టెంబరు 08 (ఎ.ఎం.ఎస్) :** మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే ఎంతటి వారిపైనైనా చట్టం ప్రకారం చర్యలు తప్పవని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని విజయ్ సూచించారు. ప్రజలను, ముఖ్యంగా --- మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ.. మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు మాత్రం అడ్డుపెట్టుకోలేమని స్పష్టం చేశారు. గతంలో అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి



జయలలిత ఎదుర్కొన్న అవమానాలను కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత సమర్థంగా పని చేయాలని విజయ్ అన్నారు. నేరాలు జరిగిన తర్వాత నిందితులను అరెస్టు చేయడం కంటే.. నేరాలు జరగకుండా ముందుగానే నిరోధించడమే పోలీసుల ప్రధాన బాధ్యత కావాలని పేర్కొన్నారు. చట్టాన్ని పాటించే ప్రజలకు పోలీసులు మిత్రులుగా, ఉల్లంఘించేవారికి కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో చర్యలు చేపట్టడంలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతిపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు, అవినీతికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. పోలీసులపై ఆరోపణలు వచ్చినా వారిని కాపాడే ప్రసక్తి లేదని, లాకప్ నేరాలపై పారదర్శక దర్యాప్తు చేపడతామని హెచ్చరించారు.

## మిఠాయిలు, చాక్లెట్లు ప్రియం

- భగ్గుమంటున్న చక్కెర ధరలు
- ముడి సరుకుల భారం
- ధరలను పెంచుతున్నఎఫ్ఎంసీజీ కంపెనీలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 08 (ఎ.ఎం.ఎస్) :** రానున్న పండగల సీజన్‌లో తీపి ఉత్పత్తులు అధిక ధరలతో చేదెక్కనున్నాయి. విపరీతంగా పెరిగిన చక్కెర, పాల ధరల కారణంగా బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, సంప్రదాయ మిఠాయిల ధరలు భారీగా పెరగనున్నాయి. మార్కెట్‌లో ముడిసరుకుల భారం విపరీతంగా పెరగడంతో ఎఫ్ఎంసీజీ కంపెనీలు, స్వీట్ తయారీదారులు ధరల పెంపును చేపడుతున్నాయని ఓ ఆంగ్ల మీడియా రిపోర్ట్ చేసింది.ఇప్పటికే ప్రముఖ స్వీట్స్ బ్రాండ్ బికాజీ ఫుడ్స్ తన మిఠాయిల ధరలను రెండు శాతం మేర పెంచగా.. రానున్న రోజుల్లో ప్యాకేజ్డ్ ఫుడ్స్ ధరలు మరింత ఎగిసే అవకాశం ఉంది. భారత్‌లో సాధారణంగా సెప్టెంబర్ నుంచి జనవరి వరకు వచ్చే పండుగల సీజన్‌లో చక్కెరకు డిమాండ్ అమాంతం పెరుగుతుంది. అయితే ఈ ఏడాది అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాల కారణంగా చక్కెర ధరలు నింగినంటాయి. ఈక్విరస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం..

## అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయి

*ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 08 :** ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అమెరికా విజయం సాధిస్తే చమురు ధరలు పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అమెరికాలో పెట్రోల్ ధరలు ఒక గ్యాలన్‌కు 2 డాలర్ల దిగువకు పడిపోవచ్చంటూ ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ప్రస్తుతం నెలకొన్న ఇంధన సంక్షోభానికి యుద్ధం కారణమన్నారు. హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను నియంత్రిస్తుండటంతో ఇంధన ధరలు పెరిగాయి. అమెరికా గెలిస్తే ఇంధన మార్కెట్లలో స్థిరత్వం వస్తుందని తాజాగా ట్రంప్ పేర్కొన్నారు.

## మా ప్రతిస్పందన అత్యంత భయంకరంగా ఉంటుంది

**టెహ్రాన్, సెప్టెంబరు 08 (ఎ.ఎం.ఎస్) :** అమెరికా ఆంక్షల కారణంగా ఎదురైన సమస్యలను పరిష్కరించుకు నేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తామని ఇరాన్ తెలిపింది. తనపై మరిన్ని దాడులు జరిపితే 'బాధాకరమైన ప్రతిస్పం దన' తప్పదని హెచ్చరించింది. చమురు ట్యాంకర్లపై అమెరికా జరిపిన తాజా దాడుల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఖర్ ఖలీబఫ్ మాట్లాడుతూ ఆట నియమాలు మారిపోయాయని మరీ ఆలస్యం కాకముందే అమెరికా గ్రహించా లని వ్యాఖ్యానించారు. ఇకపై ఇరాన్ ప్రయో జనాలు, భద్రతపై జరిగే ఏ దాడికైనా వేగవంతమైన, తీవ్రమైన, బాధాకరమైన ప్రతిస్పందన ఉంటుందని తన టెలిగ్రామ్ ఛానల్‌లో ప్రచురించిన ప్రసంగంలో చెప్పారు. అమెరికాతో సైనిక పోరాటం జరపడంతో పాటు ప్రధానంగా ఉత్పత్తి, ప్రజల జీవనోపాధి కోసం తాము పోరు సాగించాల్సి ఉంటుందని అన్నారు. కరెన్సీలో తీవ్రమైన హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మార్కెట్ నిర్వహణ వంటివి తమ ముందు ఉన్న ప్రధాన సవాళ్లని తెలిపారు. ఇరానీయులు కష్టాలను సహించగలరని, కానీ దుర్వినియోగాన్ని సహించబోరని, ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటారని చెప్పారు.

# స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్



హనుమకొండ , సెప్టెంబర్ 8
( వుదయం ప్రతినిధి )
హనుమకొండ, సెప్టెంబర్ 08
(వుదయం ప్రతినిధి) :

హనుమకొండ జిల్లాకు సంబంధించి సుబేదారి రెడ్ క్రాస్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మంగళవారం అదనపు కలెక్టర్ ఎన్. రవి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టే త్రైమాసిక తనిఖీలో భాగంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, స్ట్రాంగ్‌రూమ్‌ల పరిస్థితి, స్ట్రాంగ్ రూముకు వేసి ఉన్న సీళ్లను క్షుణ్ణంగా కలెక్టర్ పరిశీలించారు. భద్రతకు సంబంధించిన రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా నిరంతర నిఘా వ్యవస్థలో భాగంగా గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలు పకడ్బందీగా అమలుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల సీళ్లు, తాళాలు, ప్రవేశ-నిష్క్రమణ విధానం, సీసీ కెమెరాల నిఘా వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. .ఈ సందర్భంగా హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలలో కాంగ్రెస్ పార్టీ నుండి ఈ.వి. శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నుండి బి. ప్రవీణ్ కుమార్, బిజెపి నుండి నర్మెట శ్రీనివాస్, టిడిపి నుండి కుసుమ శ్యాం సుందర్, వైఎస్ఆర్సిపి నుండి నాగబెల్లి రజినీకాంత్, బీఎస్పీ నుండి అంబాల ప్రశాంత్, ఏఐఎంఐఎం నుండి సయ్యద్ ఫైజుల్లా, సిపిఎం నుండి జి. వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరణ

**రివైజ్డ్ షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి.**
**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**
ములుగు, సెప్టెంబర్ 08
(వుదయం ప్రతినిధి) :




భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పు వంటి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు తప్పనిసరిగా విచారణకు హాజరై తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ 17 ఆగస్టు - 7 అక్టోబర్ నోటీసుల దశ, విచారణలు, క్లెయిమ్స్ అభ్యంతరాల పరిష్కారం 17 ఆగస్టు - 5 నవంబర్ తుది ఓటరు జాబితా ప్రచురణ 9 నవంబర్, జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (EROలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (AEROలు), సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు (BLOలు) సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్2026 కార్యక్రమ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

# నాణ్యత ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలి



**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
**హసన్‌పర్తి మండలంలోని దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించిన కలెక్టర్**
హనుమకొండ, సెప్టెంబర్ 08
(వుదయం జిల్లా ప్రతినిధి):

నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న అర్బన్ మిషన్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఎన్ని రోజుల్లోగా పూర్తి చేయగలరని విషయాన్ని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ లైన్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఈ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఉపయోగిస్తున్న నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఈఈ బి. గాయత్రి, గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, డీఈలు శ్రీనివాస్, జట్టి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమనవాణి, ఏఈలు అనిల్, నీరజ, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం

## జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన

సూర్యాపేట, సెప్టెంబర్ 8
(వుదయం ప్రతినిధి):




అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఏ. శ్రీ దేవసేన తెలిపారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఆమె, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ దేవసేన మాట్లాడుతూ... రాష్ట్రంలో జరిగే ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని, సూర్యాపేట జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు ప్రధాన సమస్యలు ఏమీ గుర్తించలేదని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీల ద్వారా తెలుసుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ... జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 1212 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి కేంద్రానికి బీఎల్ఓలను నియమించామని తెలిపారు. జిల్లాలో 4,286 మంది బీఎల్ఏలు, 10,08,252 మంది ఓటర్లు ఉండగా 9,11,945 ఎన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ చేశామన్నారు. జిల్లాలో మహిళాపురుష నిష్పత్తి 50.97 శాతం, 7,457 మంది సీనియర్ సిటిజన్లు, 15,189 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని తెలిపారు. మ్యాపింగ్ కానీ, చిరునామా, వయసు తేడాలున్న 1,94,106 మంది ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేసి విచారణ చేస్తున్నామన్నారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా ఉద్దేశపూర్వక అవకతవకలు జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలు పొందేందుకు సహకరిస్తామని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్ రాజ్, ఆర్డీఓలు వేణుమాధవ్ రావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసిల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళ' సేవలు పరిశీలన: కీర్తినగర్ యు పి హెచ్ సి సందర్శన

వరంగల్, సెప్టెంబర్ 08
(వుదయం ప్రతినిధి) :



మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్య మహిళ' క్లినిక్‌ల ద్వారా మహిళలకు ప్రతి వారం నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందేలా చూడాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DMHO) డాక్టర్ బి. రాజారెడ్డి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రోజున కీర్తినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (UPHC) లో నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ క్లినిక్'ను డిఎంహెచ్ఓ ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో మహిళలకు అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవలు, స్క్రీనింగ్ పరీక్షల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని సంబంధిత రికార్డులను, రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ తర్వాత క్లినిక్‌కు వచ్చిన మహిళా రోగులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి, వారికి అందుతున్న ఉచిత వైద్య పరీక్షలు, ఔషధాల సరఫరా మరియు ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారో లేదో వివరాలు తెలుసుకున్నారు. డిఎంహెచ్ఓ జారీ చేసిన ముఖ్య సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. సమర్థవంతమైన స్క్రీనింగ్ ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి మహిళకూ అవసరమైన అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి. తదుపరి చికిత్స రిఫరల్: స్క్రీనింగ్ పరీక్షల్లో ఏవైనా ఆరోగ్య సమస్యలు లేదా అనుమానిత కేసులు గుర్తిస్తే, వారికి తక్షణమే తగిన ఉన్నత వైద్య పరీక్షలు, పూర్తి స్థాయి చికిత్స అందించడంతో పాటు అవసరమైన రిఫరల్ సేవలను వేగవంతం చేయాలి. సమయపాలన తప్పనిసరి: ప్రతి మంగళవారం నిర్ణీత సమయాల్లో 'ఆరోగ్య మహిళ క్లినిక్' ఖచ్చితంగా అందుబాటులో ఉండాలి. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలి. నిర్లక్ష్యం సహించేది లేదు: పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో యు.పి.హెచ్.సి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను మూడు రోజుల్లో పూర్తి చేయాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అంకిత్**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి)



భూముల రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వేలో భాగంగా రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో రీసర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పురోగతి, మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు, అవసరమైన సిబ్బంది, పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. బోజ్యా తండా పరిధిలో భూ రీసర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు, రికార్డులు, పత్రాలను సేకరించి, భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. .ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీసర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూ పత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు. రీ సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు, విస్తీర్ణం వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధారప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్డ్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, అధికారులు, పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేక పార్టీ బీఆర్ఎస్ డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య ఫైర్

**స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు**
సూర్యాపేట సెప్టెంబర్ 8
(వుదయం ప్రతినిధి)



దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఎప్పుడూ చిన్నచూపేనని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య ఆరోపించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు దళితులంటే చిన్నచూపని, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి తానే ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. దళితులకు మూడు ఎకరాల భూమి హామీ ఏమైందని, ఇప్పటివరకు ఒక్క దళిత కుటుంబానికి కూడా భూమి ఇవ్వలేదన్నారు.

దళితబంధు పథకం పేరుతో భారీ అవినీతి జరిగిందని, అర్హులైన దళితులకు రూ.10 లక్షల సాయం న్యాయంగా అందలేదని ఆరోపించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అవమానించడం అంటే యావత్ దళిత సమాజాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. తన లాంటి దళితుడిని డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. అసెంబ్లీ ముట్టడిలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి స్పృహ తప్పినట్లు నటించారని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు.

ఒకప్పుడు సాధారణంగా ఉన్న జగదీష్ రెడ్డి నేడు వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. కుల, మతాలకు అతీతంగా 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దేనని, గోదావరి జలాలు తెచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డిదేనని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరై చర్చించాలని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల అధ్యక్షుడు వీరన్న నాయక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, చెంచాల మణిలత శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, చినుముల సునీల్ రెడ్డి, సంద్రపాటి విజయ్ కుమార్, కుంభం రాజేందర్, కొనతం రాజేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కోడి నాగరాజు, బానోతు సైదులు, రెబల్ శీను, గడ్డం వెంకన్న, రుద్రంగి రవి, సాజీదు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాత మధును వెంటనే భర్త రఫ్ చేయాలి

**పట్టణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన**
**కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల అనిల్**
నల్గొండ జిల్లా సెప్టెంబర్ 09
(వుదయం ప్రతినిధి ):



నల్గొండ పట్టణ కేంద్రంలో అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల అనిల్ డిమాండ్ చేశారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలోని క్లాక్ టవర్స్ సెంటర్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు, టిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ దేవాలయం లాంటి అసెంబ్లీలో స్పీకర్ పై టిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సూచనేమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తాత మధుపై కఠిన చర్యలు తీసుకొని అతని వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత బిఆర్ఎస్ నేతలు మతిస్థిమితం కోల్పోయి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజావిశ్వాసం కోల్పోయిన బిఆర్ఎస్ నేతలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ద్వయంత్తారు. బీఆర్ఎస్ నేతలకు రాజకీయ విలువలు ఉంటే వెంటనే ఆ పార్టీ అగ్రనేతలు ఎమ్మెల్సీ తాత మధును ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి పెరిక అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక చిట్టి, జిల్లా కార్యదర్శి చింతమల్ల లింగమయ్య, సీనియర్ నాయకులు చింతమల్ల వెంకటయ్య జిల్లా నాయకులు సంద బాలస్వామి, ఎన్నమల్ల ప్రభాకర్ , బత్తుల సైదులు, అనుములపూరి నాగరాజు, తల్లమల్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

# గణేష్ నిమజ్జనంకు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేయాలి

**– జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**
మహబూబాబాద్, సెప్టెంబర్ 08
(వుదయం ప్రతినిధి) :



జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్‌తో కలసి వివిధ శాఖల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర మార్గాలు, ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రూట్ డైవర్షన్లు అమలు చేయాలి. విద్యుత్ & రహదారులు: ఊరేగింపు మార్గాల్లో వేలాడే విద్యుత్ తీగలను సరిచేసి, రోడ్ల గుంతలను వెంటనే పూడ్చాలి. ఘాట్ల వద్ద నిరంతర విద్యుత్, హైమాస్ట్ లైట్లు, అదనపు జనరేటర్లు సిద్ధం చేయాలి. ఘాట్ల వద్ద ఏర్పాట్లు: విగ్రహాల నిమజ్జనానికి వీలుగా క్రేన్లు, నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు పూర్తి చేయాలి. ప్రమాద నివారణకు బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, రెస్క్యూ టీమ్‌లు, ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉంచాలి. పారిశుధ్యం: నిమజ్జనం పూర్తయిన వెంటనే షిఫ్టుల వారీగా పారిశుధ్య కార్మికులను నియమించి వ్యర్థాలను, పూజా సామగ్రిని తొలగించి ప్రాంతాలను శుభ్రపరచాలి. మండప అనుమతులు (ఎస్పీ ప్రకటన): గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు వెబ్‌సైట్ ద్వారా గానీ, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గానీ దరఖాస్తు చేసుకుని ముందస్తు అనుమతి పొందాలి. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె .అనిల్ కుమార్, పురుషోత్తం, డిఆర్వో నాగావాణి, డిఆర్డిఓ మధుసూధనరాజు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట లో ఘనంగా మరియమాత జన్మదినోత్సవం

అశ్వారావుపేట సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి):

అశ్వారావుపేట మండలంలోని గుడ్ న్యూస్ స్కూల్ చర్చి (అపోస్తుల రాగ్ని దేవాలయం) లో ఫాదర్ టోనీ ప్రసన్న ఆధ్వర్యంలో ఏసుప్రభు యొక్క తల్లి మరియమాత జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత పేరాయి గూడెం చర్చి నుంచి మరియ తల్లి నీ పల్లకి మీద ఊరేగిస్తూ, కొవ్వొత్తులతో ర్యాలీగా నిర్వహించారు. అనంతరం (విచారణ చర్చి) అపోస్తుల రాగ్ని దేవాలయం నందు పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంల ఫాదర్ యాకూబ్ రాజు, సిస్టర్స్ రోసిలి, టెన్సి, సంఘ కాపరులు జోసెఫ్, శ్యాంసుందర్ , మధు ,సంఘ పెద్దలు జుజ్జారపు అప్పారావు, జుజ్జారపు రాంబాబు, బొడ్డపాటి ఉదయ్, గడ్డం రామారావు, నార్లపాటి మీన, బొడ్డపాటి ప్రసాద్, నెహ్రూ నగర్ ,పాత పేరయి గూడెం ,టౌన్ నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026 గడువు అక్టోబర్ 7 వరకు పొడిగింపు

**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
జనగామ, సెప్టెంబర్ 08
(వుదయం ప్రతినిధి) :



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR2026) గడువును పెంచినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝా తెలిపారు. ప్రజల సౌకర్యార్థం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువును సెప్టెంబర్ 16 నుండి అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

అర్హులైన పౌరులు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, చిరునామా సవరణల కోసం నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరై తమ వివరాలు సరిచేసుకోవాలని కోరారు. సవరించిన ఎన్నికల షెడ్యూల్ క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 17 నుండి అక్టోబర్ 7 వరకు విచారణలు, పరిష్కారం ఆగస్టు 17 నుండి నవంబర్ 5 వరకు తుది ఓటరు జాబితా ప్రచురణ: నవంబర్ 9 సవరించిన షెడ్యూల్‌ను ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బిఎల్వోలు పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

# రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలి



**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. కిషోర్ కుమార్.**
వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి
సెప్టెంబర్ 8.

జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. కిషోర్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయునిపహాడ్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు, లోపాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పకడ్బందీగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ వివరాల నమోదులో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ రీసర్వే లో సంబధిత శాఖల అధికారులు సర్వేర్లు ఉన్నారు.

# మహాదేవపూర్ లో జరిగే అవినీతికి మంత్రి బాధ్యత వహించాలి

**బిఆర్ఎస్ మహిళా నాయకురాలు గీతా**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
సెప్టెంబర్ 08(వుదయం ప్రతినిధి):



మహాదేవపూర్ లో జరిగే అవినీతికి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బాధ్యత వహించాలని బి ఆర్ ఎస్ మహిళా నాయకురాలు కేదారి గీతా బాయ్ డిమాండ్ చేశారు మంగళవారం మహాదేవపూర్ మండల కేంద్రంలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును ఏకవచనంతో సంబోధిస్తే నాలుకలు చేరేస్తాము అంటూ అధికార పార్టీకి చెందిన ఇద్దరు మహిళ నాయకురాలు అనడం సరికాదని మా నాయకుడి దయతో ఎంపీపీ పదవిని అనుభవించి నేడు పుట్ట మధును విమర్శించడం తగదని ఇతవు పలికారు. మంత్రి కొండా సురేఖను తప్పించి వేములవాడ కాళేశ్వరం దేవాలయాలను తీసేసి పునర్నిర్మాణం చేయడంలో భాగంగా కొండా సురేఖ ను తప్పించడంలో శ్రీధర్ బాబు పాత్ర ముఖ్యమైనదని ఆరోపించారు. పుట్ట మధు మా దేవుడు మాకు పదవిని ప్రసాదించాడాని గతంలో ఫేస్బుక్ వాట్సప్ లలో పోస్టులు పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు.

అసెంబ్లీ సాక్షిగా జరిగిన దుశ్శాసన పర్వంలో భాగంగా మహిళలను అవమానించడంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పాత్ర లేదా అని ప్రశ్నించారు. పదవుల కోసం కాళ్లు మొక్కే అవసరం మాకు లేదని అన్నారు. మండల కేంద్రంలో జరిగే అవినీతిలో భాగంగా సొంత భూములకు డిమాండ్ వచ్చే విధంగా తమ బంధువుల భూముల వద్ద సిసి రోడ్లు వేయించి లాభం పొందాలని చూస్తున్నది సర్పంచ్ కాదా అన్నారు ప్రభుత్వ పాఠశాల కు సంబంధించిన 10 లక్షలు డిమాండ్ చేసే కర్రను అమ్ముకొని అక్రమంగా డబ్బులు దండుకున్నారని అన్నారు. వార్డ్ నెంబర్లు ఉపసర్పంచ్ కు సంబంధం లేకుండా తీర్మానాలు చేసి అవసరం లేని చోట సీసీ రోడ్లు వేస్తున్నారని బోర్లా మరమ్మత్తు పేరుతో ఎం బి రికార్డులు చేయించి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గృహ నిర్మాణాల కోసం ఓ ప్రైవేట్ వ్యక్తిని మధ్యవర్తిగా పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఈ ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నించినందుకే మంత్రి శ్రీధర్ బాబు అప్పుడు ఇప్పుడు ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నారని లేకపోతే మంత్రి హైదరాబాద్ కే పరిమితమై ఉండేవాడనే విషయాన్ని గ్రహించాలనే అన్నారు. పుట్ట మధు గురించి అసత్యపు ఆరోపణలు ఇస్తే సహించేది లేదని తెలిపారు ఇప్పటికైనా కళ్లు తెరిచి మహాదేవపూర్ లో జరిగే అవినీతికి

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు

# దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




**డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస**
ఖమ్మం వుదయం బ్యూరో
సెప్టెంబర్ 8

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో *ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో* దివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి *శ్రీమతి పి. దేవి మానస* పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న *దివ్యాంగజన్ కౌశల్ వికాస్* పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను, *దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు* ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే *దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు. దివ్యాంగుల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన వారికి *ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సలహా* అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో *జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖ సిబ్బంది మరియు దివ్యాంగులు* పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్

**రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలి**

**సేంద్రియ, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి**

**వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి సెప్టెంబరు 08 (వుదయం ప్రతినిధి)**



డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందిస్తున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు.డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఓసి అందజేత...

## ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

**జగిత్యాల సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి)**



సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అన్నారు ఆర్థిక స్థోమత లేక చికిత్స చేయించుకోలేని పేద కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో గుండె శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు ఈ నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన కొనాపూర్ కి చెందిన పంగ విజయ్ కూతురుకు గుండె శస్త్ర చికిత్సలు అవసరమవడంతో వారికి ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించేందుకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసి అందజేశారు తాళ్ళ ధర్మారం గ్రామానికి చెందిన గంగాధరీ సుమన్ కొడుకు గుండె శస్త్ర చికిత్స ఉండగా వారినీ పరామర్శించారుచిన్నారుల కుటుంబాలకు వైద్య ఖర్చుల విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు హైదరాబాద్ లోని నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో చిన్నారుల గుండె శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటైంది లండన్‌కు చెందిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ రావు ధన్నాపూనేని ఆర్మ్డ్ ఫోర్స్ వైద్యులు డాక్టర్ నిఖిల్ డైరెక్టర్ నిమ్స్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ డాక్టర్ ప్రవీణ్ ల సహకారంతో ఈ ప్రత్యేక శస్త్రచికిత్స కార్యక్రమం వారం పాటు కొనసాగుతోందని దాదాపు 25 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు వైద్య బృందం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తెలిపారు చిన్న వయసులోనే గుండె సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడంతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తెలిపారు.

# డంపింగ్ యార్డులో లక్షలు విలువ చేసే యంత్రాల చోరీ

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 08(వుదయం ప్రతినిధి)**



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి ఆర్కే వన్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో యంత్రాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. డంపింగ్ యార్డులో యంత్రాలు కనిపించకపోవడాన్ని గమనించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అపహరణకు గురైన యంత్రాల విలువ సుమారు లక్షయాభై వేల రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు. మున్సిపల్కమిషనర్ ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జాడి శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డంపింగ్ యార్డులో కి ఎవరు ప్రవేశించారు, యంత్రాలను ఎప్పుడు, ఎలా తరలించారు అనే కోణాల్లో పోలీసులు విచారణకొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు పేర్కొన్నారు. అపహరణకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# చిన్నారుల భవిష్యత్తుకు పునాది ప్రీ-ప్రైమరీ విద్య



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి):**

చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ప్రీ–ప్రైమరీ విద్య ఎంతో కీలకమని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మావలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన అతిథులకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అతిథులను ఘనంగా సన్మానించారు. పాఠశాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, అవసరమైన ఆట వస్తువులను శ్రీకాంత్ రెడ్డి అందజేశారు.చిన్నారులకు బాల్య దశ నుంచే నాణ్యమైన విద్యతో పాటు ఆటపాటల ద్వారా నేర్చుకునే అవకాశం కల్పిస్తే వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఈ సందర్భంగా అన్నారు.కార్యక్రమంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సొగల సుదర్శన్, సంతోష్ కుమార్, సుధారాణి, రమ, కుసుమ, స్పందన, ప్రశాంత్, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్

**కరీంనగర్ సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):**



కరీంనగర్ జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి (రెవెన్యూ) వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం వద్ద సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు, ఫైర్ సేఫ్టీ తదితర వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ల గోదాం తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్ (కాంగ్రెస్), నాంపల్లి శ్రీనివాస్ (బీజేపీ), సయ్యద్ ఇబ్రహీం (ఏఐఎంఐఎం), సిరిసిల్ల అంజయ్య (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు.. జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**



వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో 2023న జరిగిన భార్య హత్య కేసులో నిందితుడైన తోడసెం శ్యామ్ రావు పై నేరం రుజువు కావడంతో జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఆసిఫాబాద్ జీవిత ఖైదు మరియు రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్పీ నికిత పంత్ తెలిపారు.మార్చి 03.2023 రాత్రి సుమారు 9 గంటల సమయంలో వాంకిడి మండలం బంబారా గ్రామ శివారులో నిందితుడు తన భార్య తోడసం సంధ్యారాణితో కలిసి మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్నాడు. ఈ సమయంలో ఆమె మొబైల్ ఫోన్ రోడ్డుపై పడిపోవడంతో దానిని తీసుకునేందుకు మోటార్‌సైకిల్ నుంచి కిందకు దిగిందని, ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమె మృతి చెందినట్లు నిందితుడు పోలీసులను నమ్మించాడు.దీంతో తొలుత వాంకిడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.అయితే దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మృతురాలి తండ్రికి అందిన సమాచారం మేరకు,నిందితుడు తన భార్యను రాయితో కొట్టి హత్య చేసి,ఆ హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు పోలీసులకు అనుమానం ఏర్పడిందన్నారు.పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగించగా, నిందితుడు తన భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడని మార్చి 03.2023న ప్రయాణ సమయంలో ఆమెను రోడ్డు పక్కకు లాగి రాయితో కొట్టి హత్య చేసినట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి.అనంతరం ఆమె రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఇతరులను నమ్మించేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయిందన్నారు.దర్యాప్తు అధికారి బి. శ్రీనివాస్, సిఐ వాంకిడి (గతంలో) ఆధ్వర్యంలో పోలీసులు సాక్షుల వాంగ్మూలాలు, సంఘటనా స్థల పరిశీలన, నిందితుడి అరెస్ట్, నిందితుడి సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్న రక్తపు మరకలు కలిగిన రాయి, రక్తపు మరకలు ఉన్న మట్టి తదితర భౌతిక ఆధారాలతో పాటు వైద్య మరియు ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు.సేకరించిన సాక్ష్యాధారాలు,వైద్య మరియు శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నిందితుడు తన భార్యను ఉద్దేశపూర్వకంగా రాయితో కొట్టి హత్య చేసి, ఆమె మృతిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారణ కావడం తో చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు.కేసులో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు, వైద్య ఆధారాలు, శాస్త్రీయ ఫోరెన్సిక్ ఆధారాలు మరియు ఇతర దర్యాప్తు ఆధారాలను సమగ్రంగా పరిశీలించిన గౌరవ జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఆసిఫాబాద్ న్యాయమూర్తి శ్రీమతి బి. శారదా దేవి ,నిందితుడు తోడసం శ్యాంరావు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించారు.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఆసిఫాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీ జగన్మోహన్ రావు, పి.పి ఎం. శ్రీనివాస్ రావు,సమర్థవంతంగా వాదనలు వినిపించారు.కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సేకరించి, దర్యాప్తును పూర్తిచేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన వాంకిడి పోలీస్ స్టేషన్ దర్యాప్తు అధికారి శ్రీ బి.శ్రీనివాస్, ప్రస్తుత డిఎస్పి అశోక్ ,ప్రస్తుత సిఐ శ్రీ ఎస్. వేణుగోపాల్, ఎస్సై శ్రీ డి. మహేందర్, లైజనింగ్ ఆఫీసర్ కె. బాల్ సింగ్, సబ్ డివిజన్ సిడిఓ రాంసింగ్, అలాగే సాక్షులను సమన్వయం చేసి గౌరవ న్యాయస్థానంలో సకాలంలో హాజరుపరిచిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ నితిక పంత్ అభినందించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**ప్రైవేట్ కళాశాలల్లో రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం**

**నిర్మల్ జిల్లా 8 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**




రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌లో భాగంగా నిర్మల్ పట్టణంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో మంగళవారం బంద్ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సిహెచ్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై ఆధారపడి చదువుతున్న వేలాది మంది విద్యార్థులు, కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ప్రభుత్వం బకాయిలను విడుదల చేస్తామని హామీలు ఇస్తూ, ఆచరణలో మాత్రం జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. దీంతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, కళాశాలల నిర్వహణతో పాటు సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కష్టంగా మారుతోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీఎఫ్ (RTF) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. బకాయిల విడుదలలో మరింత జాప్యం చేస్తే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బంద్‌కు ప్రైవేట్ కళాశాలల నుంచి మంచి స్పందన లభించిందని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెంగ శ్రీధర్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ గడువులోగా ఇవ్వాల్సిందే..

**రైస్ మిల్లర్లు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్,**

**పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్**



**రాజన్న సిరిసిల్ల,సెప్టెంబరు 08 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు. యాసంగి, ఖరీఫ్ 2024–25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌పై మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లుల వారీగా కేటాయించిన సీఎంఆర్ పరిమాణం, ఇప్పటివరకు అందించిన బియ్యం, ఇంకా ఇవ్వాల్సిన పరిమాణంపై అధికారులు వివరాలు సేకరించారు,ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్, డైరెక్టర్ మిల్లర్లకు సూచించారు. గడువు సమీపించే వరకు వేచి చూడకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిర్ణీత లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎఫ్‌సీఐ డీఎంలు, పౌరసరఫరాల శాఖ అధికారులు,రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

**ఎమ్మెల్సీ తాత మధును సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నిరసన**

**అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం**

**కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం**

**ధర్మపురి, సెప్టెంబర్ 8: వుదయం ప్రతినిధి**



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మె ల్సీ తాత మధు చేసిన అనుచి త వ్యాఖ్యలు ధర్మపురిలో తీవ్ర నిరసనలకు దారితీసింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వ హించి,అనంతరం గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.స్పీకర్ స్థాయి వ్యక్తిపై నోరుజారిన ఎమ్మెల్సీ తాత మధును తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన స్పీకర్ పదవికి మచ్చ తెచ్చేలా వ్యవహరించ డం హేయమైన చర్య అని మండిపడ్డారు.అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచేలా ప్రతిపక్ష నేతలు మాట్లాడటం తగదని,ఇలాంటి ఘటనలను ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.తాత మధుపై కఠిన చర్యలు తీసుకునే వరకుఉద్యమం ఆపేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కుంట సుధాకర్, చీపిరిశెట్టి రాజేష్, సంగ నర్సింలు, అప్పం తిరుపతి, జక్కు రవీందర్,మున్సిపల్ కౌన్సిలర్లు సంఘీ ఆనంద్, ఒజ్జల లక్ష్మణ్, ముదుసుల ప్రశాంత్, అయ్యోరీ వేణు, సుముఖ్, దాసరి పురుషోత్తం, ఆశెట్టి శ్రీనివాస్, జాజల రమేష్,సీపతి సత్యనారాయణ, ఎండీ రఫీయొద్దీన్,చుక్క భీమరాజు, మొలగూరి రమేష్, దొనకొండ నరేష్, బొల్లారం పోచయ్య, బత్తిని నరేష్, గుడ్ల రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బియ్యాన్ని త్వరగా అందించాలి -జిల్లా కలెక్టర్

**మంచిర్యాల/సెప్టెంబర్ 8(వుదయం ప్రతినిధి)**



రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యాన్ని త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలో గల సమతా రైస్ మిల్‌ను ఆకస్మికంగా సందర్శించి రైస్ మిల్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించిన ఇండ్లకు మాత్రమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలో కొంతమంది రైతులు వరి సాగు చేయడాన్ని గమనించి వారితో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పంట సాగుకు బోర్లు, చెరువు అందుబాటులో ఉండడంతో వరి సాగు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్ లలో వివరాలు నమోదు చేస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు.

# కొడుకులు పోషించడం లేదని వృద్ధురాలి ఫిర్యాదు...

**సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం శనివారం హియరింగ్ నిర్వహిస్తాం... కలెక్టర్**

**జగిత్యాల సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి)**



తనను కొడుకులు పోషించడం లేదని తనకు న్యాయం చేయాలని మెట్పల్లి పట్టణంలోని ఆరపేటకు చెందిన వృద్ధురాలు చౌటపల్లి సత్తెమ్మ సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు ఈ ఫిర్యాదుపై సమాచారం అందుకున్న డిప్యూటీ ముఖ్యమంత్రి సమస్యను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్‌ను ఆదేశించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సత్తెమ్మ సమస్యను సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తెలిపారు. రాబోయే శనివారం సంబంధిత కుటుంబ సభ్యులను పిలిపించి హియరింగ్ నిర్వహించి వృద్ధురాలి సమస్యను చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు చౌటపల్లి సత్తెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు మల్లేశ్ ఉశాలు ఒక కుమార్తె ఉన్నారని అందరికీ వివాహాలు కాగా కుమారులిద్దరూ వేర్వేరుగా నివసిస్తున్నారని తెలిపారు. సుమారు మూడేళ్ల క్రితం ఆమె భర్త మృతి చెందడంతో అప్పటి నుంచి సత్తెమ్మ ఒంటరిగా జీవిస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రజాబంధు ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**



కాగజ్ నగర్ ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 21మందిని పరీక్షించగా అందులో 12 గురికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించబడునని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోగలరని సిర్పూర్ శాసనసభ్యులు,ఫౌండేషన్ అధ్యక్షులు డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.

# బాకీ కార్డుతో పల్లెబాట పట్టిన డాక్టర్ అఖిల్



**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):** రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జేష్ఠ కుమారుడు డాక్టర్ అఖిల్ కుమార్ కాంగ్రెస్ పాలకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ ప్రజలకు చేసిన మోసాలపై బాకీ కార్డుతో పల్లెబాట పట్టారు.మంగళవారం తర్నిక ల్ తండాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇచ్చిన పిలుపుతో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులు చెరుగుతూ ఇంటింటికి బాకీ కార్డు పంపిణీ చేశారు. ఇళ్ల తలుపుల కు స్టిక్కర్లు అతికించి కాంగ్రెస్ చేసిన మోసాలను ఎండగడుతూ బ్యాండ్ మేళాలు, తప్పెట్లతో తండాలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను నెరవేరుస్తున్నామని చెబుతూ కొత్త పెళ్లికూతురికి పెళ్లికొడుకు పట్టపగలు అరుంధతి నక్షత్రాన్ని చూపిన చందంగా రూ.500కే గ్యాస్ బండ ఇస్తున్నామని వెయ్యి రోజుల పాలనలో హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు.అధికార పీఠం దక్కక ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, నీటి మీద రాతల వలె సభలు, సమావేశాలు నిర్వహించి హామీలన్నీ నెరవేర్చామని మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న బియ్యం ఇస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటూ నూకలు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని గుర్తుంచుకుని అధికార పార్టీ నేతలకు బుద్ధి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో దారమోని గణేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డిండి ఎత్తిపోతల భూసేకరణ వేగవంతం




**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 (వుదయం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలో డిండి ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వేగవంతం చేసి, పెగ్ మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్యతో కలిసి సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పెగ్ మార్కింగ్, పరిహారం, ఆర్ అండ్ ఆర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డిండి ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూముల వివరాలు, ఇప్పటివరకు చేపట్టిన భూసేకరణ, పెగ్ మార్కింగ్ పురోగతి, ఆర్ అండ్ ఆర్ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టుకు అవసరమైన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి హద్దులను స్పష్టంగా నిర్ధారించి పెగ్ మార్కింగ్ ను త్వరితగతిన పూర్తి చేయాలని, భూసేకరణలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే గుర్తించి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపు, పునరావాసం, పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్) చర్యలను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని, అర్హులైన భూ నిర్వాసితులకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల సమన్వయ భేటీ



"జహీరాబాద్ సీఐ రవి కుమార్ "

**కోహిర్, సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి)**

గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కోహిర్ పోలీసులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో, ఎస్ఐ నరేష్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, భద్రతా చర్యలను వివరించారు. ప్రతి మండపానికి తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత శాఖల అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించరు .మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. తాత్కాలిక వైరింగ్, షార్ట్ సర్క్యూట్ వంటి కారణాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అధిక శబ్దంతో డీజేలు, లౌడ్‌స్పీకర్లు వినియోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని పోలీసులు సూచించారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే సమయంలో క్రమశిక్షణ పాటించాలని కోరారు. మండపాల వద్ద నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని, యువత అత్యుత్సాహానికి వెళ్లకుండా చూడాలని పోలీసులు సూచించారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సీఐ రవికుమార్, ఎస్ఐ నరేష్ సూచించారు.

# ఇంటి నిర్మాణానికి చేయూత



* రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**వెల్దండ సెప్టెంబర్ 9 (వు దయం)**

మండల పరిధిలోని రాచుర్ గ్రామానికి చెందిన తెలగమళ్ళ అనిత రవికుమార్ కు మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపి రామ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ గౌడ్,మాజీ వైస్ ఎంపీపి లు గోవర్ధన్,అనిల్ కుమార్, మాజీ ఎంపీటిసి గుత్తి వెంకటయ్య, మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,నాయకులు నిరంజన్,లింగం,ప్రభాకర్,రాజు,రాజేష్,వెంకటయ్య,అంజి మాస్టార్,ప్రవీణ్, గణేష్,నరేష్, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెండు పడక గదుల ఇళ్లలో లబ్ధిదారులే నివసించాలి

* అద్దెకు ఇచ్చినా.. విక్రయించినా చర్యలు తప్పవు

* కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)**



రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులు అద్దెకు ఇవ్వడం, విక్రయించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో ఎంపికైన లబ్ధిదారులే తప్పనిసరిగా నివసించాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు బ్లాక్‌లలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. పట్టాలను పరిశీలించారు. కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన కలెక్టర్.. అక్కడ నివసించని లబ్ధిదారుల వివరాలను సేకరించి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ సదుపాయం లేని అర్హులకు త్వరలోనే పథకం వర్తింపజేస్తామన్నారు.లబ్ధిదారులు తమ వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బ్లాకల పరిసరాల పరిశుభ్రత కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు నిత్యావసర సరుకుల విక్రయానికి షెడ్డు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసరాల్లోని పొదలను తొలగించాలని సూచించారు. ఇళ్లు లేని అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే తదుపరి విడతలో ఇళ్లను మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేనేత కార్మిక కుటుంబంతో మగ్గంపై చీరల తయారీ, మార్కెటింగ్ అంశాలపై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి భవనాన్ని కలెక్టర్ సందర్శించి, భవనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డీఈలు నరేందర్, లక్ష్మణ్, తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్, ఏఈఈ సతీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి



* ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి

* జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 8(వుదయం ప్రతినిధి)**

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా అక్షరాస్యత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు.జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా కొనసాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది. ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్స్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడమే కాకుండా వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు.అక్షరం ప్రతి ఒక్కరి హక్కు - విద్య ప్రతి కుటుంబానికి బలం అన్నారు.నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత పెరిగితే ప్రజల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు పెరిగి సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం ప్రతి ఒక్కరూ చదవాలి - ప్రతి ఒక్కరూ ఎదగాలి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని వయోజన విద్యా శాఖ, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో ఎన్ ఐ ఎల్ పి ఉల్లాస్ కార్యక్రమం కింద నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి.ఈ.ఓ విజయ కుమారి,డి.ఆర్.డి.ఓ నర్సింహులు, వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నపై రెడ్డి జాగృతి ఫిర్యాదు



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 09 (వుదయం ప్రతినిధి):** జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్, రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రెడ్డి జాగృతి నాయకులు మాట్లాడుతూ.. ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని, రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టంపై గౌరవంతో పోలీసుల చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండకింది మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బంక మోహన్ రెడ్డి, నాయకులు మొసలి శ్యాంప్రసాద్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు: భగ్గుమన్న ఆగ్రహం

* రాజ్యాంగ పదవికి గౌరవం లేదా? తాతా మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర నిరసన

* భారీ ర్యాలీ.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మల దహనం

**వికారాబాద్ సెప్టెంబర్ 9 ( వుదయం బ్యూరో)**



తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధు చేసినట్లు పేర్కొన్న అనుచిత వ్యాఖ్యలపై వికారాబాద్ జిల్లా కేంద్రం అట్టుడికింది. స్పీకర్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. రెస్ట్‌హౌస్ నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.'స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి'నిరసన కార్యక్రమంలో గడ్డం అనన్య మాట్లాడుతూ.. శాసనసభాపతి వంటి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని మండిపడ్డారు. తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని, వారిని ఎమ్మెల్సీ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు తాతా మధు గౌరవ స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.'ప్రసాద్ కుమార్‌కు అండగా వేలాది కాంగ్రెస్ కుటుంబాలు'"ప్రసాద్ కుమార్ గారికి ఎవరూ లేరని అనుకుంటున్నారా? దళితులకు అండగా ఎవరూ లేరని భావించవద్దు. మా నాన్నగారికి, మాకు వేలాది కాంగ్రెస్ కుటుంబాలు అండగా ఉన్నాయి" అంటూ అనన్య తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల నుంచి అవమానకర వ్యాఖ్యలు ఎదురైనా తాము ఇప్పటివరకు శాంతియుతంగానే వ్యవహరించామని స్పష్టం చేశారు.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనకు చిన్నప్పటి నుంచే పరిచయమని, ఆమెను అత్తగా భావిస్తూ ఎల్లప్పుడూ గౌరవం, మర్యాద ఇస్తామని తెలిపారు. రాజకీయ విభేదాలు వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయకూడదని అన్నారు.'మచ్చలేని నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలా?'గడ్డం ప్రసాద్ కుమార్ సంస్కారం కలిగిన నాయకుడని, చిన్ననాటి నుంచే రాజకీయాల్లో కష్టపడి మచ్చలేని నాయకుడిగా ఎదిగి శాసనసభాపతి స్థాయికి చేరుకున్నారని అనన్య పేర్కొన్నారు. ఆయన స్థాయి, వయస్సు, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్ జాదవ్‌తో పాటు వికారాబాద్, మర్పల్లి, దారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్పీకర్‌పై వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. వికారాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల నిరసనలతో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# యువత ఆలోచనలకు జాతీయ వేదిక



* వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్–2027కు దరఖాస్తుల ఆహ్వానం

* ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి

**వుదయం, సిద్దిపేట / మెదక్ ప్రతినిధి**

వికసిత్ భారత్ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2027 కార్యక్రమానికి యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి తెలిపారు. మంగళవారం సిద్దిపేటలోని మై భారత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ యువజనోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. దేశ భవిష్యత్తు, వినూత్న విధాన రూపకల్పనలో యువత తమ ఆలోచనలు, ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ వేదిక దోహదపడుతుందని పేర్కొన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు 'సదరన్ గేట్‌వే: టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ రీజియన్' పరిధిలో ఉన్నాయని తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు, భవిష్యత్ సన్నద్ధత అంశాలపై ప్రాంతీయ సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించే అవకాశం యువతకు లభిస్తుందన్నారు.కార్యక్రమంలో వికసిత్ భారత్ ఛాలెంజ్, సాంస్కృతిక విభాగం, డిజైన్ ఫర్ భారత్, హ్యాక్ ఫర్ సోషల్ కాజ్, యూత్ ఆంత్రప్రెన్యూర్స్, యూత్ పార్లమెంట్ అనే ఆరు విభాగాలు ఉన్నాయని వివరించారు.ఎంపిక ప్రక్రియ డిజిటల్ క్విజ్, వ్యాసరచన, జిల్లా స్థాయి ప్రజెంటేషన్, రాష్ట్ర స్థాయి డైలాగ్ తదితర దశల్లో కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రతినిధులు 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ముగింపు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రంగాల నిపుణులు, దేశ నాయకత్వంతో తమ ఆలోచనలు పంచుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు.ఆసక్తి ఉన్న యువత mybharat.gov.in పోర్టల్‌లో పేరు, పుట్టిన తేదీ, జిల్లా వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం పొందే ఐడీతో క్విజ్, ఇతర పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలు పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలకు మై భారత్ జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని రంజిత్ రెడ్డి సూచించారు.

# నేత్రదానం - చూపుల వరస



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 వుదయం ప్రతినిధి:** నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు కంటి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు 41వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కొడవలూరు కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా డా.కె.కృష్ణ మాట్లాడుతూ.. పోషకాహార లోపం, రోడ్డు ప్రమాదాలు, రసాయన కర్మాగారాల్లో ప్రమాదాలు, చిన్నారులు మొనదేలిన వస్తువులతో ఆడుకోవడం, దీపావళి టపాకాయలు, ప్రయాణ సమయంలో పురుగులు కంటిని తాకడం వంటి కారణాలతో కార్నియా దెబ్బతిని అంధత్వం వచ్చే అవకాశం ఉందన్నారు. కంటి ముందు ఉండే పారదర్శక పొర అయిన కార్నియా తెల్లబడటం వల్ల చూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కార్నియా అంధత్వంతో బాధపడుతున్న వారికి మరణించిన వ్యక్తి కన్నును కుటుంబ సభ్యుల అనుమతితో దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని వివరించారు. మరణానంతరం కూడా తమ కళ్ల ద్వారా ఇతరులకు వెలుగును అందించడం మహత్తరమైన సేవ అన్నారు. నేత్రదానాన్ని ప్రతి కుటుంబం ఒక సంప్రదాయంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైనప్పుడే మొబైల్ ఫోన్‌ను వినియోగించాలని, విటమిన్‌ఏ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కళ్లను శుభ్రమైన నీటితో కడుక్కోవాలని, వైద్యుల సలహా మేరకే కంటి చుక్కల మందులు ఉపయోగించాలని తెలిపారు. కళ్లలో తేనె, ఆకురసాలు వంటి వాటిని స్వయంగా వేసుకోకూడదని హెచ్చరించారు. ర్యాలీలో నేత్రధికారి కొత్ర బాలాజీ, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని నేత్రదానం ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

# స్త్రీ నిధి: మహిళా వికాసం



* ఎలక్ట్రికల్ ఆటోలతో ఉపాధి.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు

* అర్హులైన మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

* కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)**


మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సెర్ప్ సహకారంతో స్త్రీ నిధి ద్వారా రూ.3 లక్షల రుణం మంజూరు కావడంతో ఇద్దరు మహిళా లబ్ధిదారులు ఎలక్ట్రికల్ ఆటోలను కొనుగోలు చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ ప్రాంగణంలో కలెక్టర్ ఈ ఎలక్ట్రికల్ ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు అందిస్తోందన్నారు. రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్న గట్టు మండలం వంటి ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులకు ఇలాంటి ఎలక్ట్రికల్ ఆటోలను అందించడం ద్వారా ఉపాధి అవకాశాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ ఆటోల మైలేజీ, సర్వీసింగ్ సదుపాయాలు, నిర్వహణ తదితర అంశాలపై లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్డీఓ ముషాహిదా బేగంతో కలిసి కొద్దిసేపు ఆటోలో ప్రయాణించి వాహనం పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ముషాహిదా బేగం, డీపీఎం సలోమి, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ సందీప్, ఏపీఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కులబ్‌గూర్‌లో అక్రమ నిర్మాణాల జోరు

* నిబంధనలు గాలికి.. చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

* జీ+2 అనుమతులుంటే.. జీ+3 నిర్మాణాలు ఎలా?

**సంగారెడ్డివుదయం:**



సంగారెడ్డి మండలంలోని కులబ్‌గూర్ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ పరిధిలో జీ+2 వరకు నిర్మాణాలకు అనుమతులు ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొన్ని చోట్ల జీ+3 నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తూ కూర్చున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని చరవాణి ద్వారా సంప్రదించగా, అందుబాటులో లేమని తెలిపారు , అక్రమ నిర్మాణాలపై స్పష్టమైన చర్యలు ఏ మేరకు తీసు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతుండటంతో పంచాయతీ ఆదాయానికి కూడా గండి పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కులబ్‌గూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్రంగా పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎమ్మెల్సీ పదవి రద్దు చేయాలి



* సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య

**వెల్దండ సెప్టెంబర్ 9 (వు దయం)**

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన MLC తాతా మధుసూదన్ వెంటనే MLC పదవిని రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య పేర్కొన్నారురాజ్యాంగం మనకు సమానత్వాన్ని కల్పించింది. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదు..రాజకీయ పదవుల్లో ఉన్నవారు బాధ్యతగా వ్యవహరించాలి. దళితులను అవమానించిన వారిపై పార్టీలు, సభా వ్యవస్థలు కఠిన చర్యలు తీసుకోవాల నీ కోరారు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సీ సెల్ మండల కార్యదర్శి అంజయ్య, మాజీ సర్పంచ్ సత్య నాయక్ తో కలిసి మాట్లాడారుదళితుల గౌరవం కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఎప్పుడూ ముందుండి పోరాడుతా మనీ పేర్కొన్నారు

# ఖచ్చితమైన భూమి, నాణ్యమైన ఇల్లు



* జిల్లాకలెక్టర్ హేమంత్ పాటిల్

**కల్వకుర్తి, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):** కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా కొన సాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, రెవెన్యూ, ప్రభుత్వ భూముల వివరాలపై అధికారులు, సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే హద్దులు, విస్తీర్ణం నమోదు చేయాలని సూచించారు. భవి ష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వంతో నిబం ధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలని, డేటా నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని అధికారులను ఆదేశించా రు.అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పురోగతి, ప్రభు త్వ సహాయంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలను వేగవంతం గా, సుందరంగా పూర్తి చేయాలని సూచించారు. ఆకర్షణీయంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను ప్రత్యేకం గా అభినందించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచుకో వాలన్నారు.గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను కూడా పరిశీలించిన కలెక్టర్, చిన్నారులకు పౌష్టికాహారం, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు.కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, ఏడీ సర్వే యర్ గిరిధర్, తహసీల్దార్ ఇబ్రహీం, ఎంఈఓ శంకర్ నాయక్, ఆర్ఐ కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 60 మంది విద్యార్థులు.. తృటిలో ప్రాణాపాయం!



**ధరూర్ సెప్టెంబర్ 08 (వుదయం బ్యూరో)**

ఒక్కసారిగా స్టీరింగ్ విరిగిపో యింది.. బస్సు అదుపుతప్పింది.. రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొ ట్టింది! బస్సులో 60 మందికి పైగా విద్యార్థులు.. క్షణకాలం ఏం జరుగు తుందో తెలియని భయానక పరిస్థితి. ధరూర్ మండలం జాంపల్లి గ్రామ శివారులో జరిగిన ఈ ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. కేటిదొడ్డి మండలం నుంచి గద్వాల మండలం సంగాలలోని ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకె ళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జాంపల్లి శివారుకు చేరుకోగానే బస్సు స్టీరింగ్ విరిగిపో వడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పో యినట్లు సమాచారం. దీంతో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉండటంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గుర య్యారు. అయితే చెట్టును ఢీకొట్టిన అనంతరం బస్సు నిలిచిపోవడంతో విద్యార్థులంతా ప్రాణాలతో బయట పడటం ఊరటనిచ్చింది. ఏదైనా చిన్న తేడా జరిగి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేదన్న ఆందోళన వ్యక్తమవుతోం ది. స్కూల్ బస్సుల భద్రతపై ప్రశ్నలు విద్యార్థులను తరలించే వాహనాల ఫి ట్‌నెస్‌పై అధికారులు కఠినంగా వ్యవ హరించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. వందలాది కుటుంబాల నమ్మకాన్ని మోస్తున్న స్కూల్ బస్సుల విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యానికీ తావులేకుండా వాహనాల కండిషన్, స్టీరింగ్, బ్రేకింగ్ వ్యవస్థల తో పాటు ఇతర భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రమాదానికి దారితీ సిన కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల ని స్థానికులు కోరుతున్నారు.

# ఆన్‌లైన్ ఫర్టిలైజర్ యాప్ రద్దు




**కొల్లాపూర్, సెప్టెంబర్ 08 (వుదయం ప్రతినిధి):** రైతులకు శాపంగా మారిన ఆన్ లైన్ ఫర్టిలైజర్ యాప్ ను రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బి. బాలపీర్ డిమాండ్ చేశారు.నాగర్ కర్నూల్ జిల్లా కొల్లా పూర్ మండలం నార్లాపూర్ గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యం లో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి బి. బాలపీర్, మండల ఉపా ధ్యక్షుడు నారమోని కిరణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసు కొచ్చిన ఆన్ లైన్ యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఆరుగాలం పంటలు పండిస్తు న్న రైతులకు యూరియా, ఫర్టిలైజర్ కొనుగోలుకు అనేక యాప్ లు పెట్టి జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. పెంచిన ఫర్టిలైజర్ ధరలను తక్షణమే తగ్గించాలని,రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు.ఆన్‌లైన్ యాప్‌లను రద్దు చేసి ఆఫ్ లైన్ లోనే యూరియా, డీఏపీ తదితర ఫర్టిలైజర్లను అందరికీ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీక రించి ఆందోళనలు, పోరాటాలు నిర్వ హిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు నిరంజన్, వెంకటస్వామి, మల్లేష్, కురుమయ్య, రాముడు, వెంకటేష్, లక్ష్మణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థులకు బంగారు బాట



* మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పిస్తాం
* కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)**

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తు న్నామని, విద్యార్థులు ప్రతిరోజూ పాఠ శాలకు హాజరై అందుబాటులో ఉన్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకో వాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సంద ర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థు లతో ముచ్చటించిన ఆయన పాఠశాల దుస్తులు, రాత, పాఠ్య పుస్తకాల పంపిణీపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల ను పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ప్రతిరోజూ రాగి జావ లేదా పాలు అందజేయాలని అధికారు లను ఆదేశించారు. పాఠశాలలో తగి నన్ని తరగతి గదులు అందుబాటులో ఉన్నందున వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పిల్లలందరూ ప్రతిరోజూ పాఠ శాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలువురు విద్యార్థుల అక్షరాస్య సామర్థ్యాలను స్వయంగా తెలుసుకున్న కలెక్టర్ వారిని అభినం దించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంతో పాటు తల్లి దండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకాంక్షించారు.

# చెత్తకు నిప్పు.. గద్వాల్‌కు పొగ ముప్పు!

* నోబెల్ స్కూల్ సమీపంలో వ్యర్థాల దహనం.. దట్టమైన నల్లటి పొగతో ఉక్కిరిబిక్కిరి
* ప్లాస్టిక్ వ్యర్థాల కాల్చివేతపై స్థానికుల ఆందోళన.. మున్సిపల్ అధికారుల తీరుపై ప్రశ్నలు

**గద్వాల సెప్టెంబర్ 08 (వుదయం బ్యూరో)**



గద్వాల పట్టణంలో చెత్త నిర్వహణ అస్త వ్యస్తంగా మారిందా? అన్న అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. నోబెల్ స్కూల్ పరిసర ప్రాంతంలో పట్టణం నుంచి సే కరించిన చెత్తను పెద్ద ఎత్తున డంప్ చేసి, అనంతరం నిప్పంటిస్తున్నారనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త లోని ప్లాస్టిక్ వ్యర్థాలు కాలిపోవడంతో దట్టమైన నల్లటి పొగ పరిసర ప్రాంతా లను కమ్మే స్తోంది. ఉదయం వేళల్లో పొగ తీవ్రత ఎక్కువగా ఉండటంతో స్థానికులు ఉక్కిరి బిక్కిరవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరం గంగా చెత్తను కాల్చడం వల్ల వెలువడే పొగతో చిన్నా రులు, వృద్ధులు, స్థానిక ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని చెబుతున్నారు. కాలుష్యం కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్లాస్టిక్ దహనం.. పర్యావరణానికి దెబ్బ చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉండటంతో వాటిని నిప్పంటించినప్పు డు వెలువడే పొగ మరింత ఇబ్బందిక రంగా మారుతోంది. ఒకవైపు పట్టణ పారిశుద్ధ్యం పేరుతో చెత్తను సేకరిస్తూ నే.. మరోవైపు దానిని బహిరం గంగా కాల్చడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తు న్నారు. చెత్త నిర్వహణకు శాస్త్రీయ విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ దహనాన్నే ఎందుకు ఆశ్రయిస్తున్నార న్నది అధికారులే సమాధానం చెప్పాలని ప్రజలు కోరుతున్నారు. చెత్త కాల్చొద్దు'.. ప్రజల విజ్ఞప్తి చెత్తను బహిరంగ ప్రదేశా ల్లో కాల్చ కుండా అధికారులు కఠిన చర్యలు తీసు కోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తు న్నారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సేకరిం చడం, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్‌కు తరలించడం వంటి పద్ధతు లను పకడ్బం దీగా అమలు చేయాలని కోరుతున్నారు.
నోబెల్ స్కూల్ పరిసరాల్లో పేరుకుపోతు న్న చెత్తతో పాటు దహనం కారణంగా వ్యాపిస్తున్న పొగ సమస్యపై గద్వాల్ ము న్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

# మట్టి వినాయకుడితోనే పర్యావరణ పరిరక్షణకు బాటలు

* ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల విగ్రహాలకు దూరంగా ఉండాలి
* కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్ర జలందరూ మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమా న్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గోడపత్రికలను, మట్టి వినాయక విగ్ర హాలను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లా స్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. అందు వల్ల మట్టి, సహజ రంగులతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించడం తో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చ న్నారు.పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా యువత బాధ్యతగా వ్యవ హరించి పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమం లో అసిస్టెంట్ పర్యావరణ శాస్త్రవేత్త వి ద్యుల్లత, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



* గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు
నిమజ్జన ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన..
* అధికారులకు కీలక ఆదేశాలు

**గద్వాల, సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)**

గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతం గా, సురక్షితంగా జరిగేలా అన్ని ఏర్పా ట్లను ముందుగానే పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులను ఆదేశించారు.
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగ ళవారం నదీ అగ్రహారం, బీచుపల్లి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ప్రాంతా లను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావుతో కలిసి ఆయన పరిశీలిం చారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజ రయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవ సరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు.
నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, రహ దారులు, బారికేడింగ్, పార్కింగ్, భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టా లని సూచించారు.నదీ తీర ప్రాంతా ల్లో భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ ఏర్పా ట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించా లని సూచించారు.గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి ఏర్పాటును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, నిమజ్జనానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కా ర్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చలానా చిచ్చు.. సామాన్యుడికే శిక్ష!

**గద్వాల సెప్టెంబర్ 01 (వుదయం కరస్పాండెంట్)**

నిబంధనలు అందరికీ ఒకటేనా? లేక సామాన్యుడికేనా? రోడ్డు భద్రత పేరుతో రవాణా శాఖ అధికారులు వాహనదారు లపై విధిస్తున్న జరిమానాల విషయంలో ఈ ప్రశ్న ఇప్పుడు తీవ్ర చర్చనీయాం శంగా మారింది. ముఖ్యంగా వాహనా లకు ఎల్ఈడీ లైట్లు అమర్చుకున్నారనే కారణంతో రూ.5,000 జరిమానా విధిస్తున్నారన్న ఫిర్యాదులు డ్రైవర్లలో తీవ్ర ఆగ్రహానికి కారణమ వుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవ డాన్ని ఎవరూ ప్రశ్నించడం లేదు. కానీ ఏ తప్పుకు రూ.5,000? ఏ సెక్షన్ కింద? ఏ నిబంధన ప్రకారం? అనే కనీస వివరాలు వాహనదారుడికి స్పష్టంగా తెలియా ల్సిన అవసరం ఉందని డ్రైవర్ల సంఘం అంటోంది. ఎల్ఈడీ అంటేనే రూ.5 వేలా? వాహనంలో ఎల్ఈడీ లైట్ కనిపిం చింది.. అంతే! రూ.5,000 చలానా అన్న ట్లుగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. అయితే ఎల్ఈడీ లైట్ ఎక్కడ అమర్చారు? దాని ఉద్దేశం ఏమిటి? సాధారణ అదనపు వెలుతురా? ఫ్లాషింగ్ లైటా? బీకన్ తరహాలో ఉందా? వాహన నిర్మాణంలో అనధికారిక మార్పు సెక్షన్' ఎక్కడ? జరిమానా విధించే రోజువారీ ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునే డ్రైవర్‌కు రూ.5,000 జరిమానా అంటే చిన్న విషయం కాదని సంఘం చెబుతోంది. ఒక రోజు, రెండు రోజుల సంపాదన కాదు.. కొందరి కుటుం బాలకు అది వారాల ఖర్చుతో సమానమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
రోడ్డు భద్రత పేరుతో చర్యలు తీసుకోవాలి.. కానీ జరిమానాల పేరుతో జీవనోపాధిపై భారం మోపకూడదు అని కోరుతున్నారు. నిబంధనలు ఉంటే.. బహిరంగపరచండి! రవాణా శాఖ అధికారుల తీరుపై డ్రైవర్ల సంఘం పలు ప్రశ్నలు సంధిస్తోంది.

**★ ఎల్ఈడీ లైట్‌కు రూ.5,000 జరిమానా విధించే ఖచ్చితమైన సెక్షన్ ఏది?**

**★ అన్ని రకాల ఎల్ఈడీ లైట్లకూ ఇదే జరిమానా వర్తిస్తుందా?**

**★లైట్ అమరిక, రకం, వినియోగాన్ని పరిశీలిస్తున్నారా?**

**★ ప్రభుత్వ వాహనాలకు వర్తించే నిబంధ నలు, మినహాయింపులు ఏమిటి?**

**★ చలాన్‌లో సంబంధిత సెక్షన్, ఆఫెన్స్ కోడ్‌ను పూర్తిగా ఎందుకు పేర్కొన కూడదు?**

**★ తప్పుగా జరిమానా విధించారని భావించే వాహనదారుడికి అప్పీల్ అవకాశం ఎలా ఉంటుంది?**

ఈ ప్రశ్నలకు రవాణా శాఖ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సంఘం డిమాండ్ చేస్తోంది. అధికారులూ.. సమాధానం చెప్పాల్సిందే! జోగులాంబ గద్వాల జిల్లా రవాణా కార్యాలయ పరిధిలో ఎల్ఈడీ లైట్లకు సంబంధించి విధిస్తున్న జరిమానాలపై సంబంధిత మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉన్నతా ధికారులు అధికారికంగా స్పందించాలని డ్రైవర్ల సంఘం కోరుతోంది. నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకోండి.. కానీ ఆ నిబంధన ఏమిటో కూడా ప్రజల కు చెప్పండి. చట్టం ముందు అందరూ సమానమే అయితే.. అమలులోనూ అదే సమానత్వం కనిపించాలి. చివరికి సా మాన్యుడి ప్రశ్న ఒక్కటే.. ఎల్ఈడీ లైట్ పెట్టుకున్నానని రూ.5,000 చలానా వేస్తే.. ఏ చట్టం కింద వేస్తున్నారో చెప్పండి. అదే లైట్ ప్రభుత్వ వాహనంలో ఉంటే ఏ నిబంధన వర్తిస్తుందో కూడా చెప్పండి." సమాధానం చెప్పాల్సింది డ్రైవర్ కాదు.. నిబంధనలు అమలు చేస్తున్న అధికారులే!

# పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 (వుదయం బ్యూరో):**

వినాయక చవితి సందర్భంగా పర్యావ రణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్య తగా వ్యవహరించాలని, మట్టి, సహజ రంగులతో తయారు చేసిన పర్యా వరణహిత వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రజలకు పి లుపునిచ్చారు.మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి గణ పతుల పంపిణీ, పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ దేవసహా యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా పర్యావరణహిత వినాయక విగ్రహాల ప్రతిష్టాపనపై రూపొందించిన అవగా హన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్క రించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రా రంభించారు.పీవోపీ విగ్రహాలతో నీటి కాలుష్యం:కలెక్టర్ మాట్లాడుతూ ప్లా స్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల ను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం ఏర్ప డుతుందని అన్నారు. పీవోపీ విగ్ర హాలు నీటిలో సులభంగా కరగవని, రసాయన రంగులు నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు.ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరులను, ప్రకృతిని పరిరక్షిం చేందుకు తమ వంతు బాధ్యత నిర్వ ర్తించాలని సూచించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరిం చాలని, మట్టి విగ్రహాల వినియోగం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించ వచ్చని అన్నారు.అనంతరం కలెక్టర్, ఎస్పీ కలెక్టరేట్ ఉద్యోగులకు మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డా. ఆర్. మహేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, సంబంధిత శాఖల అధికారులు పా ల్గొన్నారు.

# ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 08 (వుదయం బ్యూరో):**

జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్లు నిర్దేశిత నిబంధనల ప్రకారం నిర్వ హించబడేలా పటిష్ట పర్యవేక్షణ చే పట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు.మంగళవారం నాగర్ కర్నూల్ సమీకృత కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా రి జిస్ట్రింగ్ అథారిటీ (DRA), జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ (DLMMAA) కమిటీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన జరిగాయి. సమావే శానికి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ హాజరయ్యారు.ఈ సందర్భం గా జిల్లాలోని క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ల నమోదు, నిర్వహణ, తనిఖీలు, నూతన అనుమతులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.లింగ నిర్ధారణ పరీక్షలకు అడ్డుకట్ట వేయాలి:గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా నిరోధించేందుకు అధికారు లేదా సహకరించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్లపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి రికార్డులను సమ గ్రంగా పరిశీలించాలని, నిబంధనల ఉల్లంఘన గుర్తిస్తే వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అక్రమ కార్య కలాపాల అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, సంబంధిత కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, ప్రైవేట్ ఆసుపత్రుల జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ చిన్నయ్య, నాగర్ కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట డీఎస్పీ లు శ్రీనివాస్ యాదవ్, పి. శ్రీనివాసులు, DRA, DLMMAA కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొ న్నారు.

# ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత బీమా



* ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి త్వరలో శ్రీకారం
* జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 08 (వుదయం కరస్పాండెంట్)**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ, భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయ నున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా కుటుంబ పెద్దకు రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పిం చనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలపై రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ మంగళ వారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులను ఏ విధంగా స్వీక రించాలి, ఆన్‌లైన్‌లో ఏ విధంగా నమోదు చేయాలి అనే అంశాలపై కలెక్టర్ల అభిప్రా యాలను సేకరించారు. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల కుటుంబ పెద్దలకు రూ.5 లక్షల జీవిత బీమాను ఉచితంగా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలతో పాటు మిగిలిన అర్హత కలిగిన కుటుంబాల కుటుంబ పెద్దలకు కూడా ఉచిత బీమా కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.కుటుంబ పెద్ద ప్ర మాదవశాత్తు మరణించిన సందర్భంలో వారి నామినీకి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందేలా పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 19లోపు దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసి పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు చే పట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ప్రజల కు పథకం ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గద్వాల ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో పాటు ఈడీఎం శివ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల గుర్తింపు - అసలైన గురుదక్షిణ



* ట్రస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి

**నారాయణపేట సెప్టెంబర్ 8(వుదయం ప్రతినిధి)**

ప్రతి ఉపాధ్యాయుడికి సరైన గుర్తింపు నిజమైన గురుదక్షిణ అని ట్రస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి అన్నారు. గు రుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నారాయణపేట డిఈఓ డాక్టర్ గోవిందరాజు కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. మం గళవారం జిల్లా విద్యాశాఖ కార్యాల యంలో ట్రస్మా సభ్యులు డిఈఓ ను శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపిస్తూ మొక్కను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ బీఈడీ కళాశాల లో ఎంతోమంది ఉపాధ్యాయులను తయారుచేసిన గొప్ప గురువుగా గోవిందరాజును అభినందించారు. ఉమ్మడి జిల్లాలో డిప్యూటీఈవో, డీఈవోగా పనిచేసి విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు చక్కటి మార్గ నిర్దేశం చేశారని కొనియాడారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లు అనే తేడా లేకుండా విద్యార్థులం దరికీ అత్యుత్తమ విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలి తాలను సాధించేందుకు చక్కటి ప్రణాళిక రూపొందించి అమలు చేయడం అభినందనీయమన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృ తిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు భాగస్వాములు అయ్యేవిధంగా ఉపాధ్యాయుల ద్వారా ప్రోత్సాహం అందించి వారిని అన్ని రంగాల్లో రాణించే విధంగా సర్వతో ముఖాభి వృద్ధికి కృషి చేశారన్నారు. జిల్లాలో వివాదరహితుడిగా చక్కటి సేవలు అందించడం అభినందనీయమన్నా రు. కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షులు ఎండి ఖదీర్, రాష్ట్ర ఆర్గ నైజింగ్ సెక్రటరీ రాజేష్ కుమార్, ఎంఈఓ బాలాజీ, సెక్టోరియల్ అధి కారులు రాజేంద్రకుమార్, సంగీత, యాదయ్యశెట్టి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ బాలప్ప, ఆంజనేయులు, వరలక్ష్మీ, చిన్న, ఇమ్రాన్ భాషా, ఆనంద్, సాయిలు, పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ తక్షణ రద్దు

* సీఐటీయూ మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్

**వట్ పల్లి, సెప్టెంబర్ 8 (వుదయం ప్రతినిధి)**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ వట్ పల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్య క్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా మహేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కనీస వేత నాలకు భంగం కలిగించే నిబంధనల ను అమలు చేయడం సరికాదన్నారు. కార్మిక ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్య క్షుడు బి. జనార్ధన్, గోరెకల్ అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దాస్ రాదయ్య, సత్యనారాయణ గౌడ్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## మహిళల్లో గుండె పోటు వచ్చే ముందు కనిపించే లక్షణాలు ఇవే..


గుండెపోటు అంటే వెంటనే గుర్తొచ్చేది ఛాతిలో తీవ్రమైన నొప్పి. అయితే మహిళల్లో గుండెపోటు లక్షణాలు చాలాసార్లు ఇంత స్పష్టంగా కనిపించవు.



సాధారణ అలసట, ఒత్తిడి, వయసు పెరగడం లేదా మెనోపాజ్ కారణంగా వచ్చిన మార్పులుగా భావించి కొన్ని లక్షణాలను మహిళలు నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గుండెపోటుకు కొన్ని వారాల ముందే కనిపించే అసాధారణ అలసటను ఏమాత్రం తేలికగా తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మహిళల్లో గుండె సంబంధిత సమస్యలను గుర్తించడంలో ఆలస్యం జరిగే అవకాశం ఉంటుంది. ఛాతి నొప్పితో పాటు అసాధారణంగా అలసటగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, నిద్రలో మార్పులు వంటి లక్షణాలు కూడా గుండెకు సంబంధించిన సమస్యలకు సంకేతాలు అవుతాయి. ఈ లక్షణాలను ఒత్తిడి, ఆందోళన, గ్యాస్ లేదా అజీర్ణం వంటి సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తే చికిత్స ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుంది. మహిళల్లో గుండెపోటుకు ముందుగా కనిపించే ముఖ్యమైన హెచ్చరిక సంకేతాల్లో అసాధారణమైన అలసట ఒకటి. ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా సాధారణం కంటే ఎక్కువగా అలసటగా అనిపించడం, రోజువారీ పనులు చేయడానికే శక్తి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరానికి రక్తప్రసరణ తగ్గడం వల్ల శక్తి స్థాయిలు తగ్గి ఈ విధమైన అలసట ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గుండెపోటుకు కొన్ని వారాల ముందు ఇలాంటి మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అసాధారణ అలసటతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో ఒత్తిడి లేదా అసౌకర్యం, దవడ, మెడ, భుజం, వీపు లేదా చేతికి వ్యాపించే నొప్పి, తల తిరగడం, చల్లని చెమటలు, వికారం లేదా అజీర్ణంలా అనిపించడం, నిద్రలో అంతరాయాలు వంటి లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. పురుషుల్లో గుండెపోటు సమయంలో కనిపించే ఛాతి నొప్పి వంటి క్లాసిక్ లక్షణాలతో పోలిస్తే మహిళల్లో లక్షణాలు మరింత సున్నితంగా లేదా భిన్నంగా ఉండే అవకాశం ఉంటుంది. అందువల్ల వాటిని వెంటనే గుండె సమస్యలతో సంబంధం ఉన్నవిగా గుర్తించరు. ఈ కారణంగా వైద్య సహాయం పొందడంలో ఆలస్యం జరిగి, గుండెకు తీవ్రమైన నష్టం కలిగే ప్రమాదం పెరుగుతుంది. మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్, ధూమపానం, ఊబకాయం, కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర, మెనోపాజ్, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు మహిళల్లో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. అనారోగ్యకరమైన జీవనశైలి, అధిక ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారాల అధిక వినియోగం, నియంత్రణలో లేని ఒత్తిడి కూడా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అకస్మాత్తుగా ఛాతిలో అసౌకర్యం, కారణం తెలియని తీవ్రమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా దవడ, చేయి, మెడ, వీపు వైపు వ్యాపించే నొప్పి కనిపిస్తే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి. ముఖ్యంగా లక్షణాలు కొన్ని నిమిషాలకంటే ఎక్కువసేపు కొనసాగితే ఆలస్యం చేయకుండా సమీప అత్యవసర విభాగాన్ని సంప్రదించడం అవసరం. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి మహిళలు గుండెకు మేలు చేసే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధూమపానానికి దూరంగా ఉండడం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచడం, మధుమేహాన్ని అదుపులో ఉంచడం వంటి చర్యలు చేపట్టాలి. తగినంత నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఒత్తిడిని తగ్గించుకోవడం, అవసరమైన ఆరోగ్య పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడం ముఖ్యమే.

## కౌంట్ తగ్గిందని కంగారొద్దు.. అవసరమైతేనే ప్లేట్లెట్స్

మన రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్లెట్స్ అనే ప్రధాన రక్తకణ భాగాలు ఉంటాయి. ఇవి ప్రధానంగా ఎముక మజ్జ (బోన్ మ్యారో)లో ఉత్పత్తి అవుతాయి. తెల్ల రక్తకణాలు శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎర్ర రక్తకణాల్లోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తుంది. ప్లేట్లెట్స్ మాత్రం రక్తస్రావాన్ని నియంత్రించడంలో, రక్తం గడ్డకట్టే ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తాయి. సాధారణంగా పెద్దల్లో ప్లేట్లెట్ కౌంట్ సుమారు 1.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకు ఉంటుంది. అయితే వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, వయసు, ఇన్ఫెక్షన్లు తదితర అంశాల ఆధారంగా ఈ సంఖ్యలో మార్పులు ఉండవచ్చు. ప్లేట్లెట్ల సగటు జీవితకాలం సుమారు 7 నుంచి 10 రోజులు. పాత ప్లేట్లెట్లు తొలగిపోతుండగా, ఎముక మజ్జలో కొత్త ప్లేట్లెట్లు ఉత్పత్తి అవుతూ రక్తప్రసరణలోకి చేరుతాయి. శరీరానికి గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని ఆపే ప్రక్రియలో రక్తనాళాలు, ప్లేట్లెట్స్, రక్తం గడ్డకట్టే వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తాయి. అందువల్ల రక్తస్రావాన్ని నియంత్రిస్తూ ప్రాణరక్షణలో ప్లేట్లెట్స్ కీలక పాత్ర పోషిస్తాయి.



ప్లేట్లెట్ల సంఖ్య తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. డెంగ్యూ, మలేరియా, వైరల్ ఇన్ఫెక్షన్లు లాంటి వ్యాధుల సమయంలో ప్లేట్లెట్ కౌంట్ తాత్కాలికంగా పడిపోవచ్చు. ఎముక మజ్జలో ప్లేట్లెట్ల ఉత్పత్తి తగ్గడం, కొన్ని ఆటోఇమ్యూన్ పరిస్థితులు, కాలేయం లేదా ప్లీహం సంబంధిత సమస్యలు, కొన్ని మందుల ప్రభావం వంటి కారణాలు కూడా ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో ప్లేట్లెట్ల సంఖ్య సాధారణంగానే ఉన్నప్పటికీ వాటి పనితీరు దెబ్బతినవచ్చు. అందువల్ల కేవలం ప్లేట్లెట్ కౌంట్‌ను మాత్రమే కాకుండా, రోగి మొత్తం ఆరోగ్య పరిస్థితిని కూడా వైద్యులు అంచనా వేయాలి. ప్లేట్లెట్ కౌంట్ ఎంత తగ్గింది? ఎంత వేగంగా తగ్గుతున్నది? రక్తస్రావం ఉందా, లేదా? అనే అంశాల ఆధారంగా లక్షణాలు మారవచ్చు. చర్మంపై చిన్న ఎర్రటి లేదా ఊదా రంగు మచ్చలు (పెటీకియా), సులభంగా గాయాలు ఏర్పడటం, ముక్కు లేదా చిగుళ్ల నుంచి రక్తస్రావం, మూత్రం లేదా మలంలో రక్తం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే ప్లేట్లెట్ కౌంట్ తక్కువగా ఉన్న ప్రతి ఒక్కరిలోనూ రక్తస్రావం తప్పనిసరిగా జరగదు. డెంగ్యూ వంటి ఇన్ఫెక్షన్లలో అధిక జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం లాంటి లక్షణాలు కూడా ఉండవచ్చు. రక్తస్రావం, తీవ్రమైన బలహీనత, రక్తపోటు పడిపోవడం లేదా ఇతర ప్రమాద సంకేతాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్లేట్లెట్ కౌంట్ తగ్గిన ప్రతిసారీ వెంటనే ప్లేట్లెట్స్ ఎక్కించాలనే అభిప్రాయం సరైంది కాదు. తాజా అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం, ప్లేట్లెట్ ట్రాన్స్‌ఫ్యూజన్ నిర్ణయం కేవలం ఒక సంఖ్య ఆధారంగా తీసుకోకూడదు. రోగికి రక్తస్రావం ఉందా, ప్లేట్లెట్ల సంఖ్య ఎంత ఉంది, వాటి పనితీరు ఎలా ఉంది, ఏ వ్యాధి కారణంగా ప్లేట్లెట్స్ తగ్గాయి, శస్త్రచికిత్స లేదా ఇతర వైద్య ప్రక్రియ అవసరమా లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వైద్యులు నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా డెంగ్యూ రోగుల్లో తీవ్రమైన రక్తస్రావం లేకపోతే కేవలం ప్లేట్లెట్ కౌంట్ తక్కువగా ఉందనే కారణంతో రొటీన్‌గా ప్లేట్లెట్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయడం సిఫారసు చేయడం జరగదు. 2025 నాటి WHO మార్గదర్శకాల ప్రకారం రక్తస్రావం లేని డెంగ్యూ రోగుల్లో ప్లేట్లెట్ ట్రాన్స్‌ఫ్యూజన్ వల్ల స్పష్టమైన ప్రయోజనం నిరూపితం కాలేదని పేర్కొంటున్నాయి.

అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ఉదాహరణకు అత్యవసర శస్త్రచికిత్స అవసరమైనప్పుడు, వైద్యుల క్లినికల్ నిర్ణయం మేరకు ప్లేట్లెట్లు అవసరం కావచ్చు. అందువల్ల ప్లేట్లెట్ కౌంట్ ఎంత? అనే ప్రశ్నతో పాటు రోగి పరిస్థితి ఎలా ఉంది? అనేది మరింత కీలకం.

## వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా..!

కొంత మందికి చిన్నవయసులోనే ముఖంపై ముడతలు పడుతుంటాయి. దీంతో వయసు తక్కువే అయినా ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. మరి ఈ సమస్యను తగ్గించుకోవడానికి ఏవేవో క్రీములు రాయడం, చికిత్సలు చేయించుకోవడం వంటివి చేస్తుంటారు. అయితే ముందు నుంచే చక్కటి పోషకాహారం తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు రాకుండా నివారించవచ్చు అంటున్నారు నిపుణులు. చర్మ సౌందర్యానికి ఉపయోగపడే పాలీఫినోల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, విటమిన్లు.. మొదలైనవి బ్లూబెర్రీ పండ్లలో అధికంగా లభిస్తాయి. ఇవి ఫ్రీరాడికల్స్ నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. అలాగే కొత్త చర్మకణాలను ఉత్పత్తి చేయడంలోనూ ఇవి సహాయపడతాయి. ఫలితంగా చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు రాకుండా జాగ్రత్తపడచ్చు అంటున్నారు నిపుణులు.



టమాటాల్లో ఉండే లైకోపీన్ అతి నీలలోహిత కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తుంది. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రక్తప్రసరణ సజావుగా జరిగి చర్మానికి మెరుపు వస్తుందట.

తేనెలో ఉండే ఔషధ గుణాలు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో సహాయపడతాయి. అందుకే తేనెను ఇంట్లో సహజసిద్ధంగా తయారు చేసుకునే ఫేస్‌మాస్కుల్లో ఉపయోగిస్తారని చెబుతున్నారు నిపుణులు. కొన్ని సందర్భాల్లో చర్మం ఎర్రగా మారడం, దద్దుర్లు రావడం జరుగుతుంది. ఇలాంటి సమస్యల్ని తగ్గించుకోవడానికి పెరుగులో ఉండే ప్రొబయాటిక్స్ తోడ్పడతాయి అంటున్నారు నిపుణులు.

యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే గ్రీన్ టీ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుందంటున్నారు. చర్మం యవ్వనంగా కనిపించాలంటే మన శరీరంలో నీటి శాతం తగినంత ఉండాలి. కాబట్టి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలి. వీటితో పాటు యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఇతర పండ్లు, కూరగాయల్ని తినడం అలవాటు చేసుకోవడం వల్ల చిన్నవయసులోనే వృద్ధాప్య ఛాయలు రాకుండా నివారించుకోవచ్చు అని సూచిస్తున్నారు నిపుణులు.

## చర్మం డల్‌గా కనిపిస్తోందా?

వివిధ కారణాల వల్ల ఒక్కోసారి చర్మంలో మార్పులు కనిపిస్తుంటాయి. ఈ క్రమంలో– చర్మం రఫ్‌గా తయారవుతున్నా.. డల్‌గా కనిపిస్తున్నా ఓసారి వైద్య నిపుణులను సంప్రదించి పరీక్ష చేయించుకోవడం అవసరం. దీంతో పాటు చర్మ సంరక్షణకు సంబంధించి కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అంటున్నారు నిపుణులు.

మన శరీరానికి సరిపడే ఆహారం మాత్రమే తీసుకోవాలి. అదే మన ఆరోగ్యానికి మంచిది. ప్రత్యేకించి జంక్ ఫుడ్స్, డెయిరీ ప్రొడక్ట్స్ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి.



అలాగే ప్రతి రోజూ సరిపడినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి.

ఏ కాలమైనా సరే– బయటికి వెళ్లేటప్పుడు చర్మానికి సన్‌స్క్రీన్ రాసుకోవాలి. అదేవిధంగా అవసరాన్ని బట్టి డెర్మటాలజిస్ట్ సలహా మేరకు సి–విటమిన్ అధికంగా లభించే సీరంను చర్మానికి రాసుకోవాలి. ఇది చర్మ సంరక్షణకు ఎంతగానో ఉపకరిస్తుందట.

చర్మంలో తేమ స్థాయిలు తగ్గకుండా ఉండేందుకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ప్రత్యేకించి మెడ భాగంలో, కళ్ల కింద మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవాలి. రోజుకు రెండుసార్లు శుభ్రమైన నీటితో ఫేస్ వాష్ చేసుకోవాలి. ముఖం కడుక్కునేటప్పుడు చేతులతో మరీ గట్టిగా రుద్దకూడదు. ఇలా చేస్తే చర్మం పొడిబారిపోయే ప్రమాదముంటుందట.

మచ్చలు, మొటిమలు ఏర్పడితే వాటిని గిల్లకూడదు. అలా చేస్తే ఆ ప్రాంతం మరింత అందవిహీనంగా తయారవుతుందని చెబుతున్నారు నిపుణులు.

## నోటి ఆరోగ్యానికి...

మన పేగుల్లోనే కాదు... నోట్లోనూ సూక్ష్మజీవులుంటాయట. వాటినే ఓరల్ మైక్రోబయోమ్‌గా చెబుతారు. వాటిలో కొన్ని దంతాలు, చిగుళ్లకు మేలు చేస్తే, మరికొన్ని దంతక్షయానికి, నోటి దుర్వాసనకి కారణమవుతాయి.



మనం తీసుకునే ఆహారమే ఏవి పెరగాలన్నది నిర్ణయిస్తాయట. కాబట్టి, ఇంటిల్లిపాదికీ ఏం అందిస్తున్నారో గమనించుకుంటూ ఉండండి. ఇదే పెద్ద సమస్య. హానికర సూక్ష్మజీవుల వృద్ధికి సాయపడటమే కాదు... యాసిడ్ల ఉత్పత్తికీ, దంతాల మీద ఎనామిల్ పొర దెబ్బతినడానికీ కారణమవుతుంది. కాబట్టి, చక్కెర ఎక్కువగా ఉండే స్వీట్లు, కేకులు, పానీయాలతోపాటు ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్స్ ఉండే పదార్థాలకీ దూరంగా ఉండాలి.

బదులుగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలతో పాటు పీచు ఎక్కువగా ఉండే ఆహారాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇవి మంచి బ్యాక్టీరియా వృద్ధికి సాయపడతాయి. ఘాటుగా ఉంటుందని వెల్లుల్లిని త్వరగా ఇష్టపడం కదా! కానీ దీన్ని తరచుగా తీసుకోవాలి. దీనిలోని అలిసిన్... చేటు చేసే బ్యాక్టీరియాతో పోరాడి, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. బెర్రీల్లోని పాలీఫినాల్స్ కూడా నోటి ఆరోగ్యాన్ని కాపాడేవే. చీజ్ లాలాజలం ఉత్పత్తికి సాయపడుతుంది. దీంతో యాసిడ్ల ప్రభావం తగ్గడంలో తోడ్పడుతుంది. పులిసిన ఆహారమూ మేలు చేసేదే. అయితే ఏ ఒక్క సూపర్ ఫుడ్డో నోటి ఆరోగ్యానికి మేలు చేయదు. సమతుల ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే బ్రషింగ్, ఫ్లాసింగ్‌పైనా సరైన శ్రద్ధ పెట్టాలి. గమనించుకుంటారుగా మరి?

## ఇవి తింటే.. ఆర్థరైటిస్ పరార్

పచ్చి బొప్పాయి: సాధారణంగానే పచ్చి బొప్పాయి లో పపెయిన్ అనే యాంటి ఇన్‌ఫ్లమేటరీ కాంపౌండ్ ఉంటుంది. అది కీళ్ల నొప్పి, కండరాలు పట్టేయడం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఆర్థరైటిస్‌తో బాధపడేవాళ్లు పచ్చి బొప్పాయిని తరచూ తీసుకోవాలి. పరగడుపున బొప్పాయి పండును తీసుకున్నా ఉపశమనం లభిస్తుంది.

తెల్ల నువ్వులు: ఇందలోని క్యాల్షియం, కాపర్ ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. ఎక్కువ క్యాల్షియాన్ని అందించడంలో తెల్ల నువ్వులు ముందు వరుసలో ఉంటాయి.

మునగ: ఇందులోని క్యాల్షియం, ఫాస్పరస్ ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అలాగే మునగలోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆర్థరైటిస్, గాయపడిన ఎముకల చికిత్సలో తోడ్పడతాయి.

నానబెట్టిన అంజీరా: ఎండిన అంజీరాల్లో ఫైటోకెమికల్స్, పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి అప్పటికే ఇబ్బంది పెడుతున్న ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించి, కొత్త సమస్య రాకుండా చేస్తాయి. అయితే, ఎండిన అంజీరా కాకుండా వాటిని నానబెట్టి తింటే ఆరోగ్యానికి మంచిది.

చియా గింజలు: ఈ గింజల్లో ఆల్ఫా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడేవాళ్లు ఈ గింజలను రోజూ నీళ్లలో నానబెట్టుకుని తాగాలి.

మెంతులు: వీటిలోని లినోలెనిక్, లినోలిక్ ఆమ్లాలు కీళ్లనొప్పిని తగ్గిస్తాయి. ఒక టీస్పూన్ మెంతులను కప్పు నీళ్లలో బాగా మరిగించి, వడగట్టిన తర్వాత ఆ నీళ్లను తాగితే మంచి గుణం కనిపిస్తుంది.



## చల్లటి రోజుల్లో కాస్త తక్కువగా

శరీరానికి నీటి అవసరం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఇప్పుడు చల్లని వాతావరణం ఉంటున్నది. ఇక ముందు చల్లదనం ఇంకా పెరుగుతుంది. కాబట్టి వర్కవుట్స్ చేసేముందు తాగే నీళ్లు కాస్త తగ్గించాలి. సాధారణంగా ఉదయాన్నే రెండు గ్లాసుల నీళ్లు తాగాలి. నిమ్మరసం, తేనె కలుపుకొని తాగాలనే నియమాలు పాటించేవాళ్లు ఎప్పుడూ ఒక కొలమానం పెట్టుకుని తాగుతుంటారు. జీర్ణవ్యవస్థలో నీరు తక్కువగా ఉంటుంది. ఆ నీరు జీర్ణాశయం, మూత్రాశయం చేరినప్పుడు వర్కవుట్స్ చేస్తే అసౌకర్యంగా ఉంటుంది. సరిగా చేయలేరు. వాతావరణం ఏ రోజు చల్లగా ఉంటే ఆ రోజు నీళ్లు తక్కువగా తాగాలనే నియమం తప్పక పాటించాలి. ఎండ ఉంటే ఎక్కువ నీళ్లు తాగాలి. కాబట్టి నీళ్లు తాగిన తర్వాత కాస్త ఆలస్యంగా వర్కవుట్స్ మొదలుపెట్టాలి. నీటి యాజమాన్యం మొక్కల పెంపకానికే కాదు శరీరా ఆరోగ్యానికీ అవసరమే!

ఒత్తిడి పెంచడం ద్వారా విరేచనం సాఫీగా వచ్చేందుకు ప్రయత్నించేవాళ్లు కూడా ఎక్కువగా నీళ్లు తాగుతారు. ఈ అలవాట్లు ఉంటే వ్యాయామం చేసేప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు శరీరం కోల్పోయే






## కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు అదానీ, ఎన్‌టీపీసీ నుంచి దరఖాస్తులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక ప్రాజెక్టుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్టీపీసీ, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ వంటి సంస్థలు దరఖాస్తు సమర్పించాయి. యూరియా తయారీ కోసం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొత్తం 7 దరఖాస్తులు రాగా.. అందులో యూరియా ప్రాజెక్టుకు అదానీ గ్రూపు దరఖాస్తు చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది.

# బంగారం, వెండికి మళ్లీ రెక్కలు..



దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, డాలర్ విలువ తగ్గడం, చమురు మంటలతో ఈ లోహాలకు (Gold, Silver Prices) డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ వేళ గిరాకీ పెరగడంతో వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ విపణిలో ఉదయం 10 గంటల ప్రాంతంలో 24 క్యారెట్ల మేలిమి పసిడి 10 గ్రాముల ధర రూ.1,58,900 పలికింది. క్రితం ముగింపుతో పోలిస్తే పుత్తడి దాదాపు రూ.4 వేల మేర పెరగడం గమనార్హం. ఇక, కేజీ వెండి ధర రూ.2,43,200 పలికింది. ఒక్క రోజే దీని ధర రూ.6వేల పైనే పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4435.20 డాలర్లకు చేరింది. ఔన్సు వెండి ధర 67 డాలర్లు పలికింది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లోనూ ఈ లోహాల ధరలు పెరిగాయి. గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1.53లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ కేజీ ధర రూ.2.41లక్షలుగా కొనసాగుతోంది.

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతో చమురు ధరలు వరుసగా మూడోరోజు పెరిగాయి. ఆసియా మార్కెట్‌లో బ్రెండ్ క్రూడ్ బ్యారెల్ ధర 97 డాలర్లు పలికింది. అటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడికానున్న వేళ డాలర్ విలువ తగ్గింది. యూఎస్ డాలర్ సూచీ రెండు వారాల కనిష్ఠానికి పడిపోయింది. ఈ పరిణామాల వేళ బంగారంలో పెట్టుబడులు శ్రేయస్కరమని మదుపర్లు భావించడంతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది.

ఇదిలా ఉండగా.. ఈ వారంలో అమెరికా ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్, కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ గణాంకాలు వెల్లడి కానున్నాయి. ఫెడ్ వడ్డీరేట్లను నిర్ణయించడంలో ఇవి కీలకం కావడంతో మదుపర్లు వీటిపై దృష్టిసారించారు. దీంతో రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరలు మరింత ఊగిసలాటకు గురయ్యే అవకాశం ఉన్నట్లు బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఎయిరిండియాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దుతాం




ఎయిరిండియా ఒక కీలక కొత్త దశలోకి ప్రవేశిస్తున్నందున ప్రయాణికుల విశ్వాసాన్ని తిరిగి పెంపొందించుకోవాలని, ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకోవాలని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. ఎయిరిండియాకు ఛైర్మన్‌గా కూడా ఉన్న చంద్రశేఖరన్.. ఆ సంస్థ ఉద్యోగులతో టౌన్ హాల్‌లో జరిగిన సమావేశంలో పై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఎయిరిండియాకు కొత్త ఎండీ, సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్న టెవోల్డే గెబ్రెమరియంను ఆయన పరిచయం చేశారు. టెవోల్డే మాట్లాడుతూ ఎయిరిండియాకు పూర్వ వైభవాన్ని తీసుకొని రావడానికి అందరం కలిసి కృషి చేయాలని ఉద్యోగులను కోరారు. 'మేం ఎయిరిండియాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దుతాం' అని ఆయన ప్రకటించారు. గతేడాది జరిగిన ఘోర ప్రమాదం తర్వాత పెరుగుతున్న నష్టాలు, కార్యకలాపాల అంతరాయం, నియంత్రణ సంస్థల పరిశీలన పెరగడంతో సతమతమవుతున్న ఎయిరిండియాకు ఈ నాయకత్వ మార్పు ఒక కీలక సమయంలో చోటుచేసుకోనుంది. ఇది నాకు మంచి అవకాశం..: విమానయాన రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న గెబ్రెమరియం, అందులో 11 ఏళ్లకు పైగా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేశారు. ఎయిరిండియాకు గొప్ప చరిత్ర, బలమైన బ్రాండు, అపార సామర్థ్యం ఉందని ఉద్యోగులను ఉద్దేశించి చేసిన తన తొలి ప్రసంగంలో తెలిపారు. సుమారు 20 ఏళ్ల కిందట ముంబయిలో పనిచేస్తున్నప్పుడు ఎయిరిండియాతో తనకున్న అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో విమానయాన రంగంలో ఎయిరిండియా అగ్రస్థానంలో ఉందని అన్నారు. ఆ సంస్థను తిరిగి ఆ స్థానానికి తీసుకొని రావడానికి తోడ్పడే అవకాశం ఇప్పుడు తనకు లభించిందని చెప్పారు. భద్రత అనేది విమానయాన సంస్థకు అత్యంత ప్రాధాన్యాంశంగా ఉండాలని, తమ ఆందోళనలను వ్యక్తం చేసేందుకు ఉద్యోగులకు అవకాశం కల్పించాలని ఆయన అన్నారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, అమెరికా వడ్డీ రేట్లు పెంపు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో రెండో సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 75,970.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,132.81) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో ఓ దశలో 75,553.35 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 555.23 పాయింట్లు క్షీణించి 75,577.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.81గా ఉంది. సెన్సెక్స్ 30లో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. బీఈఎల్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యునిలీవర్, ఇండిగో, హెచ్‌సీఎల్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 98.39 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,400.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### శాంసంగ్ ఇండియాలో 100 మంది ఎగ్జిక్యూటివ్‌లపై వేటు..?




టెక్ దిగ్గజం శాంసంగ్ ఇండియా పలు విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగులపై వేటు వేసింది. వీటిల్లో టెలివిజన్, హోమ్ అప్లయన్సెస్ వంటి విభాగాలున్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లుతెలుస్తోంది. డిమాండ్ బలహీనపడటం, విస్తృత స్థాయిలో పునర్వ్యవస్థీకరణ వంటివి కూడా దీనికి కారణంగా నిలిచాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కంపెనీ ఇప్పటి వరకు 80-100 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. కంపెనీలో బ్యాచ్‌ల వారీగా లేఆఫ్‌లు వేసే అవకాశం ఉంది. బ్రాంచ్ మేనేజర్లు, టీమ్ లీడర్లు, ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ స్థాయి వారిని కూడా తొలగించనున్నట్లు తెలుస్తోంది.

# టాటా బోయింగ్ ఏరోస్పేస్ మరో ఘనత



అంతర్జాతీయ రక్షణ రంగంలో టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్) మరో ఘనత సాధించింది. హైదరాబాద్‌లోని తమ అత్యాధునిక తయారీ కేంద్రం నుంచి ఏహెచ్-64ఈ అపాచీ అటాక్ హెలికాప్టర్ కోసం 400వ ఫ్యూజ్‌లేజ్‌ను విజయవంతంగా ఉత్పత్తి చేసినట్లు కంపెనీ వెల్లడించింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, బోయింగ్ సంయుక్తంగా టీబీఏఎల్‌ను ఏర్పాటు చేశాయి. హైదరాబాద్‌లో 52,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ అత్యాధునిక ప్లాంట్‌లో 750 మందికి పైగా ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. అధునాతన రోబోటిక్స్, ఆటోమేషన్ సాంకేతికతలతో ఇక్కడ అపాచీ ఫ్యూజ్‌లేజ్ ఏరోస్ట్రక్చర్‌లను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారైన ఫ్యూజ్‌లేజ్‌లను అంతర్జాతీయంగా సరఫరా చేస్తున్నారు. అమెరికా ఆర్మీ హెలికాప్టర్లతో పాటు, 2025లో భారత సైన్యానికి అందిన 6 అపాచీ హెలికాప్టర్లలోనూ హైదరాబాద్‌లో తయారైన ఫ్యూజ్‌లేజ్‌లనే అమర్చారు. కాగా, భారత వైమానిక దళం ఇప్పటికే 22 ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను విజయవంతంగా నడుపుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 19 దేశాలు దాదాపు 1,300 అపాచీ హెలికాప్టర్లను వినియోగిస్తున్నాయి.






## ఏఐటీఏ అధ్యక్ష రేసులో పేస్

దిగ్గజ ఆటగాడు లియాండర్ పేస్.. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) అధ్యక్ష రేసులోకి వచ్చాడు. అతడికి మద్దతుగా నిలవాలని బెంగాల్ టెన్నిస్ సంఘం (బీటీఏ) నిర్ణయించింది. పేస్ ప్రస్తుతం బీటీఏకు అధ్యక్షుడిగా ఉన్నాడు. ఏఐటీఏ అధ్యక్ష పదవికి డేవిస్ కప్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ ఇప్పటికే పోటీలో నిలిచాడు. అతను దిల్లీ లాన్ టెన్నిస్ సంఘం (డీఎల్‌టీఏ)ను నడిపిస్తున్నాడు. పేస్‌ను ఏఐటీఏ అత్యున్నత పదవికి పోటీలో నిలపాలని బీటీఏ సోమవారం తీర్మానించింది. ఏఐటీఏ ఎన్నికలకు ఇంకా తేదీ నిర్ణయం కాలేదు. ప్రస్తుతం ఏఐటీఏకు తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న చింతన్ పరిఖ్ కూడా ఈ పదవికి పోటీలో ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి.

# ఆమె ఓకే అంటేనే.. లేదంటే విడాకులు ఇచ్చేస్తుంది: ఆశిశ్ నెహ్రా

భారత జట్టు ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై తరచూ విమర్శలొస్తున్న విషయం తెలిసిందే. జట్టు ఎంపికలో కొంత మందికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఎంపికైన ఆటగాళ్లలో కొందరికి ఒక్కసారి కూడా తుది జట్టులో చోటు కల్పించకపోవడం, ఆటగాళ్ల స్థానాలను మార్చడంతో గంభీర్ విమర్శల పాలవుతున్నాడు. దీంతో అతడిని కోచ్ బాధ్యతల నుంచి తప్పించాలనే డిమాండ్ కొన్నాళ్ల నుంచి వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా కొత్త కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్, ఆశిశ్ నెహ్రా పేర్లను క్రికెట్ విశ్లేషకులు, అభిమానులు సూచిస్తున్నారు. దీనిపై ప్రస్తుతం ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కోచ్‌గా ఉన్న నెహ్రా స్పందిస్తూ.. తనకు అలాంటి నిర్దిష్టమైన ఆశయం ఏమీ లేదని పేర్కొన్నాడు. అయితే, ఆ బాధ్యత కోసం తనను సంప్రదిస్తే.. తాను అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించాడు. ''అవును, అది గొప్ప గౌరవం. కానీ అలాంటి విషయాల గురించి ఎప్పుడూ ప్రణాళికలు సిద్ధం చేసుకోను. భవిష్యత్తులో చూద్దాం. ఇప్పటికైతే నాకు అలాంటి ఆశయం ఏమీ లేదు. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ (GT) కోచ్‌గా సంతోషంగా ఉన్నాను. టీమ్‌ఇండియా కోచ్‌గా వస్తానా?లేదా అనే దానిపై ఇప్పుడు సమాధానం చెప్పడం చాలా కష్టం. ముందుగా నా భార్యను అడగాలి. ఆమెకు చెప్పకుండా ఏమైనా చేశానంటే.. విడాకులు ఇచ్చే ప్రమాదం ఉంది'' అని సరదాగా అన్నాడు. ఇక జాతీయ జట్టుకు కోచింగ్ అంటే ప్రయాణాలతో కూడిన వ్యవహారమని.. ఏడాదిలో దాదాపు ఎనిమిది లేదా తొమ్మిది నెలలు జట్టుతోనే ఉండాల్సి వస్తుందన్నాడు. ఇది అంత సులభమైన విషయం కాదని పేర్కొన్నాడు. అదే విధంగా.. 2027 వన్డే ప్రపంచ కప్ భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉంటారా లేదా అని ఇప్పుడే చెప్పలేమని నెహ్రా అన్నాడు. వరల్డ్ కప్‌నకు ఇంకా 13 నెలల సమయం ఉందని, ప్రస్తుతానికి రోకో (Roko) జట్టులోకి వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేమని తెలిపాడు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికి వన్డేలు మాత్రమే ఆడుతోన్న రోహిత్, కోహ్లీ.. సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభమయ్యే వెస్టిండీస్ వన్డే సిరీస్‌తో బరిలోకి దిగనున్నారు.




# పాక్‌కు షాకిచ్చిన అఫ్గాన్ క్రికెట్ బోర్డ్..




భారత్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం అఫ్గాన్ క్రికెట్ బోర్డు (ACB) ఓ ప్రచార వీడియో రూపొందించింది. ఇందులో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (PoK), గిల్గిట్-బల్టిస్థాన్‌లను భారత్‌లో భాగంగా చూపింది. దీంతో ఇరుదేశాల మధ్య కొత్త దౌత్యపరమైన వివాదానికి తెరలేచింది. ఆ మ్యాప్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (PCB).. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్యలకు దిగలేదు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని చూస్తోంది. సరిహద్దు ఘర్షణలు, వైమానిక దాడులతో అఫ్గాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న తరుణంలో ఈ తాజా వివాదం తలెత్తింది. దేశంలో జరుగుతోన్న దాడులకు కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తున్న తెహ్రిక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (TTP)కు అఫ్గాన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అఫ్గాన్, భారత్ మధ్య సెప్టెంబరు 13 నుంచి దిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తోంది.

## మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదేమో.. పాక్‌కు టీమ్‌ఇండియా ఫ్యాన్స్ కౌంటర్

మహిళల ఆసియా కప్‌లో భారత్ చేతిలో ఘోర ఓటమి చవిచూసినా.. పాకిస్థాన్ సెమీ ఫైనల్స్‌కు చేరింది. సోమవారం దుబాయ్‌లో తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో హాంకాంగ్, చైనాను పాక్ 72 పరుగుల తేడాతో ఓడించి సెమీస్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ వహాబ్ రియాజ్ స్టేడియంలో ఉన్న పాక్ అభిమానులతో ముచ్చటించాడు. ఈ క్రమంలో ఓ అభిమాని వహాబ్‌కు ఒక అభ్యర్థన చేశాడు. పాకిస్థాన్ అభిమానులకు ఆసియా కప్ ట్రోఫీ వద్దని, కానీ పాక్ మహిళా జట్టు భారత్‌ను ఓడించాలని విజ్ఞప్తి చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. టీమ్‌ఇండియా ఫ్యాన్స్ కౌంటర్ ఇస్తున్నారు. ''వారు (పాక్) క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా ఆడతారు. కానీ రెండు సందర్భాల్లోనూ ఓటమి శాశ్వతం'' అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. ''మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదనుకుంటా.. ఫైనల్‌కు రండి.. ఈ సారి అంతకు మించిన ట్రీట్ టీమ్‌ఇండియా ఇస్తుంది'' అని మరో యూజర్ అన్నాడు.




## పీసీబీ ఇంకా వేల డాలర్లు బకాయి ఉంది: పాక్ మాజీ కోచ్ జేసన్ గెలెస్పీ

ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ టెస్టు కోచ్‌గా పని చేసిన విషయం తెలిసిందే. పాక్ కోచ్‌గా ఉన్నప్పుడు తనకు ఎదురైన చేదు అనుభవాలను తాజాగా గుర్తుచేసుకున్నాడు. పాక్ చీఫ్ సెలక్టర్ అకిబ్ జావేద్ తనను అగౌరవపరిచిన సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. కోచ్ పదవి కాలానికి సంబంధించి పీసీబీ తనకు ఇంకా వేల డాలర్లు బాకీ ఉందని పేర్కొన్నాడు. ''అకిబ్ జావేద్‌ను చీఫ్ సెలక్టర్‌గా నియమించడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆ క్షణం నుంచే పాకిస్థాన్ క్రికెట్ (Pakistan Cricket)తో నాకున్న సంబంధం పూర్తిగా మారిపోయింది. ప్రతి విషయంలోనూ ఆయన పెత్తనమే కొనసాగింది. టెస్టు జట్టు బాధ్యతలు చూడటం, ఆటగాళ్లు, సిబ్బందిని పర్యవేక్షించడం, జట్టు ఎంపిక.. ఇలా ఏ విషయంలోనూ ఎటువంటి పాత్ర లేని స్థితికి వచ్చాను. ఆ అనుభవం నన్ను పూర్తిగా నిరుత్సాహపరిచి, కోచింగ్‌పై విరక్తి కలిగించింది. అది నాపై మానసికంగా ప్రభావం చూపింది. నన్ను నేను సందేహించుకునేలా చేసింది. అకిబ్ జావేద్ నా పట్ల పూర్తిగా అగౌరవంగా ప్రవర్తించాడు. అతడికి బోర్డు (PCB) మద్దతు ఉంది. అందుకే తనను ఎవరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతోన్న పరిణామాలను చూస్తుంటే చాలా బాధగా ఉంది. దీనికి అసలు కారకుడు అకిబ్ జావేద్.



# 'కాకా' నుంచి అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ రిలీజ్



**వుదయం సినిమా:** మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి 'వాల్తేరు వీరయ్య' సక్సెస్ తర్వాత ప్రతిష్టాత్మక చిత్రం 'కాకా'తో రాబోతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. భారీ స్థాయిలో హై-ఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌లో మెగాస్టార్ ను రెండు డిఫరెంట్ షేడ్స్‌లో చూపించడంతో సినిమాపై మాస్‌లో భారీ క్రేజ్ ఏర్పడింది.ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న అనస్వర రాజన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చేతుల్లో పుస్తకాలు, వైట్ కోట్, స్టెతస్కోప్, భుజంపై బ్యాక్‌ప్యాక్‌తో సింపుల్, అమాయకంగా కనిపించే అమ్మాయిగా అనస్వరను ప్రజెంట్ చేశారు. ఆమె సింపుల్ లుక్ పోస్టర్‌కు ఎంతో సహజమైన ఫీల్‌ను తీసుకురావడంతో పాటు, ఆమె మెడికల్ కాలేజ్ స్టూడెంట్ పాత్రకు తగ్గట్టుగా ఉంది.ఆమె వెనుక పడిన నీడ పోస్టర్ మూడ్‌ను పూర్తిగా మార్చేస్తోంది. గోడపై మెగాస్టార్ చిరంజీవి సిల్హౌట్ కనిపిస్తూ, అనస్వర సాఫ్ట్, చీర్‌ఫుల్ అప్పియరెన్స్‌కు ఆసక్తికరమైన కాంట్రాస్ట్‌ను క్రియేట్ చేస్తోంది. అనస్వరను రక్షించడానికి చిరంజీవి 'సత్యం' పాత్ర అక్కడ ఉందని హింట్ ఇంస్తోంది. ఈ కంపోజిషన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. అనస్వరను మేకర్స్ "హార్ట్ ఆఫ్ కాకా"గా ఆమె పాత్రను "అమ్ములు పాప"గా రివిల్ చేశారు.ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్ గా చేస్తున్నారు. భాను-నందు డైలాగ్స్ రాస్తున్నారు.'కాకా' 2027 జనవరి 13న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## వుదయం సినిమా MOVIE TIME!

# 'సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్



**వుదయం సినిమా:** హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'సర్దార్' మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2'తో థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిధిగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీను హాజరయ్యారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో కార్తి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకలో మీ అందరినీ చూడడం చాలా సంతోషంగా ఉంది. ఈ వేడుకకు అతిథులుగా వచ్చిన రవి గారికి, బోయపాటి గారికి, కళ్యాణ్ గారికి, అనిల్ గారికి, ప్రసాద్ గారికి, శేష్ కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. 'సర్దార్' సినిమాకు ఇక్కడ చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉంది. 'సర్దార్ 2' నా కెరీర్‌లో చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్. ఇలాంటి స్పై క్యారెక్టర్ దొరకడం నా అదృష్టం. నిజానికి గూఢచారులకు ఎలాంటి గుర్తింపు ఉండదు. కానీ వాళ్ల పని వాళ్లు చాలా నిజాయితీతో, ఏదీ ఆశించకుండా చేస్తారు. 'సర్దార్ 2' చూసే ముందు 'సర్దార్' సినిమా మరొకసారి చూడమని కోరుతున్నాను. అది యూట్యూబ్‌లో ఫ్రీగా ఉంది. అలా ఆ సినిమా చూస్తే మీరు 'సర్దార్ 2'కి ఇంకా స్ట్రాంగ్‌గా కనెక్ట్ అవుతారు. ఇంగ్లీష్ సినిమాలు చూస్తున్నప్పుడు ఇంత స్టైలిష్‌గా యాక్షన్ సినిమాలు చేయడం మనకు కుదరదా అని అనిపించేది. అది ఈ సినిమాతో తీరింది. మిత్రన్ గారు అద్భుతమైన స్క్రిప్ట్ రాశారు. మ్యూజిక్, యాక్షన్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ఇలాంటి పెద్ద సినిమాలు తీయడం అంత ఈజీ కాదు. హీరో అడివి శేష్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. నా ఫేవరెట్ సినిమాల్లో కార్తీ గారివే ఎక్కువ. ఆవారా, ఖైదీ, 'సత్యం సుందరం' ఈ సినిమాలన్నీ ఇష్టం. అలాగే నాకు 'సర్దార్' సినిమా కూడా చాలా ఇష్టం. స్పై సినిమాల్లో మాస్ మసాలా ఫిలిం 'సర్దార్'. ఈ సినిమాని నేను థియేటర్‌లో చాలా ఎంజాయ్ చేశాను. సర్దార్ 2 ఫస్ట్ డే ఫస్ట్ షో చూస్తాను.

# ప్రేక్షకులకు నచ్చే మూవీ 'మహేంద్రగిరి వారాహి'



హీరో సుమంత్

**సినిమా:** సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్. 'మహేంద్రగిరి వారాహి'. ఈ సందర్భంగా హీరో సుమంత్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మహేంద్రగిరి వారాహి ప్రమోషన్స్ చాలా జోరుగా చేస్తున్నారు కదా?** –అవునండి. ఈ మధ్య కాలంలో నా నుంచి వస్తున్న చాలా బిగ్ బడ్జెట్ సినిమా ఇది. నిర్మాతలు చాలా పెద్ద స్కేల్ లో తీశారు. అలాగే ప్రమోషన్స్ కూడా చాలా అగ్రెసివ్‌గా చేస్తున్నారు. హిందీ, తమిళ్‌లో కూడా రిలీజ్ అవుతుంది.

**ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిన్న మనవడు, పెద్ద మనవడు స్పీచ్ వైరల్ అయింది కదా?** –అఖిల్ గురించి సరదాగా అన్నాను. తనని అయ్యగారు అని పిలుస్తుంటారట. అందరి మనవళ్లలో నేనే పెద్దవాడిని. పెద్దవాడిని, అయ్యగారు అంటే బాగుంటుంది కదా అనే ఉద్దేశంలో సరదాగా అన్నాను.

**ఈ కథ చెప్తున్నప్పుడు మీకు ఎక్కడ బాగా కనెక్ట్ అయింది?** –కథ మొత్తం నాకు నచ్చింది. ఇంటర్వెల్ లో, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. ఆడియన్స్‌కి మంచి హై ఇస్తాయి. సంతోష్ ఈ కథని సింగిల్ సిట్టింగ్ లో చెప్పారు. నాకు చాలా నచ్చింది. **ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?** – నేను యూట్యూబ్ లో మూఢ నమ్మకాలను ఎక్స్‌పోజ్ చేసే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. ఆ క్యారెక్టర్ గురించి ఇప్పుడే అంతకంటే ఎక్కువ చెప్పకూడదు. ఇది డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్. **సిద్దు క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** –సిద్ధు ఒక సీరియస్ క్యారెక్టర్ చేశాడు. మా ఇద్దరి మధ్య ఒక సీన్ ఉంటుంది. అది సినిమాకే హైలెట్‌గా ఉంటుంది. చూసిన వాళ్లందరూ అది చాలా అద్భుతంగా వచ్చింది.

# 'స్క్రీన్‌ప్లే మాస్టర్ సుకుమార్' ఆవిష్కరణ

**వుదయం సినిమా:** మనిషి మెదడు తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి నిరంతరం కథలను ఆశ్రయిస్తుంది. సినిమా అనే అద్భుతమైన మాధ్యమం ద్వారా ప్రేక్షకుడి మెదడుతో ఆడుకునే మానసిక చదరంగాన్ని విశ్లేషిస్తూ వస్తున్న అరుదైన పుస్తకం 'స్క్రీన్‌ప్లే మాస్టర్ సుకుమార్'. డాక్టర్ ప్రవీణ్ యజ్జల రచించిన ఈ



గ్రంథం, కేవలం దర్శకుడు సుకుమార్ సినిమాల కథల గురించి కాకుండా ఆ కథల వెనుక ఉన్న బలమైన పునాదులను, ఆయన స్క్రీన్ ప్లే నిర్మాణంలోని మేధస్సును అత్యంత లోతుగా ఆవిష్కరిస్తుంది. పాశ్చాత్య స్క్రీన్ ప్లే సిద్ధాంతకర్తలు రాబర్ట్ మెకీ, జాన్ ట్రూబీ వంటి వారి సూత్రాలను మన నేటివిటీకి, మట్టి వాసనకు సుకుమార్ ఎలా అద్భుతంగా అన్వయించారో ఈ పుస్తకం ఉదాహరణలతో చర్చిస్తుంది. ఆదర్శవంతమైన పాత్రలను కాకుండా, ఆత్మగౌరవ గాయాలున్న సహజమైన మనుషులను సృష్టించి వారి మానసిక సంఘర్షణ ద్వారా కథను నడిపించే సుకుమార్ శైలిని రచయిత ఇందులో అక్షరబద్ధం చేశారు. మేధోపరమైన చిక్కుముడులకు భావోద్వేగాలను జోడించి ఆయన చేసిన ప్రయోగాలు, పల్లెటూరి రాజకీయాలను ప్రపంచ స్థాయి కథన పద్ధతుల్లో మలిచిన తీరును ఈ పుస్తకం కళ్లకు కడుతుంది.

# యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'

**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవర కొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతుండటం విశేషం. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక వైష్ణవి చైతన్య, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



కథానాయిక వైష్ణవి చైతన్య

**షార్ట్ ఫిలిమ్స్ నుంచి వచ్చిన మీరు, ఒక తెలుగమ్మాయిగా స్టార్‌డమ్ చూడటం ఎలా ఉంది?** చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రుల సపోర్ట్ తో పాటు సినీ పరిశ్రమ, ప్రేక్షకుల మద్దతు తోనే ఇక్కడివరకు వచ్చాను. పలువురు తెలుగమ్మాయిలు సినీ పరిశ్రమలో వారి వారి ప్రత్యేకతను చాటుతున్నారు.

**ఎపిక్ సినిమాలో ఆనంద్, మీరు పోషించిన పాత్రలు ఎలా ఉండబోతున్నాయి?** ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్ గా, కామ్ గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. నేను పోషించిన కదలి పాత్ర స్ట్రాంగ్ అమ్మాయి. తన కోసం తాను నిలబడే అమ్మాయి. క్లారిటీ ఉన్న అమ్మాయి.

**'తన కోసం తాను నిలబడే అమ్మాయి' అంటున్నారు. కదలి పాత్ర మీ నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందా?** ప్రతి ఒక్కరిలోనూ కదలి పాత్ర ఉంటుంది. కానీ, కుటుంబం వల్లనో, సమాజం వల్లనో మనలోని ఆ వెర్షన్ లోపలే ఉండిపోతుంది. బయటకు రాదు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదోక సమయంలో వారి కోసం వారు నిలబడాలి. అందుకే కదలి పాత్ర నా మనసుకు బాగా దగ్గరైంది.

**బేబీ తర్వాత కథల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?** కథలోనూ, నా పాత్రలోనూ కొత్తదనం ఉండాలి. ఆ పాత్రలో నన్ను నేను చూసుకోగలగాలి. ఎపిక్ ఎంచుకోవడానికి కారణమదే.

# 'TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్' వేడుక



**వుదయం సినిమా:** దక్షిణాది మీడియా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులు, మీడియా సంస్థలు, డిజిటల్ క్రియేటర్ల సేవలను గుర్తించి పురస్కరించేందుకు 'TNIT మీడియా అకాడమీ' ఆధ్వర్యంలో 'TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ 2026'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెల్లడించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో చలనచిత్ర రంగానికి చెందిన ప్రముఖులు, సీనియర్ ఎడిటర్లు, అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, పాత్రికేయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. యాక్టర్ అలీ మాట్లాడుతూ "అందరికీ నమస్కారం. అవార్డులు నటులకు, దర్శకులకు, టెక్నీషియన్లకు, మిగతా అన్ని డిపార్ట్‌మెంట్లకు కూడా దొరుకుతుంటాయి. కానీ వాళ్లందరినీ హైలైట్ చేసే ఒక రిపోర్టర్‌కు అవార్డు ఇవ్వాలనే ఆలోచన రావడం చాలా అద్భుతమైన విషయం. రఘుకి ఇలాంటి ఆలోచన రావడం చాలా ఆనందంగా ఉంది. రిపోర్టర్లకు, ఫోటోగ్రాఫర్లకు ఇలా మీడియా రంగంలోని అందరికీ అవార్డులు ఇవ్వడంతో పాటు ఒక హెల్త్ కార్డు కూడా ఇస్తే బాగుంటుందని నా ఆలోచన. దానికి నా సపోర్ట్ కూడా ఉంటుంది. ఈ హెల్త్ కార్డు ప్రతి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. అవార్డు గ్రహీతలందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. అందరికీ ధన్యవాదాలు." దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ: మీడియా సినీ పరిశ్రమలోని కళాకారులను ప్రోత్సహిస్తుంది. వాళ్లు లేకపోతే మాకు గుర్తింపు లేదు. అలాంటి మీడియాను 'TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్'తో సన్మానించడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా చేస్తున్నారు.

# "గోల్డ్ స్పాట్" మూవీ గ్లింప్స్ రిలీజ్

**వుదయం సినిమా:** ర్యాడిక్స్ సినిమాస్ బ్యానర్ నిర్మిస్తున్న కొత్త మూవీ "గోల్డ్ స్పాట్". ఈ చిత్రాన్ని విజయకృష్ణ లింగమనేని ప్రెజెంట్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ రవితేజ పచ్చిపాల నిర్మిస్తున్న ఈ చిత్రంలో అభిషేక్, కాజల్ చౌదరి హీరో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు దుష్యంత్ కటికనేని ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. శ్రీ చౌదరి ఇనగంటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుష్యంత్ దగ్గర వర్క్ చేసిన వేణు కార్తికేయన్ "గోల్డ్ స్పాట్" సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ రోజు మేకర్స్ "గోల్డ్ స్పాట్" సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. "గోల్డ్ స్పాట్" సినిమా గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే – హీరోయిన్ తన ప్రాణానికి ప్రాణమైన తన స్నేహితుడు రామ్ గురించి చెబుతూ ఈ టీజర్ ఆసక్తికరంగా మొదలువుతుంది. 'అమ్మను చిన్నప్పుడే తీసుకువెళ్లిపోయిన ఆ దేవుడే, నాకు రామ్ ను పరిచయం చేశాడంటూ.. హీరోయిన్ చెప్పడం ఆమె అతన్ని ఎంతగా ప్రేమిస్తుందో తెలియజేస్తోంది. 'మనకు జీవితంలో ఎంతోమంది పరిచయమవుతుంటారు. కానీ ఒక్కరే జీవితంగా మారిపోతారు..' అంటూ హీరోయిన్ చెప్పిన డైలాగ్ హార్ట్ టచింగ్ గా ఉంది.



# 'పంచనామా' ట్రైలర్..

**వుదయం సినిమా:** తెలుగు ప్రేక్షకులను అలరించేలా విభిన్నమైన, ఆసక్తికరమైన కథాంశాలతో ముందుకు సాగుతున్న జీ5 మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్‌ను అందుబాటులోకి తీసుకురాబోతుంది. అదే 'పంచనామా' సిరీస్. ప్రముఖ నటు డు భరత్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సెప్టెంబర్ 11 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కాబోతుంది. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉండనున్నాయి. ఉత్కంఠభరితమైన దర్యాప్తుతో పాటు భావోద్వేగాలు, మిస్టరీ, క్రైమ్ అంశాలను ఈ సిరీస్‌లో ఆసక్తికరంగా మేళవించారు. తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్ రిలీజైంది. ఆది, ప్రవీణ్, జోసెఫ్ అనే ముగ్గురు అత్యంత దారుణంగా చనిపోతారు. అయితే వీళ్ల చావులను యాక్సిడెంటల్ డెత్‌గా క్లోజ్ చేస్తారు. కానీ ఈ ముగ్గురువి యాక్సిడెంటల్ చావులు కావనీ.. ఎవరో చంపేశారని వాళ్ల ఫ్యామిలీ మెంబర్స్ పోలీసులను మళ్ళీ ఆశ్రయిస్తారు. ఇన్వెస్టిగేషన్ చేస్తున్న టైమ్‌లో జై రామ్‌కు షాకింగ్ విషయాలు తెలుస్తాయి. అసలు ఆ హత్యలు చేసింది ఎవరు? ఆ హంతకుడి మోటీవ్ ఏంటీ? ఈ సిరీస్ గురించి నిర్మాత ఉదయ బాను మాట్లాడుతూ.. 'పంచనామా' ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌తో పాటు వ్యక్తిగత భావోద్వేగ ప్రయాణాన్ని కలగలిపిన కథ అని తెలిపారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.